మరణ శాసనం

సికిందర్

వర్షం వచ్చేలా వుంది....

ఆకాశం మబ్బులు కమ్ముకుంటూ, చల్లటి గాలులు వీస్తున్నాయి....

సరోజ పది గంటలకి రమ్మంది.

రిస్టువాచీని అసహనంగా చూసుకుని నిట్టూర్చాను.... ఇంకా రెండు గంటలు వేచివుండాలి! ఈ నిరీక్షణ నన్ను నిలవనీయడంలేదు!

ఇలాంటి నిరీక్షణ ఎవర్నీ నిలవనీయదు! క్షణక్షణానికీ భరింపరానిదై నిగ్రహాన్ని జయిస్తుంది, నియమ భంగం గావిస్తుంది....

లేకపోతే ఆమె ఎందుకిలా విధం తప్పి ప్రవర్తించాలి ఈ రోజున?

ఆమెకీ ఆలోచన రాకపోతే ఈపాటికీ ఏ పచ్చని ప్రకృతి మధ్యనో పరవశిస్తూ వుండేవాళ్ళం, ఎప్పటిలాగే.

కానీ ఈ రోజు ఆమె యింటికాహ్వానించింది.....

ఇది సాహసం. మరి నాదీ సాహసమే కదూ? నేనింత సాహసం ఎలా చేస్తున్నాను, మై గాడ్.

ఆలోచిస్తే నాకంతా విచిత్రంగా వుంది....అంతా అనూహ్యంగా జరిగిపోయింది. ఇలాటి మలుపు నా జీవితంలో ఆశించలేదు! ఇంత వేగంగా మలుపుతీసుకుంటుందనీ అనుకోలేదు....ఆందోళనగా ఇంకో సిగరెట్ వెల్గించుకున్నాను.

కిటికీలోంచి బయట కారుమబ్బుల్ని చూస్తూ, వారం క్రితం ఎలా నా జీవితం హఠాత్తుగా మలుపు తిరిగిందో గుర్తుచేసుకుంటోంటే, గుండెలోంచి అదురూ జలదరింపూ పుట్టుకొస్తున్నాయి....ఇంత సాహసం కూడదని హెచ్చరిస్తోంది ఒకప్రక్క అంతరాత్మ. ఛ నోర్ముయ్ అని దాని గొంతు నొక్కేస్తోంది అదుపులేని మనసు ...

సుమారు ఆరు నెలల క్రితం బిజినెస్ మాగ్నెట్ బి. జె. పి. రావ్‌కి పర్సనల్ సెక్రటరీగా కుదిరినప్పుడు నేనిక జీవితంలో స్థిరపడిపోయాననుకున్నాను. అంతకు ముందు పనిచేసిన బాస్‌లందరూ వాళ్ళంటేనే వెగటు పుట్టేలా ప్రవర్తించారు. బాస్‌లంతా కాడిస్టులేనన్న అభిప్రాయాని కొచ్చేశాను....అయితే ఈ కొత్త బాస్ దగ్గర స్థిరపడ్డాననుకున్న నెలరోజుల్లోనే, ఇతనూ కాడిస్ట్ అనిగాక ఎంత పెద్ద బాస్టర్డో తెలుసుకున్నాను.

ఇతనంటే నాకు విరక్తిలేదు. ఇతడి క్రూరమన స్తత్వాన్ని చూసి కసితో బాస్టర్డ్! అనుకు నేంతగా పగా ద్వేషం రగులుతున్నాయి. ఇతన్ని కాడిస్టుగా కంటే అంతకంటే నీచంగా బాస్టర్డు అనుకోవడంలోనే నాకు తృప్తి వుంటుంది.

కలిమి కలిగినవాడికి కరుణ కూడా వుండాలి అంటాడు

వేమన, లేదా నాశనమేనాశనం. తన దగ్గర ఉద్యోగుల మీద గాకపోయినా, ప్రపంచంలో ఏ అభాగ్యులమీద గాకపోయినా, కనీసం తనింట్లో స్వంత భార్యా బిడ్డల పై కూడా కరుణలేని పరమ నీచ కిరాతకుడు, నా బాస్ బి.జె.పి. రావ్.

ఆ రోజు నేనా దృశ్యం కళ్లారా చూసివుండకపోతే. ఎప్పుడో అతన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయేవాడ్ని.

కానీ ఇప్పుడు——

ఆడదై వుండీ అతడ్ని భరిస్తున్న భార్య వుండగా, జడుసుకొని నేను పారిపోవాలనుకోవడం ఎంత పిరికితనం!

మొట్టమొదటిసారి ఆ దృశ్యాన్ని చూసినప్పుడే అనుకున్నాను, ఎప్పుడో ఇతనికి తగిన శాస్తి జరపకుండా వదలకూడదని!

ఆ తర్వాత పదేపదే ఆ దృశ్యాల్ని చూశాను. వాటికి అంతంలేదు. ఏ మగవాడూ తన భార్యని అంతలా బాధిస్తాడని నేననుకోలేదు. నా బాస్ మాత్రం కట్టుకున్న భార్యని కాళ్ళతో, చేతులతో, కర్రతో, అందిన ప్రతి వస్తువుతో కొట్టి గాయపరుస్తాడు. రాక్షసంగా ఆమె అరుపులు, ఏడుపులు విని ఆనందిస్తాడు. ఇల్లంతా వేట కుక్కలా తరిమి భీభత్సం చేస్తాడు. ఆ పైశాచికత్వం లోంచి అనిర్వచనీయమైన అనుభూతిని ఏదో చవి చూస్తాడు. తృప్తిచెందుతాడు.

అతని కోపానికి కారణముండనవసరంలేదు. ఏ తప్పూ చేయనవసరంలేదు. వూరికే హింసించి ఆనందిస్తేగాని నిద్రపోని శాడిస్టు. తన అయిదేళ్ళ పసికూతురు చిన్నారిని కూడా వదలని రాక్షసాకారుడు. ఆ పసిపిల్ల మరో దిక్కులేక తల్లడిల్లిపోతోంది....

పిల్లల్ని ఎలా ట్రీట్ చేస్తే వాళ్ళు పెద్దవాళ్ళయి తమ పిల్లల్ని అలాగే ట్రీట్ చేస్తారని సైకాలజీ చెపుతుంది. చిన్నారి ఏం చేస్తుందో ఇప్పుడు వూహించడం కష్టమే గానీ, ఆమె తండ్రిమాత్రం బాల్యంలో అలాంటి అనుభవాలకే గురైయి ఇలా తయారయ్యాడనడానికి ఆధారముంది...

ఆ ఇంట్లోనే పనిచేసే డెభై ఏళ్ళ ముసలి రాజయ్య ఇలా అంటాడు.

"నిజం బాబయ్యా, అయ్యవోరు శానా సెడ్డవోరు.... ముప్ఫై ఏళ్ళుగా సూస్తున్నా బాబయ్యా. మానోత్వం ఇసుమంతైనా నేదుకదా మడిసిలో! ప్రేమ సూడలేదు బాబయ్యా ఎన్నడూ, ఆ అయ్య మనసులో! మడిసిలో ఏ బూతమైనా తొంగుందా అన్పిస్తది సూస్తే.... ఆ అయ్యని సయిచలేకనే మొదటి అమ్మ వురీసుకుంది, బాబయ్యా. మూడేళ్ళే కాపరం సేసింది అయ్యతో, తరువోత వచ్చిన రెండో అమ్మ పదేళ్ళు ఓపికబట్టిందెలాగో....ఆయమ్మ కూడా గింత ఇసం మింగి సచ్చిపోయింది బాబయ్యా, ఏడాదిన్నర పాప ఆ సిన్నారిని ఒగ్గిసి!...

సావుశానా భయంకరమైనది బాబయ్యా, సూడలేను. ఆ రెండు సావుల్ని సూసీక నిజంగా నీను పిచ్చోణ్నయ్యాను, బాబయ్యా, అయ్యోర్నెవురూ మార్చలేరు! అది సిన్నప్పటి గుణం. ఆడోళ్ళంటే అయ్యాకసయ్యం! తల్లిని అసయ్యించుకునీవోరు, బాబయ్యా. ఆయమ్మ శానా బాదలు పెట్టీది. ఆయన బాబు ఆయమ్మని బాదించీవోరు, ఆయమ్మ ఈ యయ్యని సావబాదీసీవోరు!"

అదీ__

ఇప్పుడీ మూడో భార్య మరో టార్గెట్ అయిందతనికి.

సరోజ చాలా దురదృష్టవంతురాలు....

సిగరెట్ పారేసి బయట మొదలైన వర్షాన్ని చూడసాగాను....

ఆమె మోసపోయింది. నరకంలో వచ్చి పడింది. ఎలా భరిస్తోందో, ఎందుకు భరిస్తోందో ఆశ్చర్యంగా వుంది. నన్ను చూస్తే చిరునవ్వు నవ్వేది. అది మర్యాదకోసమో, తన అవస్థని చూడమనో అర్థమయ్యేది కాదు.

ఇంటికి నా రాకపోకలు పెరుగుతున్నకొద్దీ ఆమె నాకు సన్నిహితం కావాలని ప్రయత్నించేది. రకరకాల చర్యలతో నన్నాకర్షించాలని తపించేది... నాకదంతా కొత్తగా, థ్రిల్‌గా అన్పించేది. నేనెవర్నీ ఆకర్షించాలని వెర్రి ప్రయత్నాలు చేయలేదు. నన్నూ ఎవరూ ఆకర్షించడానికి సాహసించలేదు. నేను తిరిగే సర్కిల్ అలాంటిది. అప్పుడీ సరోజతో వింతగా అనిపించేది....

అలా నాకు తెలియకుండానే నేనామెకు దగ్గరయ్యాను, స్నేహితునిగా. అయితే ఆమె ఏనాడూ తన దుస్థితి నాకు చెప్పుకుని ఏడ్వలేదు. అది నాకు బాగా తెలుసన్నది ఆమెకు తెలుసు. ఆమె వ్యక్తిత్వం నన్ను బాగా ఆకర్షించింది. నాకామెపై చాలా సానుభూతి వుండేది. కష్టాలు పడ్డవాడికే పడేవారి మనసు తెలుస్తుంది....అలా వారాలు గడిచి, కాలం నెలల్ని మింగేస్తూంటే, క్రమక్రమంగా ఆ స్నేహం గాఢమైన ప్రేమగా మారిపోయింది....

ఆమె పరిస్థితి నేనర్థం చేసుకోగలను. ప్రేమ, లాలన ఆమెకు కరువయ్యాయి. వాటికోసం ఎంత కాలంగానో

తపిస్తోంది. కానీ నేను.... నేనప్పుడే వాటి అవసరాన్ని గుర్తించాను! ఇంకా ఈ బ్రహ్మచర్యం క్షమార్హం కాదనిపించింది....

అలా వారం క్రితమే ఆమె తన పాతివ్రత్యాన్ని, నేను నా బ్రహ్మచర్యాన్ని వదులుకున్నాం!

ఎప్పటిలా ఆ రోజు కూడా సాయంత్రం సిటీ పొలిమేరలు దాటి, వరంగల్ రూట్లో ఓ ఏకాంత ప్రదేశంలో మాట్లాడుకుంటూ గడుపుతున్నప్పుడు, ఆ కమ్ముకుంటోన్న కారుచీకట్ల మధ్య హఠాత్తుగా మా కారు ప్రణయ మందిరంగా మారిపోయింది....

అలా అనుకోకుండా జరిగిపోయిందానికి సినిమా హాల్లో మూల కూర్చుని ఏడుస్తూ ఆమే, పరిణామాలు ఆలోచిస్తూ ఉద్రేకంగా నేనూ వుండిపోలేదు. మళ్ళీ మళ్ళీ ఏకమయ్యాం. ఇంకా ఇంకా కావాలనుకున్నాం.

సురేష్—సరోజల జంటని ఇక ఈ ప్రపంచంలో ఏ శక్తీ విడదీయలేదని కలిసి బాస చేశాం.

ఈ వారంరోజులుగా అలా ప్రతీ సాయంత్రం కలుసుకుంటూనే వున్నాం. కానీ ఇవ్వాళ ఆమె ఇంటికాహ్వానించింది క్రొత్తగా. ఏమిటామె ఉద్దేశ్యం? భర్త ఊళ్ళో లేడని ధైర్యమా? అవును, నా బాస్ ఉదయమే కోయంబత్తూరు చెక్కేశాడు. ఎల్లుండిగానీ రాడు. సరోజ మార్పుని కోరుకుని వుంటుంది. ఆ ఇరుకు కారులో చెడ ఇబ్బంది పడిపోయి వుంటుంది. నాకూ అలా కార్లో అసహ్యంగానే వుంది. దాన్ని కక్కుర్తి అంటారు. నిజమైన ప్రేమికులు అలాంటి వాతావరణాన్ని కోరుకోరు!

అయిపోవచ్చిన సిగరెట్ని పారేసి ఆకాశంలోకి చూశాను. కుండపోతగా కురుస్తోంది వర్షం.. నాకాందోళన

కలిగింది. ఇదెప్పుడు తగ్గుతుంది? నేనెప్పుడు పోవాలి? అసహనంగా వాచీ చూశాను, ఇంకో గంట నిట్టూర్చాను, ఆత్రుతని అణచుకుంటూ నేను చేస్తున్న పని ఎంతవరకు మంచిదని ఆలోచించసాగాను .... నా ఉద్యోగం, ప్రాణాలతో కూడా రిస్కు తీసుకుంటున్నాననిపించింది. ఇంతవరకు ఇదెవరికీ తెలియదు. నా బాస్ కి కనుక తెలిస్తే నాకు చావు తప్పదు! కచ్చితంగా తప్పదు!

అయితే ఈ ప్రమాదం సరోజకి కూడా వుంది.

ప్రతిక్షణం కనిపెట్టాలి. ఆమెకు జాగ్రత్తలు చెప్పాలి. ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయనగానే ఇద్దరంకలిసి ఎటైనా వెళ్ళిపోవాలి! అవును, ఆమె లేనిబ్రతుకు ఏం బ్రతుకు!

మా భవిష్యత్తు గురించి యివ్వాళ ఆమెతో మాట్లాడాలి.

ఇప్పుడామె ఇంటికి రమ్మందంటే జాగ్రత్తపడే వుంటుంది, ఆ ముసలి రాజయ్య, చిన్నారీ తప్ప ఇంట్లో ఎవరూ వుండరు. రాజయ్య అవుట్ హౌస్ లో ఎనిమిది గంటలకే వెళ్ళి నిద్రపోతాడు. చిన్నారి కూడా తొందరగానే పడుకుంటుంది. ముసలి రాజయ్య పడుకున్నాడంటే లేవడు. అతను చిత్రమైన వ్యక్తి. తనేమిటో, తన పనేమిటో, మిగతా ప్రపంచం గురించి అవసరం లేనట్లు వుంటాడు. ఆ వయసులో అలాటి మనస్తత్వమే వస్తుందేమో.

రాజయ్య మాత్రం నాకు బాగా నచ్చుతాడు. ఈ వయసులో కూడా అతడంతపనీ ఎలా చేయగల్గుతాడో ఆశ్చర్యంగా వుంటుంది. రాత్రయితేగాని విశ్రమించడు. పలకరిస్తే బోసినోరు తెరిచి ఎప్పుడూ నవ్వుతూంటాడు.

'తాతా' అని పిలిస్తే పరవశించిపోతాడు. ఆ మరుక్షణమే అతడి ముఖం మ్లానమవుతుంది. అప్పుడిదే పాఠం చెప్తాడు.

మావోడు నన్నొగ్గేసి వెళ్ళిపోకపోతే బాబయ్యా, నాకు నీ అంత మనవడుండీవోడు! తాతా అన్న పిలుపులో ఎంత తీపి వున్నదో, నేను నోసుకోలేదు, బాబయ్యా...."

అప్పుడు నవ్వి నేనిలా అంటాను.

"నా చిన్నప్పుడే మా తాత తుపాకీ గుండు తగిలి యుద్ధంలో చచ్చిపోకపోతే 'తాతా' నీ అంత వుండే వాడు! తాతయ్య ప్రేమ నేనెరుగను. నువ్వు మనమడి ముద్దెరుగవు. మనిద్దరం ఒకటవుదాం, ఏం?"

అప్పుడతని కళ్ళలో వాత్సల్యం కురుస్తుంది.

సరోజ కూడా అతన్ని అలాగే పిలిచి అభిమానంగా చూసుకుంటుంది. ముసలి రాజయ్య లేని ఇల్లు ఇల్లు కాదనిపిస్తుంది...

తేరుకుంటూ ఈ లోకంలోకొచ్చి మళ్ళీ టైము చూసు కున్నాను. ఇక బయల్దేరడం మంచిదనుకున్నాను. లేచి పైజామా విడిచేస్తూ బట్టలకోసం వెళ్తున్నప్పుడు, వర్షం తగ్గుముఖం పట్టినట్లనిపించింది....

2

ఆటో దిగి గేటుతీసుకుని చకచకా లోపలికి నడిచాను.

వర్షం ఇప్పుడు పూర్తిగా వెలిసింది. కానీ కింద ఇంకా కాలవలుగట్టి నీళ్ళు పారుతూనే వుంది. వేగంగా మేడ వైపు కదుల్తూ, తోటలో యెడమవైపు చూశాను. దూరంగా అవుట్ హౌస్ తలుపువేసి చీకటిగా కనిపిస్తోంది. చలికి అప్పుడే ముసుగుదన్ని పడుకుని వుంటాడు ముసలి రాజయ్య.

ఇంట్లో లైట్లు కనిపిస్తున్నాయి. వరండాలో ఆమె

కన్పిస్తోంది.

పరుగెత్తుకెళ్ళి వరండాలో యెక్కాను.

ఆమె ముందుకొచ్చి, "తడిసిపోయావా?" అనడిగింది.

"లేదు....తడిసినా లెక్క చెయ్యను .... కానీ నువ్వు చంపేశావు!" అన్నాను. ఆమె భుజం చుట్టూ చెయ్యి వేసి లోపలికి నడుస్తూ.

ఆమె నా నడుము చుట్టూ చెయ్యి వేసింది. "నువ్వొక్కడివే యెలా చస్తావు, నిరీక్షణ ఇద్దరిదీ!" అంది నవ్వుతూ.

"ఓహ్, అయితే తమరేం చేశారు?" అన్నాను, సోఫాలో కూలబడుతూ. ఆమె తలుపు వేసి వచ్చి నా పక్కన కూర్చుంది. జుట్టులోకి వేళ్ళు పోనిచ్చి లాగింది. కళ్ళలోకి చూస్తూ నవ్వింది.

"నే నేం చేస్తాను! రికార్డులు పెట్టుకొని విరహగీతలు విన్నాను....మరి తమరు?"

"సిగరెట్లు రెండు పెట్లు ఖర్చు చేశాను. నా ఆయుష్షు నిమిషంన్నర తగ్గించుకున్నాను...."

"నువ్వెప్పుడు ఆయుష్షు, చావు....యెందుకలా మాట్లాడతావు?"

"ఓహ్, అలా మాట్లాడేస్తున్నానా? నాకు తెలియకుండానే అవి ఊతపదాలయ్యాయన్న మాట! మానేస్తాను. నా భాషను ఇంప్రూవ్ చేసుకుంటాను, ఓ.కే?"

ఇద్దరం మేడమీదికి చేరుకున్నాం. బెడ్ రూంలో ప్రవేశం.

అప్పుడామె అప్సరసలా కన్పించింది. పాతికేనా దాటని ఆమె శరీర సౌష్టవాలు నన్ను ఉన్మత్తుడ్ని చేశాయి! గాఢంగా పెనవేసుకుని అందిన చోటల్లా

పెదాలతో దాడిచేశాను....ఆమె కూడా ప్రతి స్పందించి నా నిలువెల్లా విద్యుత్తరంగాల్ని పంపింది....

కాలం కొన్ని క్షణాలు స్తంభించింది.

విడిపడి బెడ్ దగ్గర కెళ్ళాం. దానిమీద కూలబడ్డాం.

"నిన్నొదలడమంటే బ్రతుకును చాలించుకోవడమే, సరోజా!" అన్నాను ఆమెని లాక్కుంటూ.

"నిన్నొదిలి నేనుంటానా....? నువ్విస్తున్న అనుభవం ఎప్పుడూ పొందలేదు, సురేష్!"

"ఎందుకు పొందలేదు....?"

ఆమె మాట్లాడలేదు. మాట్లాడలేకపోయింది.

నాకనుమానం వేసింది. ఒకవేళ నా బాస్ ఇంపోటెంట్ కూడా కాదుకదా? కాదు, కాదు, సంతానాన్ని కన్నాడు అయితే ఈమెని క్రూరంగా, రాక్షసంగా హింసించి తనకావల్సిన తృప్తిని పొందుతూ, ఆ అనుభవమంటేనే భయం అసహ్యం కల్గించి వదిలాడన్న మాట....నిజంగా బాస్టర్డ్!

"నువ్వెందుకింకా అతన్ని అంటి పెట్టుకొనుంటున్నావు?"

"ఏం చేయను?"

"ఏమైనా చేయగలవు. నీ సవతులు సనాతన భావాలుగల కుటుంబ స్త్రీలు కావచ్చు. కానీ నువ్వు ఆధునిక భావాలుగల యువతివి. ఏమైనా చేయగలవు. అతని మొహాన ఉమ్మేసి పోగలవు."

"ఎక్కడికి పోను....అనాథని."

ఆమె భుజాలుపట్టి వూపాను. "నువ్వు నిజం చెప్పు, అనాథవైతే ఇతన్ని కట్టుకోకముందు ఎలా వున్నావు? ఎక్కడున్నావు? ఇప్పుడు విడిచిపెట్టాలంటే ఎందుకు

భయం? నీకతని డబ్బుమీద కన్నుండికదూ? దానికోసమే ముసలాడితో మూడో పెళ్ళాంగా సిద్ధపడ్డావు! దానికోసమే ఇన్ని బాధలూ భరిస్తున్నావు!''

ఆమె తల వంచుకుని చిన్నగా అంది. "కావచ్చు, నేను చాలా దారిద్ర్యాన్ని చవిచూశాను. దాని రుచి నువ్వెరుగవు! ఇప్పుడు కోరి కోరి మళ్ళీ దాన్నాహ్వానించలేను. ఆ బీదరికంకంటే ఈ హింస అనుభవించడమే నయం!''

నేనింకా దూరం వెళ్ళదలచుకోలేదు. "మన గురించి ఏం చేద్దామని అనుకొంటున్నావు?'' అడిగాను.

"ఇంకా నే నేమీ అనుకోలేదు.''

"ఇలా ఎంతోకాలం సాగలేం. బయటపడకముందే దారి చూసుకోవాలి. లేదా చావు తప్పదు మనకి....నీ భర్త కనీసం చంపకుండా వదలడు! అంత చండశాసనుడు. ఇలా మనం కోరికలవరకే పరిమితంకాకుండా, నిజంగా మనం ఒకరికొకరు తోడూనీడగా కావాలనుకుంటే సరోజా, వెంటనే ఇక్కడ్నించి వెళ్ళిపోవడం మంచిది! నిన్ను మనసారా కోరుకుంటున్నాను. నీవులేని బ్రతుకు వూహించలేను. కానీ....చిన్నారి గురించే నేను ఎక్కువ వర్రీ అవుతున్నాను. ఆమె ఒంటరి అవుతుంది. ఏమవుతుందో వూహించలేం. మన సుఖంవరకే చూసుకోవడం అన్యాయం. కానీ ఆమెని తీసుకెళ్ళే హక్కు మనకుందా? లేదు! ఇదే నాకు చిక్కు సమస్యగా వుంది, సరోజా!''

"నీకోసం ఈ ఐశ్వర్యమంతా వదులుకుని రావడానికి సిద్ధంగా వున్నాను, సురేష్. నామీద నమ్మకముంచు. ఐశ్వర్యం నువ్వూ సంపాదించగలవు. కానీ ప్రేమ నేను

ఎక్కడ సంపాదిస్తాను? చిన్నారినీ వదులుకోలేను. దానికి తండ్రి దగ్గర రక్షణలేదు. అసలు చేరికలేదు. నేను పోతే అది వుండలేదు. దాని గురించి నాకూ బాధగా వుంది...."

"అందుకే ఏం చేద్దామంటావు? చిన్నారి మనకెలా దక్కుతుంది?"

"ఒకవేళ అది అనాధ అవుతే...."

"ఏమిటీ....ఏమిటేమిటీ...."

"తండ్రి కూడా చచ్చిపోతే ..."

"సరోజా!" ఆమెని పట్టి వూపాను, "సరోజా! ఏమిటి నువ్వన్నది? తండ్రి కూడా చచ్చిపోతే....గాడ్, నీకు మతిపోయిందా? తెలివిలో వుండి మాట్లాడుతున్నావా?"

ఆమె మాట్లాడలేదు.

భళ్ళున తెరచుకుంది తలుపు—అప్పుడు హాఠాత్తుగా.

"నువ్వా....!!! నా గదిలో....!!!" అతను లోపలి కొస్తూ, గది దద్దరిల్లిపోయేలా అరిచాడు.

3

ఆకాశంలో ఉరుములూ, మెరుపులూ ప్రారంభమయ్యాయి—

కొన్ని క్షణాలు ఏం జరిగిందో నాకర్థంగాలేదు.

కాకతాళీయమా? కల్పించబడిందా?

ఇప్పుడేదీ ఆలోచించడానికి సమయంలేదు.

అతడు ఉద్రేకంతో వూగిపోతూ రెండు చేతుల్తో నా గొంతు పుచ్చుకున్నాడు. కళ్ళెర్రజేస్తూ గర్జన చేశాడు. "నిన్ను చంపుతాను!"

నేనాలస్యం చేయలేదు. శక్తినంతా కూడదీసుకుంటూ

అతన్ని కిందపడదోసి మీదెక్కి కూర్చున్నాను.

"నువ్వే చావు బాస్టర్డు!" అన్నాను కసిగా, ఒక చేత్తో అతని గొంతు పుచ్చుకొని, మరో చేత్తో టీపాయ్ మీది ఫ్లవర్ వేజ్‌ని అందుకుంటూ, "చచ్చిపో! నీ తల్లి చెడ్డపని భార్యల్నా హింసిస్తావ్రా? నీకు తల్లి దగ్గర లేని ప్రేమ కట్టుకున్న ఆలితో చూసి తరించాలిరా మూర్ఖుడా! ఆడదాని ప్రేమకి — అదే రూపంలో వున్నా సరే— మరేదీ ప్రపంచంలో సాటిరాదని తెలుసుకో మరు జన్మకైనా, మగవాడా! నీ డబ్బూ దర్పం అన్నీ దాని ముందు దిగదుడుపే!"

నా చేతిలో ఫ్లవర్ వేజ్ అతడి తలమీద బలంగా పడింది. గట్టిగా మూల్గి కళ్ళు మూసుకున్నాడతను. అది నా చేతిలోంచి జారిపోయి దూరంగా వెళ్ళి పడింది. నేను దాన్ని అందుకుంటూండగా, కింద ఒక్కసారి కాలింగ్ బెల్ మోగింది.

సరోజ బెడ్ దిగి భయవిహ్వలఅయి చూస్తోంది.

ఆయాసం తీర్చుకుంటూ, "రాజయ్య కావచ్చు, వెళ్ళి అతన్ని పంపెయ్యి!" అన్నాను.

ఆమె మరబొమ్మలా పరుగుతీసింది బయటికి.

నేను కదలకుండా పడివున్న రావ్‌ని చూసి, కిటికీ దగ్గరకురికి కింద అవుట్ హావుస్ కేసి చూశాను. లైటు వెలగడంలేదు. తలుపు తీసి వుందో, మూసి వుందో కన్పించడంలేదు, చెమట తుడుచుకుంటూ, ఇంకా అలాగే పడివున్న రావ్‌ని చూసి బయటికి పరుగుతీశాను. ఆ వచ్చిందెవరో చూడాలి! బయటినుంచి గది తలుపు గడియవేసి, వేగంగా మెట్లకేసి వురికాను.

కిందికి దిగుతూ చివరి మెట్టుమీద అప్రయత్నంగా

ఆగిపోయాను. గోడచాటుకి జరిగి హాలులోకి తొంగి చూశాను. సరోజ అప్పుడే తలుపుతీసింది. భయపడిపోయి వెనక్కి రెండడుగులు వేసింది.

టార్చి పట్టుకుని ఎవరో ఇరవై ఏళ్ళ కుర్రాడు లోనికి జొరబడ్డాడు.

వాడు నల్లగా, బక్కగా వున్నాడు. వాడికి పెద్ద జుట్టు వుంది. అది ముఖంమీదా, భుజాలమీదా, చెవుల మీదా పడుతోంది, దువ్వుకోక, నూనెలేక అసహ్యంగా వుంది. వాడి బట్టలు బాగా మాసి వున్నాయి. కాళ్ళకి హవాయి చెప్పులున్నాయి. వాడి కళ్ళు చురుగ్గా, చుంచెలుకలా చూస్తున్నాయి. వాడి ఎండిన పెదవులమీద మందహాసం వుంది....

పళ్ళికిలించి వాడు, "హిహ్హా—అక్కయ్యా—గుర్తు పట్టావా?" అన్నాడు.

వాడి పళ్ళు వాడిగా, గారపట్టి వున్నాయి.

వాడి గొంతు పిట్ట అరిచినట్టు కీచుగా వుంది. వాణ్ని సరిగ్గా జాడించి తంతే దూదిబస్తాలా ఎగిరిపోయేలా వున్నాడు.

వాడి మాటలు విని సరోజ ఉలిక్కిపడడం గమనించాను.

గిర్రున తిరిగి ఆమె చుట్టూ చూసింది. ఎవరూ లేరని నిర్ధారించుకొని వాడివైపు తిరిగింది. అలా చుట్టూ చూసినప్పుడామె ముఖం కందగడ్డలా వుంది. ప్రాణాలు కళ్ళలోంచి ఎగిరిపోతున్నట్లుగా వున్నాయి చూపులు.....

"నువ్వా! నువ్విక్కడికెలా వచ్చావ్?"

ఆమె మాటలు బలహీనంగా అస్పష్టంగా వున్నాయి.

వాడు మరో నవ్వు నవ్వాడు. "నిన్ను వెతుక్కుంటూ

వచ్చానక్కా!" అన్నాడు.

నేను ఉలిక్కిపడి మేడమీదికి చూశాను. పైన ఏ చప్పుళ్ళూ లేవు. రావ్ ఇంకా లేవలేదు....

"వెళ్ళిపో ఇక్కడ్నుంచి! వెళ్ళిపో!" సరోజ అంటోంది చేత్తో తలుపువైపు చూపిస్తూ.

వాడు కదిలి మరింత ముందుకొచ్చాడు, కుతూహలంగా చూస్తూ.

"ఏమిటక్కా, ఎందుకలా భయపడతావ్? నేనెవర్ననుకుంటున్నావు? నీ తమ్ముడ్నే — నాగేష్‌ని —"

"ఓహ్, నిన్నిలా చూడలేను! నువ్విక్కడికి రాకూడదు! వెళ్ళిపో ఇక్కడ్నుంచి!"

వాడు నవ్వాడు టార్చిని వూపుతూ. "పో అక్కా ప్రేమలేదనకు!"

"నిన్నెప్పుడో మర్చిపోయాను, నాకు గుర్తులేవు పో! నాకు నువ్వు లేవు! ఇంకెప్పుడు నీ ముఖం చూపించకు, వెళ్ళిపో ఇక్కడ్నుంచి!"

సరోజ ఆవేశంతో వూగిపోతోంది.

వాడు పళ్ళికిలించాడు, "ఓహో, నామర్దానా? ఇప్పుడు నీ హోదా పెరిగింది గనుక నన్ను చూడలేవు! మహారాణివి అయిపోయావే .... నిన్నిలా చూస్తానని వూహించలేదు. ఇన్నేళ్ళూ నిన్ను వెతకని చోటులేను. ఎన్నేళ్ళయిందక్కా, నన్ను వదిలిపెట్టిపోయి? ఎనిమిదేళ్ళు అంతేనా? ఎనిమిదేళ్ళలో నువ్వెంత మారిపోయావక్కా!"

"పోతావా లేదా ముందిక్కడ్నించి—"

వాడు మరో నవ్వు నవ్వాడు. "నన్నిలా చూసి అసహ్యించుకుంటున్నావు. కానీ నీకు గుర్తుందా అక్కా, కూటికి కరువై బజార్లోపడి డబ్బు! డబ్బు! డబ్బు! అని

తిరుగుతున్నప్పుడు, చిటికలేసిన ప్రతివాడికీ ఎలా కాళ్ళు జాపేదానివో!...అప్పటి నీ జీవితం ఏమిటో!...తలచుకో! ఇప్పుడు మహా పతివ్రతలా మాట్లాడేస్తున్నావే...."

అంతవరకూ నేనెలాగో అణచుకోగల్గాను. ఇక ఆపుకోలేకపోయాను. గోడచాటునుంచి ఒక్క పరుగున వెళ్ళి, పిడికిలితో బలంకొద్దీ వాడి దవడమీద మోదాను. వాడి చేతిలో టార్చి ఎగిరిపోయింది. వాడు కిందపడ్డాడు. వాడి జుట్టు పట్టుకొని లేపి గిరిగిరా తిప్పి మెడమీద ఒక దెబ్బ వేస్తూ వదిలేశాను. వాడు కాగితం విమానంలా వెళ్ళి గది తలుపులకి ధడాలున కొట్టుకొని కిందపడ్డాడు. నేను నాలుగు గంతుల్లో వెళ్ళి వాడి డొక్కలో తన్నాను. తన్నసాగాను. కసిదీరా తన్నసాగాను....

"వెధవా! అక్కతో అలాగేనా మాట్లాడతావూ?"

సరోజ పరుగెత్తుకొచ్చి నా చేతులు పట్టి వెనక్కి లాగింది. "అయ్యయ్యో....సురేష్! వాడ్నొదిలెయ్య—"

ఆమె లాక్కుంటూ తీసికెళ్ళి నన్ను సోఫాలో కూలేసింది. నేనామెని నెట్టేసి లేవబోయాను, ఆవేశం ఇంకా హెచ్చి.

"సురేష్! సురేష్! ఓహ్, తేరుకో! అలా రెచ్చిపోకు!" ఆమె నన్నాపుతూ కదలకుండా పట్టుకుంది. ఆందోళన పడిపోతూ తిరిగి నన్ను సోఫామీదికి నెట్టింది.

నేను కూర్చుని ఆవేశం అణచుకుంటూ చూశాను.

"ఆ వెధవని చంపుతాను! చంపి నిద్రపోతాను!"

"వద్దు, సురేష్! వాడ్నొదిలెయ్యి!

వాడు నెమ్మదిగా లేస్తున్నాడు, కడుపు పట్టుకొని, బాధని అణచుకుంటూ, జుట్టును పైకి తోసుకుంటూ లేచి నిలబడ్డాడు. హాలులో కలయజూసి, చెరో మూల పడ్డ

చెప్పుల్ని వింటుతూ వెళ్ళి తోడుక్కున్నాడు. కిందపడి అద్దం పగిలిన టార్చిని అందుకున్నాడు.

అప్పుడు అకస్మాత్తుగా నావైపు తిరిగి పళ్ళికిలించాడు, దగ్గరికొస్తూ.

"హలో, లవర్ బాయ్! నువ్విక్కడే వున్నావని తెలీదు! బాగున్నావే....బలే దెబ్బతీశావే...."

"బాస్టర్డ్, ఇప్పుడు చస్తావ్ ——"

చటుక్కున లేవబోయాను, సరోజ ఆపింది.

వాడు పళ్ళికిలించాడు. "లవర్ బాయ్, నువ్వు కొంచెం తగ్గు. తగ్గటం నీ వంటికి మంచిది. తన్నటం హీరోయిజమ్ అనుకుంటున్నావా? ఇప్పుడే తెలుసుకుంటావు మనిద్దర్లో మొనగాడెవరో...."

వాడు జేబులోంచి ఏదో తీస్తున్నాడు.

నేను ఉలిక్కిపడి మెట్లవైపు చూశాను. పైన ఏమీ చప్పుళ్ళు లేవు. నా మనసులో ఆందోళన పసిగట్టి సరోజ బెదురుగా నా చెయ్యి పట్టుకుంది. మెట్లవైపు రెప్పవేయకుండా చూసింది. అతడింకా లేవలేదా? లేస్తే బయటికి రాలేడు. తలుపు బయట గడియవేశాను. కానీ కిటికీ వుంది! అందులోంచి బాల్కనీలోకి దిగవచ్చు.... గాభరాగా నేను హాలు తలుపువైపు చూశాను....ఏ క్షణాన బయటనుంచి అంబోతులా జొరబడతాడో....?

వాడు జేబులోంచి దాన్ని తీసి విప్పుతున్నాడు. ఆ కవరులోంచి మూడు సరికొత్తగా వున్న ఫోటోలు నా మీదికి విసిరాడు.

"చూడు, లవర్ బాయ్! నీ టెంపరేచర్ జీరోకి దిగకపోతే అప్పుడను!"

నాకేమీ అర్థంగాలేదు. ఆ ఫోటోల్ని తికమకగా

చూస్తూ అదిరిపడ్డాను. సరోజ వాటినందుకొని చూసి, చటుక్కున వదిలేసి కళ్ళు మూసుకుంది.

"చూశారా? ఎలా వున్నాయి?" వాడు హేళనగా చూస్తున్నాడు, ఎలా వుంది వంట్లో? లవర్ బాయ్, బలే మజా చేసుకున్నారులే! కారులో మంచి ఫోజు లిచ్చారు లవర్స్ ఇద్దరూ కలిసి! కాస్త కష్టపడ్డా చక్కగానే తీశాను .... మీకాకారే దొరికిందా వేడి చల్లార్చుకోడానికి?"

వాడేమంటున్నాడో నేను వినిపించుకోవడంలేదు. నా ఆవేశమంతా దిగిపోయి వళ్ళు చల్లబడిపోయింది. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది .... సరోజ సిగ్గుతో సోఫాలో ఓ మూల ఒదిగి కూర్చుంది, తలదించుకుని. వాడు మమ్మల్ని తమాషాగా, వెటకారంగా చూస్తున్నాడు .... నన్ను నేను సంభాళించుకుంటూ గుటకలు మింగాను. ధైర్యం తెచ్చుకున్నాను.

"ఇప్పుడు నీకేం కావాలి, వెధవా?" అడిగాను, వాడి కళ్ళలోకి సూటిగా చూస్తూ నా చెవులు పైన శబ్దాలకోసం నిక్కబొడుచుకొని వున్నాయి.

వాడు సంతోషంగా చూశాడు. "అలా అడుగు. లవర్ బాయ్. నాకు డబ్బు కావాలి... రెండు లచ్చలు."

వాడ్నలాగే చూస్తూ అన్నాను. "రెండు లక్షలు కాదురా లుచ్ఛా, నా దగ్గర రెండు నయా పైసలు కూడా లేవు."

వాడు భుజాలెగరేశాడు, "నిన్నడగడం లేదు! అక్కయ్య ఇస్తుంది!"

"ఆమె దగ్గరా లేదు!"

"అయితే అవి బావగారికి చేరుకుంటాయి...."

"వెధవా, నీకో సంగతి చెప్పనా? ఇదెప్పుడో నీ బావగారికి తెలిసిపోయింది! నువ్వాలస్యంగా తగలడ్డావు! వెళ్ళి ఆయన్నే అడుక్కో పో!"

వాడు నమ్మలేనట్లు చూసి, వెంటనే కోపంగా అన్నాడు. "లేదు లవర్ బాయ్, ఈ బుకాయింపులూ ఎత్తులూ మనకొద్దు! డీల్ క్లీన్‌గా వుండాలి. ఇప్పుడు నీ బుర్ర కేదీ తోచదు. రేపుదయందాక ఆలోచించుకునేందుకు టైమిస్తాను. మీరిద్దరు బాగా ఆలోచించుకోండి. ఏం చెప్తావో నే చెప్పినచోటికి వచ్చి చెప్పు. దిల్ సుఖ్ నగర్ బస్‌డిపో ఎదురుగా రవ్రూఫ్ కేఫ్‌కి, ఉదయం పదకొండు గంటలకి, సరేనా? నేనక్కడుంటాను...."

వాడు సమాధానంకోసం చూడకుండా, టార్చి వూపుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు.

నేను భారంగా నిట్టూర్చి ఫోటోలు మడిచి జేబులో పెట్టుకున్నాను. సరోజని చూశాను. ఆమె ఇంకా అలాగే కూర్చుని వుంది.

లేచి దగ్గరకెళ్ళి, ఆమె గెడ్డం పుచ్చుకు తల పైకెత్తాను.

"నీ గురించి వాడన్నది నిజమేనా?"

ఆమె బదులు చెప్పలేదు, నోరు విప్పలేదు. కళ్ళు మూసుకుంది.

ఆమె భుజంపట్టి లేపాను. "పద! ఇక మర్చిపో! వింటున్నావా? గతాన్ని పాతిపెట్టెయ్యి!"

"ఓహ్ సురేష్, నన్నిప్పుడు వొదిలెయ్యవు కదూ?"

"నన్ను నమ్ము. నాకు నీ గతం కాదు, వర్తమానం కావాలి."

ఆమె నిట్టూరుస్తూ నాతో వచ్చింది. పైకి మెట్లెక్కసాగాం.

"ఇప్పుడెక్కడికి?"

"అతన్ని చూద్దాం!"

"నాకు భయమేస్తోంది!"

"చూడక తప్పదుగా?"

గుండె అదురుతోంటే ఆ గది ముందాగి తలుపుకు చెవి ఆనించాను. లోపల ఏ శబ్దమూ లేదు. తలుపు కెక్కడా రంధ్రంలేదు చూడటానికి. వణుకుతున్న చేత్తో గడియతీసి, తలుపు చిన్నగా నెట్టాను. పూర్తిగా తెరచి ఊపిరి బిగబట్టాను.

అతను రక్తం మడుగులో పడివున్నాడు.

4

"సురేష్! ఏమిటిది, సురేష్? ఎంత పనిచేశావు!"

ఆమెని విడిపించుకుంటూ, అతన్ని సమీపించాను. అక్కడ కూర్చుని చెయ్యి ముట్టుకున్నాను. నాడీ ఆడడం లేదు. తల పక్కకు తిప్పి చూశాను. అక్కడ కణత దగ్గర గాయముంది. చాలా రక్తం పోయింది....తల చుట్టూ మడుగు కట్టింది.

కొంతదూరంలో పడివుంది ఫ్లవర్ వేజ్. దాన్ని లేపినప్పుడు అది బాగా బరువుంది. ఇత్తడిది. దాని దెబ్బకి తల పగలక వుండదు! నేను బలంగానే కొట్టాను....రావ్ అప్పుడే చచ్చిపోయి వుండాలి! స్పృహ తప్పాడను కున్నాను—తర్వాత నెమ్మదిగా బ్లీడింగ్ జరిగింది!

అప్పటికిగానీ నేను తెలుసుకోలేదు, ఆ ఆవేశంలో ఏంచేశానో! నా వళ్ళంతా చెమటపట్టేసింది! కంపిస్తున్న శరీరాన్ని అతికష్టంమీద అదుపులో పెట్టుకున్నాను. ఆలోచనలు కలగాపులగంగా ముసురుకుంటున్నాయి.....

ఓ గాడ్, రావ్‌ని చంపేశాను.

ఇతనికి శాస్తి చేయాలనుకున్నాను గానీ, ఇలా చేస్తా ననుకోలేదు! ఇప్పుడేం చేయాలి?

"సురేష్, ఎంత పని చేశావు! ఆయన్ని చంపేశావా!" ఆమె నన్ను పట్టుకొని వూపింది.

"చంపకపోతే మనల్ని చంపేస్తాడు, పిచ్చిదానా! నువ్వు చస్తావా?" కసిరాను అసహనంగా.

"నేనిలా జరుగుతుందనుకోలేదు!"

"ఎందుకనుకోలేదు? చిన్నారి అనాథ అవుతే....అని అనుకున్నావుగా? ఇప్పుడు అయ్యింది చూడు!" నవ్వాను పిచ్చిగా, ఆమె భయపడింది, "వెరీ వెల్! ఇప్పుడు నా సమస్య తీరింది! చిన్నారిని మనం స్వేచ్ఛగా తీసికెళ్ళి పోవచ్చు....ఎంత మంచి జరిగింది!"

"ఇప్పుడేం చేయాలి? ఇతన్నేం చేస్తావు?" ఆమె అరిచింది.

నేను తేరుకొని తేలికపడ్డాను. ఒక సిగరెట్ తీసి వెల్గించాను, "కాకతాళీయం కాదు, కల్పించబడింది. నీ భర్త కోయంబత్తూరు వెళ్ళలేదు, బుకాయించాడు. మన సంగతి ముందే కనిపెట్టాడు. మనల్ని పట్టుకోడానికా బూటకపు ప్రయాణంతో నమ్మించాడు. అప్పుడిలా వూడి పడ్డాడు!"

"మరి పగలంతా ఎక్కడున్నాడు?"

కళ్ళు చిట్లించి నేను శవాన్ని చూశాను. దాన్ని సమీపించి జేబులన్నీ వెతికాను. కొన్ని నోట్లు, చిల్లరా, కర్చీఫ్, పెన్నూ, కళ్ళద్దాలు, సిగరెట్ ప్యాకెట్, లైటరూ, ఒక తాళంచెవి రింగూ వున్నాయి.

ఆ రింగు నన్నాకర్షించింది. అందులో ఒక చేకీ

వుంది. దానికి వేలాడుతున్న టాగ్ మీద పేరు ముద్రించి వుంది. దానికింద ఒక అంకె వుంది.

దాన్నామెకు చూపిస్తూ అన్నాను.

"హోటల్ మార్య, రూం నెంబర్ 98...."

"హోటల్లో గడిపాడా?"

"ఇంకెక్కడ గడుపుతాడు? సూట్ కేసుతో వెళ్ళాడు అదక్కడే వదిలి వచ్చి వుంటాడు. ఇవ్వాళ కూడా మనం బయటే కలుసుకుంటేనా...."

"ఇప్పుడేం చేద్దాం? ఏమిటిదారి?"

"అలా కంగారు పడకు, ఆలోచించుకోనీ!"

"చూడలేకపోతున్నాను, ఓహ్! పూడ్చేద్దాం పద! వర్షం పడింది. నేల వదులుగా వుంటుంది....తోటలో తవ్వి పాతేద్దాంపద!"

కిటికీ దగ్గరకెళ్ళి నేను బయటికి చూశాను. థాంక్ గాడ్! ఈ గొడవంతా రాజయ్యకి తెలియదు. సిగరెట్ పీలుస్తూ అలాగే చూస్తూండిపోయాను....

పూడ్చిపెట్టే ఆలోచన నాకు నచ్చలేదు. ఈ పరిసరాల్ని డిస్టర్బ్ చేయకూడదు. అదెప్పటికైనా ముప్పు. మరోచోట, మరెక్కడైనా ప్రతిష్ఠించాలి శవాన్ని. శవాల్ని తొక్కిపట్టినకొద్దీ పైకి తన్నుతాయి. అప్పటికప్పుడు మాయోపాయాలతో ప్రదర్శనకు పెట్టేయాలి. ఎప్పుడేం జరుగుతోందన్న భయాందోళనలు తప్పుతాయి. అందరికంట పడేలా, చావు వెంటనే చాటింపైపోయేలా చేస్తే ఏ బెడదా వుండదు. పూడ్చిపెడితే మనిషి అయిపు గురించిన అనుమానాలు బయలుదేరతాయి..అక్కడ్నుంచి మొదలవుతుంది హంతకుడి పతనం!

వెల్, మిస్టర్ బి.జె.పి. రావ్, అయాం సారీ. మరు

జన్మంటూ వుంటే, మనం మళ్ళీ కలుసుకుంటే, అప్పుడు నీ చేతుల్లోనే నా ప్రాణాలు పోవాలని కోరుకుంటాను. ఈ జన్మలో నీ దౌష్ట్యానికి ఇలా నా చేతుల్లో నీ ప్రాణాలు తీయక తప్పలేదు, క్షమించు. ఇప్పుడు నీ దేహానికే అపచారం జరిగినా మన్నించు. తర్వాత నీకు ఘనంగా శాస్త్రోక్తంగా అపర క్రియలు జరిపిస్తాను.

చటుక్కున ఆమె దగ్గరికి కదిలి, "నాకో ఆలోచన వచ్చింది, సరోజా!" అన్నాను.

"ఏమిటది?"

"అది నీకు తెలియకుండా వుంటే మంచిది. లేకపోతే కన్ఫ్యూజ్ అయి కలగాపులగం చేస్తావు అంతా. పోలీసులొచ్చి అడిగితే నీకేమీ తెలియదని చెప్పాలి, అంతే. అర్థమైందా? అతను కోయంబత్తూరు వెళ్ళిన సంగతే నీకు తెలుసని చెప్పాలి. అంతకుమించి ఇంకేమీ చెప్పవద్దు, తెలిసిందా?"

"పోలీసులొస్తారా!" అందామె బెదిరిపోతూ.

"అలా బెదరకు! అవును, వస్తే ఏమిటి? రొటీన్‌గా కొన్ని ప్రశ్నలేస్తారు. నిన్నెందుకు అనుమానిస్తారు? పిచ్చి భయాలు పెట్టుకొని గట్స్ పోగొట్టుకోక! ధైర్యంగా వాళ్ళడిగిందానికి చెప్పు. వాళ్ళనలా అపి, నాకు ఫోన్ చెయ్. నేనొచ్చి అక్కడ్నించీ చూసుకుంటాను...."

ఆమె రెప్పవేయకుండా చూడసాగింది.

"ఇక పద! నేను శవాన్ని మోసుకొస్తాను, నువ్వు కారు డిక్కీ తెరువ్!"

ఆమె తేరుకొని కదలబోయింది. నేను చటుక్కున ఆమె జుట్టులోంచి కొన్ని వెంట్రుకలు పీకాను.

"అబ్బా.... ఏమిటిది?" అందామె బాధగా.

"ఏమీలేదు....ఏదు లిప్ స్టిక్ అలవాటుంది కదూ?"
అడిగాను డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరికి కదుల్తూ దానిమీద కాయితంలో ఆ వెంట్రుకల్ని చుట్టి జేబులో పెట్టుకున్నాను. సొరుగులాగి అందులోంచి ఒక లిప్ స్టిక్ ని అందుకున్నాను.

ఆమె దగ్గరకెళ్ళి విచిత్రంగా చూస్తున్న ఆమె పెదాలకి దాన్ని పూసి, "ఇక అతన్ని ముద్దు పెట్టుకో!" అన్నాను.

"ఏమిటీ!"

"చెప్పినట్టు చెయ్, ప్లీజ్!" ఆమెను లాక్కెళ్ళి శవం దగ్గర కూర్చోబెట్టాను. "కంఠం కింద....ఒకటే ముద్దు.. కమాన్!"

ఆమె చటుక్కున వంగి పెట్టింది.

"గుడ్!" ఆమెని లేపుతూ జడలోని మల్లెదండ తీసుకున్నాను, దాన్ని కాగితంలో చూడుతూ, "ఇప్పుడొక సీసా, పాత గుడ్డలు, నీళ్ళు తీసుకురా!"

"ఎందుకు?"

"ఎందుకు, ఏమిటి, అనే ప్రశ్నలొద్దు! ప్రాక్టికల్స్ సక్సెస్ కావాలంటే ప్రొఫెసర్ చెప్పినట్టు అసిస్టెంట్ వినాలి, వెళ్ళు త్వరగా!" యుగంధర్ లా నవ్వి అన్నాను.

అప్పుడు నాకాందోళన ఎగిరిపోయి, మనసు ఉల్లాసంగా అయింది.

అయిదు నిమిషాల తర్వాత ఆమె వాటితో తిరిగి వచ్చింది.

నేను సీసాలో కింద రక్తం ఎత్తిపోసి, అందులో నీళ్ళు కలిపాను గట్టిపడకుండా. మూత బిగించి జేబులో పెట్టుకొని, గుడ్డతో శవంమీద రక్తాన్ని శుభ్రంగా

తుడిచాను, నాకంటుకోకుండా. తర్వాత లేచి నిలబడ్డాను.

అప్పుడు ఆమె సహాయంతో శవాన్ని భుజాన వేసుకొని బయల్దేరాను. ఆమె వెంట వచ్చింది.

రావ్ చాలా బరువై పోయాడు. వంగి నడుస్తూ బయట గ్యారేజీ చేరుకున్నాను. ఆమె తాళంతీసి లోపలి కెళ్ళింది. డిక్కీ తెరిచింది.

నేను శవాన్ని తీసుకెళ్ళి జాగ్రత్తగా అందులో పడుకోబెట్టాను. అతని బూట్లకంటిన మట్టిని దులుపుతూ అన్నాను. "ఇప్పుడు శ్రద్ధగా విను! నీ భర్త వర్షం వెలిశాక వచ్చాడు....బయట బూట్ల జాడలు కూడా ఏర్పడతాయి. నేను తిరిగొచ్చాక అవన్నీ తుడిచెయ్యాలి. ఈలోగా నువ్వు బెడ్‌రూంని శుభ్రంచెయ్. రక్తాన్ని తుడిచి తడిగుడ్డల్ని ఎక్కడైనా దాచు. ఉదయం బాయిలర్‌లో పడేయ్. ప్లవర్ వేజ్‌ని కూడా తుడిచి పెట్టు, ఏమిటి? నీ లిప్‌స్టిక్ తుడుచుకో...."

ఆమె తలూపింది తుడుచుకుంటూ.

"ఇక కారెక్కు. దీన్నిక్కడ స్టార్టు చేయడం మంచిది కాదు. ముసలి రాజయ్య మేల్కొవచ్చు. నువ్వెక్కి స్టీరింగ్‌ని కంట్రోల్ చెయ్, నేను నెట్టుకుంటూ వస్తాను. బయట వీధిలోకెళ్ళాక దిగిపోదువుగాని....అలాగే తిరిగి వచ్చినప్పుడు కూడా చేయాలి."

ఆమె మళ్ళీ తలూపింది.

అయిదు నిమిషాల తర్వాత నేను వీధిలో కారు స్టార్టు చేసి దూసుకుపోయాను వేగంగా....

5

ఫోను గణగణ మోగుతోంటే బద్ధకంగా కళ్ళు తెరిచి చూశాను.

ముఖంమీద ఎండపడి చురుక్కున మండింది! కళ్ళు పూర్తిగా తెరిచి చూశాను. బాగా పొద్దెక్కిపోయింది. టేబుల్ మీద టైంపీస్ ఏడున్నర చూపిస్తోంది.....

ఎంతోసేపు నిద్రపోలేదు. తెల తెలవారుతూండగానే అతికష్టంమీద నిద్రపట్టింది. ఇంతలో ఈ ఫోను—

లేచి దాన్నందుకున్నాను.

సరోజ గొంతు పలికింది ఉద్రేకంగా. "సురేష్, మీరు వెంటనే రండి!"

తేరుకొని, పోలీసులొచ్చారని గ్రహించాను. నిద్ర పూర్తిగా ఎగిరిపోయింది.

"హలో, దేనికి మాడమ్?" అడిగాను.

"ఓహ్, త్వరగా వచ్చేయండి! మీ బాస్‌కి ఏక్సిడెంట్ జరిగింది!"

"యాక్సిడెంటా! ఎక్కడ?"

"మీరు తక్షణం రండి, సురేష్! ఇక్కడికి పోలీసులొచ్చారు...."

"అలాగే, మాడమ్! వచ్చేస్తున్నాను...." ఫోన్ పెట్టేసి గబగబా తయారయ్యాను. గుడ్ గర్ల్! బాగానే ప్రవర్తిస్తోంది.

ఆటో ఎక్కి బయల్దేరుతూ నేను సరోజ గురించే ఆలోచించాను.... రాత్రి ఆమె గురించి చాలా తెలిసింది. నేను కారులో తిరిగి వచ్చేశాక ఇల్లంతా చక్కబర్చాం. అప్పుడామె తన వెధవ తమ్ముడి గురించి అంతా చెప్పింది. ఆ జాట్టుపోలిగాడి కోసం ఆమె చాలా కష్టాలుపడింది. తల్లి చిన్నతనంలోనేపోయి, తండ్రి తాగి తాగి ఇల్లూ వళ్ళూ గుల్ల చేసుకుని చెక్కేసి, అక్కా తమ్ముళ్ళిద్దరూ దిక్కులేని పక్షుల్లా వీధిలో పడ్డారట.

విధిలేక పాట పాడుకోవడానికీ, తమ్ముడి చదువు కోసమూ, తెలిసీ తెలీని వయసులో ఆమె కాలు జారిందట డబ్బుకోసం.

బుద్ధి పెరిగేదాకా ఆ సంపాదనే సుఖమనిపించి, అలాగే గడిపేసిందట కొన్నాళ్ళు. కానీ, తనని అర్థం జేసుకోని తమ్ముడు, తనూ జులాయి అయిపోతూంటే, చదువు మానేసి దమ్మిడీకి కొరగానివాడయిపోతూంటే, విడిచిపెట్టి మరో ఊరు వెళ్ళిపోయిందట తను.

అప్పుడు మనసు మారి, మంచి మార్గంలో బ్రతకాలనుకుని, తను నేర్చిన చదువుతో నల్గురు పిల్లలకి పాఠాలు చెపుతూ పొట్టపోసుకుందట.

అలా అలా అరికంగా నిలదొక్కుకొని, ప్రైవేటు పరీక్షలన్నీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో పడిందట. రెండేళ్ళ క్రితం మచిలీపట్టణం వదిలి హైదరాబాదులో అన్వేషిస్తూ ఈ రావ్ దగ్గరకొచ్చినపుడు, అతడి పంజరంలో చిక్కుకుందట. సాంఘికభద్రతకోసం అతడితో వివాహం తప్ప మరో గత్యంతరం తోచలేదట.

ఇదంతా చెప్పి ఆమె తన గతాన్ని ముందే నాకు చెప్పనందుకు బాధపడింది. ఇప్పుడు తనమీద విరక్తి కలిగితే మర్చిపోయి వెళ్ళిపొమ్మంది. నేను వెళ్ళనన్నాను. తీసికెళ్తానన్నాను. ఆమె గతంతో నాకవసరంలేదన్నాను. వర్తమానం బాగుంటే చాలన్నాను. ఆమె నా బాహువుల్లో గువ్వలా ఒదిగిపోయింది. నేనామెలో సంపూర్ణంగా లీనమయ్యాను.

అప్పటి మా సంసర్గం కొత్త అనుభూతుల్ని సంతరించుకుంది. ఎన్నో భయాలను దూరంచేసింది....

సిగరెట్ వెల్గించుకొని నేను, ఆటో వెతుకుతోంటే,

జుట్టుపోలిగాడి గురించి ఆలోచించాను. వాడి బ్లాక్ మెయిల్ ప్లాట్ లో మొదటి అంకం బాగానే పూర్తయింది. ఆ ఫోటోలు బాగానే తీశాడు వాడు. ఇక పైకం వసూలు చేసుకునే భాగం వుంది. వాడిప్పుడు యెలా రియాక్టవుతాడు, రావ్ చావు గురించి తెలిస్తే? ఆ సంతా అక్క పరమైందన్న దుగ్ధ వాడికుంటుంది....డిమాండ్ పెంచేస్తాడు. ఆ ఫోటోల్ని రావ్ స్నేహితులకీ, ఇటు సరోజ ఫ్రెండ్స్ కీ పంపి పరువుతీసే అవకాశం ఇప్పుడూ వుంది వాడికి. అలాటిది జరగడం మా ప్రాణాలు పోయినా భరించలేం.

రవ్రూఫ్ కేఫ్ లో వాడ్ని కలుసుకున్నప్పుడు తెలుస్తుంది, కొత్త మలుపు ఏమిటో. ఇప్పుడీ పోలీసుల్ని ఎదుర్కోవాలి....పోలీసుల్ని! వాళ్ళు నా సృష్టిని నమ్మతున్నారా? లేక అనుమానాలతో వచ్చారా? గుండె వేగంగా కొట్టుకుంటూంటే, అప్పుడే ఇంటిముందు ఆగింది ఆటో.

దిగి డబ్బులిచ్చేసి, గేటులోంచి వేగంగా వెళ్ళాను.

బాట మధ్యలో పోలీసు కారు ఆగివుంది.

అదురుతున్న గుండెతో గబగబా నడిచి ఇంట్లోకెళ్ళాను.

వాళ్ళంతా హాల్లో కన్పించారు, సోఫాల్లో కూర్చుని. సరోజ తలదించుకుని వుంది. ఆమె ముఖం బాగా నీరసించి పోయివుంది, రాత్రంతా నిద్రలేక. చిన్నారి ఆమెను చుట్టుకుపోయి తికమకగా దిక్కులు చూస్తోంది. ఎదురు సోఫాలో ఇద్దరు పోలీస్ ఇన్స్పెక్టర్లున్నారు. కింద నేలమీద ముసలి రాజయ్య వున్నాడు. అతను విలపిస్తున్నాడు.

నన్ను చూసి గొల్లుమంటూ లేచి వచ్చాడు.

"అయిపోయింది, బాబయ్యా.... ఇక అయిపోయింది!"

అతడ్ని కంగారుపడుతూ పట్టుకున్నాను. "ఏం జరిగింది తాతా?"

"మిష్టర్ సురేష్?" అడిగాడొక ఇన్‌స్పెక్టర్ నన్ను చూస్తూ.

తలూపాను. అతను కూర్చోమన్నాడు. ముసలి రాజయ్యని వదిలి నేను కూర్చుంటూ సరోజని చూశాను. ఆమె తలెత్తలేదు.

"మిష్టర్ సురేష్, నేను ఇన్‌స్పెక్టర్ శివనేశన్‌ని. వీరు కమాలుద్దీన్. మేము మీ బాస్ గురించి ఒక చెడు వార్త తీసుకొచ్చాం...." అన్నాడు ఇన్‌స్పెక్టర్ మళ్ళీ.

నేను ఉలికిపడుతూ చూశాను. "ఏమిటి, ఇన్‌స్పెక్టర్?"

"మీ బాస్ ఎక్కడికెళ్ళారో తెలుసా?"

"ఎందుకు, కోయంబత్తూరు వెళ్ళారు కదా...."

"యస్, సరోజగారు కూడా అలాగే అంటున్నారు. కానీ...."

"కానీ...ఇన్‌స్పెక్టర్?" అని వాళ్ళిద్దర్నీ ధైర్యంగా, పరీక్షగా చూశాను. అవి అనుమానిస్తున్న ముఖాల్లా లేవు. లేక నేను పొరబడుతున్నానా? ముఖభావాలతో చక్కటి గేమ్ ఆడతారీ పోలీసులు!

"ఆయన మీరనుకుంటున్నట్లు కోయంబత్తూరు వెళ్ళలేదు, మిష్టర్ సురేష్" అన్నాడతను ముందుకు వంగి, "ఆయన దగ్గర ఏ టిక్కెట్లూ లేవు. ఆయన దేనికి హోటల్లో బస చేశారో చెప్పగలరా ఇక్కడ?"

వెల్, వీళ్ళు నటిస్తున్నారో లేదో నాకిప్పుడే

తెలియదు. కానీ నేను నటిస్తున్నట్లు వీళ్ళకనిపించకూడదు. వీలయినంత ఎక్కువగా ఆశ్చర్యాన్ని ముఖంలోకి తెచ్చుకుని నోరు తెరిచాను. "ఆయన హోటల్‌లో బస చేశారా?"

తలూపాడతను. "హోటల్ మౌర్య, రూం నెంబర్ 918లో నిన్న ఉదయం పదిగంటలకి దిగారు."

"అర్థంగావడంలేదు, ఇన్‌స్పెక్టర్, ఫ్లయిట్ కాన్సిల్ అయితే ప్రయాణం మానుకుంటే హోటల్‌లో ఎందుకు దిగుతారు, ఇంటికి తిరిగిరాక?"

"మీరాయనతోపాటు ఏర్‌పోర్టుకి వెళ్ళారా?"

"లేదు. ఒక్కరే టాక్సీలో వెళ్ళారు. మా స్టాఫ్ కందరికీ చెప్పారు, బిజినెస్ ట్రిప్ మీద కోయంబత్తూరు వెళ్తున్నట్లు, ఎల్లుండి తిరిగిరానున్నట్లు. ఇంట్లో కూడా చెప్పే వెళ్ళారు, కదూ మాడమ్?"

తలూపింది సరోజ, ఎత్తకుండా నే.

"లేదు, హోటల్‌లో ఆయన సూట్‌కేసులో బిజినెస్‌కి సంబంధించిన కాగితాలేవీలేవు" అన్నాడు శివనేశన్, "బట్టలు మాత్రమే వున్నాయి."

"అయితే హోటల్ గది ఎందుకు తీసుకున్నారు? ఇంతకూ ఆయనకేమైంది?" అడిగాను ఆందోళన నటిస్తూ.

అప్పుడు కమాలుద్దీన్ నోరు విప్పాడు. "హోటల్‌లో ఎందుకున్నారో వూహించగలం, మిస్టర్ సురేష్. ఇంతకు ముందెప్పుడైనా ఇలా ఊరెళ్తున్నట్లు చెప్పి ఇక్కడే ఏ హోటల్‌లోనో గడపటం మీకు తెలుసా?"

"తెలియదు, ఇన్‌స్పెక్టర్."

"మిసెస్ సరోజ కూడా అలాగే అంటున్నారు. కానీ నా అనుమానం నిజమైతే, మీకెవరికీ తెలియకుండా ఆయనలా చేస్తూనే వుండాలి. అయితే ఇప్పుడే మీకు

తెలిసింది. దేనికని నిలదీసే అవకాశం ఆయన మిసెస్‌కి లేకుండా, ఆయన శాశ్వతంగా వెళ్ళిపోయారు....”

“ఇన్‌స్పెక్టర్?”

“మీ బాస్ ప్రమాదానికి గురియై మరణించారు.”

అదిరిపడి చూశాను. “ప్రమాదమా! బాస్‌కా! మరణించారా! ఎప్పుడు? ఎక్కడ?

“అయాం సారీ, మిష్టర్ సురేష్” కమాలుద్దీన్ అస్పష్టంగా గొణిగాడు, “మీ బాస్‌కి హోటల్ ముందు యాక్సిడెంట్ జరిగింది. వెంటనే యెవరూ చూడలేదు. ఉదయం నాలుగు గంటలకి ఒక ఆటో డ్రైవర్ చూసి రిపోర్టు చేశాడు. మీ బాస్ హోటల్ కాంపౌండు గోడ చివరగా, యెడమవైపు, బయట పేవ్‌మెంట్ మీద పడిపోయి వున్నారు. చాలా రక్తం పోయింది. తల చిట్లింది. దురదృష్టవశాత్తూ ఆయన అటుగా నడిచి వెళ్తూ అరటితొక్కమీద కాలువేశారు. జారింది. పేవ్‌మెంట్ కూడా వర్షంపడి స్లిప్పరీగా ఉండడంవల్ల ఆయన బాలన్స్ తప్పి ముందుకు పడ్డారు....పడుతూ అక్కడే వున్న ఎలక్ట్రిక్ స్తంబానికి కొట్టుకున్నారు తల....

“అంతే, ఆయన విస్కీకూడా తీసుకొని వుండడంవల్ల లేచే శక్తిగానీ, సహాయంకోసం అరిచే తెలివిగానీ లేక పోయాయి. అక్కడే, అలాగే బోర్లా పడిపోయి స్పృహ తప్పారు. తర్వాత ప్రాణాలు వదిలారు....”

నేను ఆతృతని అణచుకున్నాను. నేననుకున్నట్లుగా నే భావిస్తున్నారు వీళ్ళు!

“ఓహ్! అసలాయన బయటికెందుకొచ్చారు?” అడిగాను జాగ్రత్తగా.

“అదే చెప్పబోతున్నాను....” ఇప్పుడు శివనేశన్

అన్నాడు, "ఆయన హోటల్ లో ఎందుకున్నారో కూడా మీకు తెలుసుంది. మీ బాస్ ఆడ స్నేహితుల గురించి మీకు తెలుసా, మిష్టర్ సురేష్?"

"తెలీదు, ఇన్ స్పెక్టర్. వుంటారనుకోను. ఆయనకంత టైం లేదు...."

"సరోజగారు కూడా అలాగే నమ్ముతున్నారు.... ఇప్పుడు మీ నమ్మకాల్ని మార్చుకోవల్సిన అవసరంవుంది. ఆయన స్నేహితురాలిని కలుసుకోడానికే హోటల్ లో దిగారు."

"ఎలా అంటున్నారు, ఇన్ స్పెక్టర్?" అడిగాను. ఇన్ స్పెక్టర్ నేను ఏర్పరచిన మార్గంలోనే పోతున్నాడు.

"చెప్పగలను, మిష్టర్ సురేష్. ఆధారాలున్నాయి. ఆమె ఎవరో, ఎప్పుడొచ్చిందో, ఎలా వచ్చి వెళ్ళిందో యెవరూ చూడలేదు. కానీ ఆమె వున్నట్లు ఆధారాలున్నాయి. గదికి రహస్యంగా వచ్చి గడిపివెళ్ళింది, మీ బాస్ తో. మీ బాస్ తర్వాత రాత్రెప్పుడో ఎవరికంటా పడకుండా ఆమెను బయటచేరవేస్తూ కిందికి వచ్చారు. ఎవరూ చూడలేదు. నా వూహ మాత్రమే. నా వూహ తప్పుకాదని నా నమ్మకం."

"చెప్పండి, ఇన్ స్పెక్టర్."

"అప్పుడు బయట ఆటోలోనో, టాక్సీలోనో ఆమెను ఎక్కించి, గుడ్ నైట్ చెప్పివస్తూ.... వస్తూ జారిపడ్డారు."

"ఓహ్, ఆధారాలన్నారు....ఏమిటవి?"

"ఆ గదిలోనే దొరికాయి. ఆ ఆధారాలతోనే ఆయన స్నేహితురాలిని వూహించాం. బాత్ రూంలో కొన్ని వెంట్రుకలు దొరికాయి.... పొడవైనవి, స్త్రీవనుకోవచ్చు. అక్కడే ఒక మల్లెదండ కూడా వదిలివుంది....అది

స్త్రీదని కచ్చితంగా అనుకోవచ్చు. గదిలో బెడ్ షీట్స్ బాగా నలిగి వున్నాయి. రెండు వైట్ హార్స్ సీసాలు పూర్తిగా ఖాళీ వున్నాయి, గ్లాసులు లేవు. ఇవేగాక అన్నిటికీ మించి, ఆయన, కంఠం కిందుగా ఒక మరక వుంది.... లిప్ స్టిక్ మరక. అది స్త్రీదే అని గాక, ఆమె ఎంత సన్నిహితురాలో తెలియజేస్తుంది...."

"ఓహ్, ఇక వుండనీయండి, ఇన్ స్పెక్టర్! బాస్ గురించి ఇలాటివి వినలేకపోతున్నాను .... ఆయన పడి పోవడం ఎవరూ చూడలేదా?"

"లేదు, ఆ ప్రాంతం పగలే నిర్మానుష్యంగా వుంటుంది ..."

"ఇప్పుడు దీనిగురించి మీరేం చేస్తున్నారు, ఇన్ స్పెక్టర్?"

కమాలుద్దీన్ అందుకున్నాడు, "ఇందులో వేరే అనుమానించడానికి ఏదీలేదు. అఫ్ కోర్స్, పి.ఎమ్. రిపోర్టు వచ్చేవరకు ఆగడం మంచిదైనా, ఇది ప్లెయిన్ అండ్ సింపుల్ యాక్సిడెంట్ అని నేను చెప్పగలను. మరొకటి జరిగిందనుకోడానికి మోటివ్ కన్పించడం లేదు. ఆయన జేబుల్లో డబ్బూ, వస్తువులూ అలాగే వున్నాయి, గది తాళంచెవితో సహా. చేతికి వాచీ ఉంగరాలూ భద్రంగా వున్నాయి. ఏ దొంగోడో ఆయన్ని కొట్టి దోచుకున్నాడనుకోవడానికి వీల్లేదు.

ఎవరో అక్కడ అరడజను అరటిపళ్ళు తిని తొక్కలు పారేశాడు. సివిక్ సెన్స్ లోపిస్తోంది జనాలకి .... ఆ అరటి తొక్కలూ, వానపడి జారుడుగా వున్న పేవ్ మెంట్, వాడిగా వున్న రక్తం మరకలంటిన స్థంభం అంచులూ....ఇవి చాలు అది ప్యూర్ యాక్సిడెంట్ అన

డానికి. దీనికెవర్ని నిందించగలం? ఆ పళ్ళు తిన్నవాడ్ని పట్టుకొని శిక్షించడం సిల్లీగా వుంటుంది కదూ...."

నా ముఖంలో రంగులు మారడం అతను గమనించ లేదు.

వాళ్ళిద్దరు లేచి నిలబడ్డారు. శివనేశన్ అన్నాడు.

"మా తీర్పులో మీకేవైనా అభ్యంతరాలుంటే తెలుపండి. మేము దీన్నిలాగే క్లోజ్ చేయాలనుకుంటున్నాం... ప్రస్తుతానికి. బాడీ మీకు మధ్యాహ్నం ఒంటిగంటకి అందజేయబడుతుంది. ఇక మేం సెలవు తీసుకుంటాం."

వాళ్ళు వెనుదిరిగి చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

అనుమానాల్లేవు, అపోహల్లేవు, అనుకున్నట్టే జరిగింది. వాళ్ళు మళ్ళీ ఇక తిరిగి రాకూడదని మనసులో ప్రార్థించాను.

లేచి సరోజని చూశాను. ఎవరూ మాట్లాడే స్థితిలో లేరు. చిన్నారిని ఎత్తుకున్నాను.

"డాడీ ఏడి, అంకుల్? ఏమైంది డాడీకి?"

"డాడీ మమ్మీ దగ్గర కెళ్ళిపోయాడు...." అన్నాను జాలిగా చూస్తూ.

"మమ్మీ ఇక్కడే వుందిగా, అంకుల్?"

"ఏదీ?"

ఆమె సరోజని చూపించింది. "అదిగో, మమ్మీ ఇక్కడే వుందంకుల్!"

నేనామెని గట్టిగా హత్తుకుని ముద్దుపెట్టుకున్నాను. "చిన్నారి!"

"ఏమిటంకుల్?"

"నువ్వు మంచి పాపవి! ఇక వెళ్ళి ఆడుకోమ్మా...."

ఆమెని దింపి వదిలి పెట్టాను. ఆమె కేకలేస్తూ వరండాలోకి వురికింది.

ముసలి రాజయ్య కదిలి నా దగ్గరకొచ్చాడు. "నేను నమ్మలేకపోతున్నాను, బాబయ్యా! నా కేమనా లో తెలియడంలేదు...."

అతన్ని సానుభూతిగా చూశాను. అతను గొణుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

సరోజ నన్ను చూసింది, కళ్ళలో అభినందనతో.

"నువ్వేలా చేశావు, సురేష్!"

"వాళ్ళనుమానించలేను. ప్రస్తుతానికి రిలీఫ్."

"ఇకముందేం కాగుగా?"

నే జవాబివ్వలేదు. నా మనసును ఒకటి తొలుస్తోంది. అది చిక్కులు తేకూడదని ప్రార్థించాను.

"ఏమీ కాదు, సరోజా, అన్నీ యెదుర్కోవచ్చు. నువ్వింక నిశ్చింతగా వుండు. ఈ వార్త ఎవరికి కబురు చేయాలో చేసి నువ్విక్కడ ఏర్పాట్లు చూస్తూండు. నేను మధ్యాహ్నం వచ్చేస్తాను."

తలూపిందామె నిట్టూరుస్తూ.

6

జాట్టుపోలిగాడు రఫ్రూఫ్ కేఫ్‌కి నాకంటే ముందు చేరుకున్నాడు.

వాడు హుషారుగా కన్పిస్తూండడాన్ని బట్టి అర్థంజేసుకున్నాను పరిస్థితిని. కేఫ్ లోపల ఓ మూల గోడవార టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళాడు నన్ను.

"కూర్చో లవర్ బాయ్, కులాసేనా?"

కూర్చుంటూ సూటిగా చూశాను. "సంగతి చెప్పు త్వరగా!"

వాడు నవ్వి సప్లయర్‌ని పిల్చాడు. "దో సమోసా. దో చాయ్ లావ్!" అన్నాడు.

"నేను తినను, నువ్వే తిను" అన్నాను.

"ఏక్ సమోసా, దో చాయ్ లావ్!" అన్నాడు వాడు.

"అది కూడా నువ్వే తాగు!" అన్నాను మళ్ళీ.

"ఏక్ సమోసా, ఏక్ చాయ్ లావ్!" అన్నాడు ఆఖరికి.

సప్లయర్ తలూపి వెళ్ళిపోయాడు.

"నువ్వెందుకు తినవు, లవర్ బాయ్?" అడిగాడు చుంచు కళ్ళు చిట్లిస్తూ.

"నేను తినను, తినిపిస్తాను" అన్నాడు పొడిగా, వాడి కళ్ళు ఎగిరిపడ్డాయి. రాత్రి తిన్నది గుర్తొచ్చి వుంటుంది. "నేను వెళ్ళాలి, త్వరగా సంగతి చెప్పు!" అన్నాను మళ్ళీ.

"కాస్త నెమ్మది....ఎవరైనా వింటారు.." అన్నాడు వాడు చుట్టూ చూస్తూ. జనం యెవరి తిండిలో వాళ్ళు న్నారు. "నువ్వే చెప్పాలని రాత్రి మనం అనుకున్నట్లు గుర్తుంది... లవర్ బాయ్. కాబట్టి నువ్వే చెప్పాలి."

"నీకెప్పుడు కావాలి, ఆ రెండు లక్షలు?"

"రెండు లచ్చలా!" వాడు ఆశ్చర్యంగా అన్నాడు. "నేను అయిదు లచ్చలు వస్తాయనుకుంటున్నాను...."

"చూడూ, నీ చచ్చు భాష మాను. డబ్బు నాది కాదు. నువ్వామెతో నే ఎందుకు బేరమాడకూడదు?" అన్నాను, వాడి కొత్త ఆలోచన నాకర్థమయిపోయి.

వాడు తల అడ్డంగా వూపాడు. "ఇప్పుడామె ఇవ్వక పోవచ్చు...మనసు మారవచ్చు."

"ఎందుకు మారుతుంది?"

"నువ్వు చేసిన పనికి ఆమె మనసు మారవచ్చు...."

వాడి కళ్ళలోకి చూశాను. అవి హేళనగా నవ్వుతున్నాయి. ఏమిటి వీడన్నదానికి అర్థం? ఏమిటి నేను చేసిన పని అని వీడి ఉద్దేశ్యం?

"నువ్వేమంటున్నావో అర్థంగావడం లేదు...." అన్నాను ఇంకా జాగ్రత్తగా చూస్తూ.

వాడు నవ్వుతూ జేబులోంచి ఓ కవరుతీశాడు.

దాన్ని నాకిస్తూ, "ఇందులో చూడు. నన్ను మెచ్చుకోకుండా ఉండలేవు! ఆమె ఎందుకు మనసు మార్చుకుంటుందో, నేనెందుకు అయిదు లక్షలు రావాలనుకుంటున్నానో అంతా అర్థమవుతుంది...." అన్నాడు చాలా తగ్గు స్వరంతో.

తికమకపడుతూ కవరు విప్పి చూశాను.

అందులో ఫోటోలున్నాయి, రెండు.

ఒకదాంట్లో నేను రావ్ మీదకూర్చుని కొడుతున్నాను.

రెండోదాంట్లో రావ్ శరీరాన్ని కాళ్లోంచి పేవ్‌మెంట్ మీది కీడుస్తున్నాను.

రెండూ బాగున్నాయి. చక్కగా స్పష్టంగా వచ్చాయి.

అప్పుడు నా మనస్థితి యెలా వుందో చెప్పలేను. రాయిలా కూర్చుండి పోయాను.

వాడికేం పట్టనట్టు సమోసా ఆరగిస్తున్నాడు. వాడ్ని చూస్తూంటే గొడ్డు గ్రాసం నములుతున్నట్లుంది. నాకు వాడి గొంతు పట్టుకొని పిసికెయ్యాలనిపించింది! పడుతున్న చెమట, అదురుతున్న గుండె, వణుకుతున్న శరీరమూ నన్ను మూర్ఛవచ్చేలా చేస్తున్నాయి.

అతికష్టం మీద నన్ను నేను కంట్రోలు చేసుకొని, వాటిని కవరులో పెట్టాను. అప్పుడు గొంతు సరిచేసుకుని వాడిని అడిగాను.

"ఎలా తీశావు, వెధవా? అక్కడికెలా వచ్చావ్?"

వాడు తలెత్తి పళ్ళు బయటపెట్టాడు. "నిజానికి నేను నిజాయితీగా మీ ఇద్దరి బెడ్‌రూం సీన్‌లు తీసుకుందామనే వచ్చాను. కానీ లవర్ బాయ్, బలేవాడివే.. బావగార్ని అలా సత్కరిస్తావా? బాల్కనీ కిటికీ పక్కన దాక్కుని చూస్తున్నాను........ఇంతలో బావగారు ఎలా వచ్చాడో మీ యిద్దరి మధ్యా వచ్చిపడ్డాడు. చూస్తూండగానే నువ్వు కింతపడేసి తల పగలగొట్టేశావు! ఏవో భారీ డైలాగులు కూడా కొట్టేశావు.... నేనదే బంగారు గని అనుకుని నా బుల్లి కేమెరాని నొక్కేశానంతే."

వాడంతవరకు చెప్పి తినడం పూర్తి చేశాడు.

"అప్పుడు లవర్ బాయ్, మిమ్మల్ని జాగ్రత్తగా వాచ్ చేశాను. నువ్వు శవాన్ని కార్లో వేసుకుని వెళ్ళినప్పుడు నిన్ను వెంటాడాను. దాన్నేం చేశావో చూసి మళ్ళీ నా బుల్లి కేమెరాని నొక్కాను....బంగారు గని! అయిదు లక్షలు వస్తాయి! రాత్రంతా నాకు నిద్ర లేదు పో."

నేనలాగే కూర్చున్నాను చూస్తూ, వీడు గుంటనక్కలా తేలాడు! నా కొంప ముంచాడు! పోలీసులతో విజయవంత మైందనుకున్న నా నాటకం—ఇప్పుడు ఈ వెధవ చేతిలో అభాసు కాబోతోంది!

వెయిటర్ టీ తెచ్చిపెట్టి వెళ్ళిపోయాడు.

"లవర్ బాయ్, నిన్నటి లవ్ సీన్‌లు క్యాన్సిల్. ఈ మర్డర్ సీన్‌లు పర్మనెంట్!" అన్నాడు వాడు కప్పు

లాక్కుంటూ.

తేరుకుని వాడ్ని చూశాను. "నీ తెలివి బాగానే వుంది, వెధవా!"

"ఇప్పుడు నన్నలా పిలవకు!" అన్నాడు టీ తాగుతూ.

అది తాగుతోంటే గొడ్డు కుడితి తాగుతున్నట్లుంది.

నేనది చూస్తూ, "నువ్వు వెధవకంటే ఎక్కువేమీ కావు" అన్నాను.

"మరి ఇతరుల పెళ్ళాల్ని దొంగిలించే మీరేమవుతారు?"

నా చెయ్యి విసురుగా వెళ్ళి ఫెడీమని వాడి గెడ్డం మీద తగిలింది.

వాడు కప్పు పడేసి, కుర్చీతోపాటు వెనక్కి దొర్లి పడ్డాడు దభీమని.

జనం ఇటు చూసి, లేచి పరుగెత్తుకొచ్చారు ఏమైంది, ఏమందంటూ. కొందరు వాడ్ని పట్టి లేపి కూర్చోబెట్టారు. అందరూ గోలగా మాట్లాడుకోసాగారు.

"ఏమీ లేదు. విష్ చేసుకుంటున్నాం, అంతే. మీరు వెళ్ళండి...." అన్నాను.

"విష్ చేసుకుంటున్నారా!"

"కొంచెం ఉద్రేకపడ్డాం, చాన్నాళ్ళయింది కలిసి."

జుట్టుపోలిగాడు గెడ్డం రుద్దుకుంటూ వాళ్ళని చూశాడు మొహమాటంగా.

"అవును, చాన్నాళ్ళయింది కలిసి..." అన్నాడు బిడియంగా.

వాళ్ళు మమ్మల్ని విచిత్రంగా చూసుకుంటూ, నవ్వుకుంటూ వెళ్ళిపోయారు.

"వెధవా, నీ అక్క నరకం అనుభవించిందిరా! ఆమె

సుధరిస్తున్నానని చెప్పడానికి సిధ్ధపడను" అన్నాను కర్కశంగా, సిగరెట్ వెలిగించుకుంటూ.

వాడు మాట్లాడలేదు. వాడి కళ్ళనిండా భయం, షాక్.

"నన్ని జనంలో కలుసుకుంటే కొట్టలేననుకున్నావా, వెధవా? జనాన్ని పజిల్‌లో పెట్టి ఎలా కొట్టగలనో తెలుసుకున్నావా ఇప్పుడు?"

వాడు కోపంగా చూసి పళ్ళు నూరాడు.

"నన్ను మళ్ళీ కొట్టు—అంతా కక్కేస్తాను!"

నేను చెయ్యి లేపాను. వాడు వెనక్కి వంగాడు భయపడిపోయి.

"నాతో మర్యాదగా మాట్లాడాలి, వెధవా. ఏదీ, మళ్ళీ చెప్పు ఏమన్నావో?"

"మీరు మళ్ళీ కొడితే, నేనంతా కక్కేస్తాను, సురేష్ ...."

"మిష్టర్ సురేష్ అనాలి."

"మిష్టర్ సురేష్, నే చెప్పింది విన్నారు...."

"విన్నాను. కానీ నువ్వప్పుడే ఆ పని చేయలేవు, వెధవా. నీకా అయిదు లక్షలు కావాలి. ముందు నా చేత తన్నులు తినీతినీ, ఇక తట్టుకోలేననుకున్నప్పుడే నువ్వా కక్కడం గురించి ఆలోచిస్తావు."

"మీ రెందుకు తంతారు నన్ను?"

"నీకెంత తట్టుకునే శక్తి వుందో పరీక్షిద్దామని. అప్పుడు డబ్బు రిలీజ్ చేయిస్తాను."

"అప్పుడే ఎందుకు రిలీజ్ చేయించాలి డబ్బు?"

"ఎందుకంటే అప్పుడు నువ్విలా వుండవు. ఓ మంచం ఏర్పాటు చేసుకుంటావు. డబ్బు నీముందే వుంటుంది

కవ్విస్తూ. కానీ నువ్వేం చేయలేవు. అనుభవించలేవు. అప్పటి నీ పరిస్థితి చూసి నాకు కసిదీరా ఆనందించాలని వుంది!"

వాడు చటుక్కున ముందుకు వంగి, బెదిరింపుగా చూశాడు. "అయితే వినండి, మిస్టర్ సురేష్! నా గురించి మీకేం తెలీదు! నేనంత వెధవననుకున్నారా తన్నులు తినడానికి? నన్ను నేను రక్షించుకోగలను! వింటున్నారా? నన్ను రక్షించుకోగలను! ఈ క్షణంనుంచీ నా వెంట ఎప్పుడూ ఇద్దరూ వుంటారు, కంత్రీలు! చెయ్యివేస్తే దాన్ని తెగనరికి దాంతోనే చావ బాదుతారు! అర్థమవుతోందా? ఇది గుర్తుంచుకోండి! మరొకటి, ఆ ఫోటోలు మరో సెట్టు సీలు చేసి నా ఫ్రెండ్ కిచ్చాను — నేను చస్తే పోలీసులకిమ్మని!"

నాకర్థమైంది తెలుసుకున్నాను.

వాడ్ని తదేకంగా చూస్తూ సిగరెట్ పీల్చసాగాను. నాకిప్పుడిదంతా మరో విధంగా కన్పిస్తోంది. నేను భావిస్తున్న రూపం ఇప్పుడు దీనికి లేదు! అంతేగాక నా చుట్టూ ఏదో వల బిగుసుకుంటున్నట్టు భావన కలుగుతోంది. యెవరో నన్ను బొమ్మనుచేసి ఆడిస్తున్నట్లనిపిస్తోంది....

ఇదంతా ఓ పెద్ద గూడుపుఠాణీగా, దీని వెనుక ఓ పెద్ద దుష్టకూటమి పనిచేస్తున్నట్లుగా మనసు శంకిస్తోంది. ఇది వీడొక్కడి పని కానేకాదు. వాడివల్ల అయ్యేది కాదు. వీడికి జత వున్నారు....ముందే పటిష్టంగా పథకం వేసుకొని నన్నీ పరిస్థితుల్లో ఇరికించారు! అది వీడి మాటల వల్లే తెలుస్తోంది....

ఈ జాట్టుగాలిగాడు సరోజతో నన్ను బెడ్‌రూం

ఫోటోలు తీయడానికి వచ్చానంటున్నాడు రాత్రి! కానీ అంతకుముందు తీసిన ఫోటో లుండగా మళ్ళీ ఎందుక్కావాల్సొచ్చాయి నిన్న రాత్రి? బ్లాక్ మెయిల్ కి ఆ కారులో తీసినవే బాగా పనికొస్తాయి. కానీ మళ్ళీ ఎందుకవసరమయ్యాయి రాత్రి? అర్థంలేని పని! అందులో బుకాయింపు తెలిసిపోతూనే వుంది!

రాత్రి వీడు ఇంటికొచ్చిన అసలు ఉద్దేశ్యం, సరోజతో నా శృంగారాన్ని గాక, రావ్ తో శౌర్యాన్ని రికార్డు చేయాలనా?

అంతే....!! వీడు రావ్ తో నన్ను మర్డర్ ఫోటోలు తీయడానికే వచ్చాడు! అంటే వీడికి మర్డర్ జరుగబోతోందని ముందే తెలుసు! అలా అంతా ప్లాను ప్రకారం పకడ్బందీగా జరిపించారు వీడి జతగాళ్ళు! రావ్ కి ముందే మా వ్యవహారం తెలియజేసి, రాత్రి ఫలానా టైములో వెళ్ళి చూడమని టిప్ ఇచ్చారు! అతడలా వచ్చేస్తే నేను చంపేస్తానని వాళ్ళకి తెలిసివుండాలి.... అలాగే జరిగిపోయింది!

అది కాకతాళీయం కాదు, కల్పన!

రావ్ తనకి తెలియకుండా దుష్టుల ట్రాప్ లో అడుగు పెట్టి నా చేతిలో చచ్చాడు!

అయితే ఎవరు వీళ్ళంతా? ఈ దుష్టకూటమిలో ఎవరెవరున్నారు? వూహించలేకపోతున్నాను .... వాళ్ళని వూహించడం కంటే నా పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది! ఒక ఆలోచన వచ్చింది. ఈ జాట్టుపోలిగాడ్ని కనిపెట్టాలి. వీడి కదలికల్ని, చర్యల్ని, కలుసుకునే వ్యక్తుల్ని జాగ్రత్తగా కనిపెట్టాలి.... అప్పుడు తెలియవచ్చు. ఆ ముఠా స్వరూప స్వభావాలు.

"ఇప్పుడేమంటారు, మిస్టర్ సురేష్?" వాడిమాటలకి తేరుకుని చూశాను.

"సరోజకి చెప్తాను. ఇప్పుడు అయిదు లక్షలు ఆమెకు సమస్య కాదు. నువ్వు నాచేత మామూలుగా అడిగించినా ఇచ్చేది .... నేనేలాగో నచ్చ జెప్పి ఇప్పించేవాడిని. ఆఫ్టరాల్, నువ్వామెకు తమ్ముడివి."

"ఇలా అడిగితే పని తొందరవుతుందనుకున్నాను."

"సరే, నాకొక్కంచెం టైమివ్వు, రేపటివరకు, అవతల నీ బావగారికి ఇంకా జరిపించవలసి వుంది...."

"అలాగే, మిస్టర్ సురేష్, వాడికి మీరు మంచి శాస్తి చేశారు. మెచ్చుకోకుండా వుండలేను."

వాడు లేచి గబగబా వెళ్ళిపోయాడు. కౌంటర్‌లో బిల్లు చెల్లించి బయటకెళ్ళి తన సైకిలెక్కాడు.

శాస్తి చేశాను సరే, కానీ ఇప్పుడు నాకీగతేమిటి! ఆందోళనగా లేచి బయల్దేరాను. తొందరపడ్డాను. నేను చాలా తొందరపడి చేశాను....

బయట ఆటో ఎక్కి వాడి సైకిలుని జాగ్రత్తగా అనుసరిస్తున్నప్పుడు, ఆలోచనలు తిరిగి ముసురుకున్నాయి. పుత్రదారుల్ని తృప్తిపరిచినంతవరకు, నాకు పోలీసుల బెడదలేదు. పోలీసులు నేను సృష్టించినదాన్ని బాగా నమ్ముతున్నారు. దాన్నలాగే మూసివేసే ఆలోచనలో కూడా వున్నారు. ఆ విధంగా జరగాలని నేను బాగా ఆలోచించే చేశాను, జరిగింది. మళ్ళీ ఏదో వ్యతిరేక సాక్ష్యం లభిస్తే తప్ప వాళ్ళు పరుగెత్తుకురారు. అటువంటి సాక్ష్యం ఒక్కటే ఒక్కటి వుంది—అది నా జేబులో ఫోటోలు.

ఇవి చూస్తే సరోజ ఎలా రియాక్టవుతుంది? పూర్

డియర్, బెదిరిపోయి వెంటనే అడిగినంత ఇచ్చేయమం టుంది. ప్రమాదం తనకూ లేదూ? సందేహం లేదు. కానీ నాకేదో తట్టింది .... కానీ, జుట్టుపోలిగాడే మన్నా డిందాక?....ఏమిటది?....

'ఇప్పుడామె ఇవ్వకపోవచ్చు, మనసు మారవచ్చు'.... వాడికెందుకొచ్చింది సందేహం? ఏమిటది? ఇంకేదైనా అర్థముందా వాడి మాటలకి?....'నువ్వు చేసిన పనికి ఆమె మనసు మారవచ్చు' .... ఓహ్, నాకిప్పుడర్థమైంది! ఈ అక్కా తమ్ముళ్ళు కలిసి నాటకం ఆడడంలేదుకదా?

చటుక్కున సిగరెట్ పారేశాను. నిటారుగా కూర్చున్నాను. నా గుండె ఉండిఉండి కొట్టుకుంటోంటే, కొంతదూరంలో వేగంగా సైకిలు తొక్కుతున్న జుట్టు పోలిగాడ్ని చూస్తున్నాను. వాడు నయాపుల్ దాటి ఓల్డు సిటీవైపు సాగిపోతున్నాడు....

వాడు అక్కతో చేయి కలిపాడా? సరోజే స్వయంగా దీనికి పూనుకుందా? భర్త బాధలు పడలేక ఇలా చేయాలనుకుందా. ఇలా భర్తని తొలగించడానికే నన్ను సాధనంగా వాడుకుందా? అందుకే రాత్రి అసాధారణంగా, ఇంటికాహ్వానించిందా? భర్తకి తమ్ముడి ద్వారా తనే టిప్ ఇచ్చి రప్పించిందా?

అవును! అవును! అవును!

ఆమె చంపించాలనుకుంది! యిందులో యే మాత్రం సందేహంలేదు! ఆమె నన్ను ఇంటికి ఆహ్వానించడం అదే సమయంలో బాస్ రావటం అంతా ఆమె చేసిన ప్లానే! అంతకుముందే ఆమె ఏమని మాట్లాడింది? చిన్నారి అనాథ అవుతే....తండ్రి కూడా చచ్చిపోతే....ఈ మాటలు దేనికి ప్రతీకలు? ఆమె మనసులో పథకాన్ని ప్రతిబింబించే

భావాలు! నేనెంత ఫూల్‌ని! ఆమెని ఎలా నమ్మాను! ఇప్పుడు నీ ముఖం చూడను పొమ్మంటుంది! అవసరం తీరింది!

కానీ___

మరి ఈ బ్లాక్ మెయిల్ ప్రహసనం ఏమిటి? ఇదామె పథకంలో ఎక్కడ, ఎలా ఇముడుతుంది?.... కాస్సేపటి వరకు నా కర్థంగాలేదు. నన్నిలా బెదిరించి, భయపెట్టి, తను పొందే ప్రయోజనమూ లేదు, ఆ అవసరమూ లేదు. ఇలా తన బాక్కసంలోంచి తన డబ్బే తీసి తనవాడికే చెల్లించడంలో అర్థముందా?

అలా కాదు.

ఆమె ఏ పదివేలో ఇస్తానని వుంటుంది. వీడికి 'లచ్చల' మీద ఆలోచనలున్నాయి. అందుకని అక్కని డబుల్ క్రాస్ చేశాడు. ఆమెకు తెలీయకుండా ఈ ఫోటోలు తీశాడు. దీంతో వాడికి కోరినంత డబ్బు వచ్చి పడుతుంది!

అందుకే ఆమె 'ఒప్పుకోదు' అని సూటిగా చెప్పే దాన్ని, 'మనసు మారవచ్చు' అని పరోక్షంగా సూచించాడు. ఆమెను ఒప్పించే బాధ్యత, అగత్యం వచ్చినట్టు నాకే వున్నాయి!

ఆందోళనలోంచి తేరుకుంటూ వాడ్ని చూశాను. వాడు ఒక్కసారీ వెనక్కి చూడకుండా అర్జంటుగా నూసుకుపోతున్నాడు. ఓల్డు సిటీలో ఓ పేట చేరుకుని ఒక వీధిలోకి తిరిగాడు. ఆ మొదట్లో నేను ఆటో ఆపించి చూశాను. వాడు తిన్నగా పోతున్నాడు.... ఆ వీధిని చూస్తే ఇట్టే తెలిసిపోయింది రెడ్ లైట్ ఏరియా అని. శృంగార వనితలు అప్పుడే వ్యాపారాలు తెరిచారు...

వాడు ఎడమవైపు తొమ్మిదవ ఇంటిముందు సైకిలాపి

దిగాడు. మెట్లెక్కి వెళ్ళి తలుపు కొట్టాడు. కొన్ని క్షణాల్లో ఎవరో ఒకామె తలుపు తీసి చూసింది. వాడు లోపలికెళ్ళాడు. తలుపు మూసుకుంది.

నిట్టూర్చాను. ఆ యింటిని గుర్తుపెట్టుకొని ఆటోని వెనక్కి పోనివ్వమన్నాను.

నేను తిరిగివచ్చేటప్పటికి రావ్ మృతదేహం ఇంటికి వచ్చి వుంది. అంతా గందరగోళంగా వుంది. బంధువు లెవరూ లేకపోయినా, తెలిసవాళ్ళు చాలామంది వచ్చారు. సరోజ అప్పుడు నిజంగా ఏడ్చేసింది. ఆమెమీద నాకే మాత్రం సానుభూతి కలగలేదు. మనసులో అనుమానాల పెను తుఫాను ఒకటే చెలరేగుతూంటే ఆమెకు దూరం దూరంగా వుండిపోయాను. చిన్నారిని ఎత్తుకొని. ముసలి రాజయ్య ధారలుగా కన్నీరు కార్చాడు.

ఆ సాయంత్రం ఘనంగా అంత్యక్రియలు జరిగాయి నా బాస్‌కి.

అక్కడ నాకు తెలియకుండానే రెండు కన్నీటి చుక్కలు రాల్చాను.

7

చీకట్లో తల వంచుకుని నిశ్శబ్దంగా కదుల్తూ సాగి పోతున్నాను....ఏ కాస్త తల ప్రక్కకు తిప్పినా రక రకాల సంజ్ఞలతో, అసభ్య చేష్టలతో, పిలుపులతో ఆహ్వానిస్తున్నారు వాళ్ళు.

నేను తిన్నగా వెళ్ళి ఆ ఇంటిముందాగి, లోపల శబ్దాల కోసం విన్నాను. ఏవీ లేవు. అప్పుడు తలుపుమీద చిన్నగా కొట్టాను. వెంటనే గాజుల గలగలలు, ఆ తర్వాత అడుగుల సవ్వడి విన్పించాయి. తలుపు తెరుచుకుంది.

నా ముందు నిల్చున్న ఆమె వయసు పద్దెనిమిదికిమించి

వుండదు.

ఆమె నవ్వుతూ చూస్తోంది. ఆ నవ్వు నాకు కొత్తగా వుంది.

"రా, చిన్నోడా!" ఆమె ఆహ్వానించింది.

నేను విస్తుపోతూ లోపలికి అడుగుపెట్టాను. అదేం పిలుపు?

ఆమె తలుపు మూసి నన్ను చురుగ్గా చూసింది. ఆ కళ్ళల్లో కొంటెతనముంది. ముఖంలో చలాకీతనం వుంది. అందచందాలెలా వున్నా సౌష్టవాలు మాత్రం చిల్లర జాతి వాళ్ళని ఆకట్టుకునేలాగానే వున్నాయి.

నేనూ అదే వేషం కట్టి ఉన్నాను. నన్ను చూస్తే జేబులు కొట్టేవాడనుకుంటారు. నా చేతిలో ఒక ప్లాస్టిక్ ఏర్ బ్యాగు వుంది.

ఆమె నవ్వి, "రాత్రంతానా, చిన్నోడా?" అనడిగింది.

"కాదు, ఓపికున్నంత దాకా! ఎంత?" నేనన్నాను.

ఆమె చొరవగా నా నడుము చుట్టేసి తీసికెళ్ళింది లోపలి గదిలోకి, "అయితే పద, చిన్నోడా! ఎంతో అంత ఇద్దువుగాని!"

వీళ్ళిలాగే పిలుస్తారేమోననుకుంటూ నేనామెతో గదిలోకెళ్ళాను.

ఆ గదిని నేను వర్ణించదలచుకోలేదు.

మీలో సెన్సిటివ్స్ ఉంటే డోకు వచ్చేస్తుంది.

నన్ను మంచంమీద కూలదోసి, "మందు కావాలా?" అనడిగిందామె.

"తెచ్చాను" అన్నాను బ్యాగుని తట్టి చూపిస్తూ.

"తెచ్చావా? అయితే తీయ్, చిన్నోడా!"

"తీస్తాను, మధ్యలో ఎవరూ రారు కదా?"

"పోలీసులా? నీకా భయంలేదు, చిన్నోడా!"

"ఆ భయంకాదు, నాకిది అలవాటే. మరేదైనా గిరాకీ వచ్చేస్తుందేమోనని...."

"ఒకరుండగా ఎవర్నీ రానివ్వను!" అందామె నా ప్రక్కన, నన్నానుకుని కూర్చుంటూ. నేను ఊపిరి బిగబట్టాను. ఏం వాసన అది? ఆమె నా మెడని చుట్టేసి, "ఏ ఊరు మనది, చిన్నాడో?" అంది బ్యాగుమీద కన్నేస్తూ.

"పక్క ఊరే, పల్లెటూరు" అన్నాను దాన్ని స్టూలు మీద పెడ్తూ.

"ఏం పనిమీద వచ్చావు?"

"పట్నం పిల్లలు బాగుంటారంటే చూసిపోదామని."

"మరి నేను నచ్చానా?"

"నచ్చడానికివి పెళ్ళిచూపులా? టెంపరరీ వ్యవహారం."

"అయితే వచ్చెయ్, చిన్నోడా!"

"ముందు నన్నలా పిలవకు, నీకంటే పెద్దవాడ్ని."

ఆమె కిలారున నవ్వింది ఊగిపోతూ, "నాకలవాటు చిన్నోడా! అలవాట్లు మానుకోలేం, అవునా?"

"అవును.... అందుకే ఇలా ఉన్నావు."

"చిన్నోడా! ఇలా ఉండడంలోని మజా నీకేం తెలుసు?"

"అవును.... రుచులు చూడవచ్చు, రోగాలంటించుకోవచ్చు."

"అలా మాట్లాడకు, చిన్నోడా! నా దగ్గర నీకా భయంలేదు!"

"నాకెవరి దగ్గరా భయంలేదు."

"ఎందుకలేదు, చిన్నోడా?"

"నాకందరూ భయపడతారు."

మళ్ళీ కిలారుమందామె, నన్ను పట్టుకొని ఊగిపోతూ. "నిన్ను చూసి భయపడతారా! నిన్ను చూసి! పో చిన్నోడా, నేన్నమ్మను! నువ్వు రిషీకపూర్‌లా వున్నావు! చూస్తే పరుగెత్తుకొచ్చి ముద్దు పెట్టుకుంటారు నిన్ను-"

"కాదు, శక్తికపూర్‌లా చూస్తానని పారిపోతారు. మా అమ్మ తప్ప నన్నెవరూ ముద్దుపెట్టుకోలేదు."

"అయితే ఇప్పుడు నేను ముద్దు పెట్టుకుంటాను.... అయాం ఫస్ట్!" ఆమె చటుక్కున ముఖం దగ్గరకు తెచ్చి నా పెదాల్ని తన పెదాల్తో అదిమిపట్టేసింది. నేనొక్క తోపుతో ఆమెను మోరంగా తోసేసి అసహ్యంతో పెదాల్ని తుడుచుకున్నాను. ఒక్కసారి వంట్లో ఎలాగో అయిపోయింది....

"లవ్‌లీ బాయ్!" ఆమె దగ్గరకొచ్చి నా చెంపలు నిమిరింది, "ఎంత రుచిగా ఉన్నావు! యూ ఆర్ స్వీట్! యూ మై హీరో, ఐ యువర్ హీరోయిన్-పూనమ్‌ధిల్లాన్! ఓ.కే?"

"కుర్ర హీరోయిన్‌లంటే నాకు కంపరం."

"నీకు నాలాటి కుర్రదే కావాలి, చిన్నోడా!"

"కానీ మధ్యలో నీ మాజీ హీరో విలన్ అయి పోతాడేమో?"

"ఎవరు చిన్నోడా, మాజీ హీరో?"

"నాగేష్....ఆ జుట్టుపోలిగాడు."

"ఓహ్, వాడా!" కిలారుమందామె, "బలే పేరు పెట్టావులే, చిన్నోడా! నేను చిన్నోడా అని పిలిస్తే నే వాడు చెంప పగలగొట్టాడు. నువ్వలా చేయవు, మంచి

వాడివి!"

నేనూ పగలగొడ్తాను యూ బిచ్, మళ్ళీ నా పెదాల్ని తాకితే! అనుకున్నాను మనసులోనే.

"వాడెక్కడున్నాడు?" అడిగాను మామూలుగా చూస్తూ.

"ఇప్పుడు వాడిగోల ఎందుకు, చిన్నోడా! మందు తీస్తావా? ఇక మంచాన్నుపయోగించుకుంటావా?"

"మంచం నా ఇంట్లోనూ వుంది. దాన్ని నేనుపయోగించే తీరు వేరు. మందు తీస్తాను. నీకావల్సింది డబ్బు. నాకావల్సింది కాలక్షేపం. మందుకొట్టి నీ ఇష్టమొచ్చినంతసేపు వాగు!"

బ్యాగు తెరిచి వైట్ హార్స్ సీసా తీశాను. ఆమె దాన్ని చూస్తూనే పెదవులు చప్పరిస్తూ లేచి వెళ్ళి రెండు గ్లాసులూ ఒక నీళ్ళ జగ్గుతో వచ్చింది.

నేను చిప్స్ ప్యాకెట్ తెరిచి స్టూలుమీద పెట్టాను. సీసా సీలు విప్పి ఆమె గ్లాసులో కొంత పోశాను. ఆమె వెంటనే నీళ్ళు కలుపుకుని, "మరి నువ్వు?" అంది.

"నేనిలాగే...." అంటూ సీసా పైకెత్తాను.

ఆమె గ్లాసు పైకెత్తి గటగటా శబ్దం చేస్తూ పూర్తిగా తాగేసింది.

నేను రెండు గుక్కలు తాగి సీసా కింద పెట్టాను. నాలుగు చిప్స్ అందుకున్నాను.

"బాగుంది, చిన్నోడా!" అందామె మళ్ళీ గ్లాసులోకి వంపుకుంటూ, ఆమెకు నిషా బాగా తలకెక్కింది.

"మీ మగాళ్ళంతా మోసగాళ్ళే! పచ్చి దుర్మార్గులు! ఆడదాన్ని హింసించేవాళ్ళు! నన్నిలా యెవరు చేశారో తెలుసా, చిన్నోడా? నీకు తెలుసా, చిన్నోడా? వాడే!

ఆ దమ్మిడీకి కొరగానివాడు—ఆ జుట్టుపోలిగాడే....!"
నిషాలో అరవసాగింది.

"ఏ చేశాడు వాడు?" అడిగాను, ఆమె అరుపుల మధ్య.

"నన్ను నమ్మించి తీసుకొచ్చాడు....సంవత్సరమైంది, చిన్నోడా! వాడ్ని నమ్మి నావాళ్లనందర్ని వదిలి వచ్చేశాను! వాడు చెప్పింది చేయలేదు! వాడికో పనీ లేదు, పాటా లేదు! నాకు చేయిస్తానన్న నగలూ లేవు, కొనిస్తానన్న చీరలూ లేవు! నన్నీ కూపంలో పడేసి నా మీద ఇలా సంపాదించి తింటున్నాడు, చిన్నోడా! నేను పారిపోతే ఎక్కడున్నా వెతికి చంపుతానంటాడు! ఈ పని కాదంటే కంతాడు! తన అక్క కూడా ఇలాగే చేసిందంటాడు, చిన్నోడా, తనకోసం! మగాడ్ని నమ్ముకున్న ఆడది గడ్డు కాలంలో ఇలా సాయపడటంలో తప్పు లేదట! చిన్నోడా, నేనిక భరించలేను! చచ్చిపోతాను! ఇలా బ్రతకలేను! మీ మగాళ్ళ ప్రపంచంలో నాకీ బ్రతుకొద్దు—"

ఆమె తల బాదుకుంటూ ఏడ్వసాగింది....

"ఆవేశపడకు, అలా ఏడ్వకు. నేను నిజంగా చెడ్డవాడ్ని కాను. నీ కథేమిటో తెలుసుకుందామని వెచ్చగొట్టాను....ఇప్పుడు నీ గురించి అంతా చెప్తే, నీకు సాయపడగలనేమో ఆలోచిస్తాను."

"నిజంగానా, చిన్నోడా?" అందామె కళ్ళు తుడుచుకుని ఆత్రుతగా చూస్తూ, "వాడు నన్ను చంపకుండా కాపాడతావా?"

"నిన్ను వాడు చంపడు. వాడి గురించి పూర్తిగా చెప్తే, వాడి సంగతి నేను చూసుకుంటాను" అంటూ

బ్యాగులోంచి టేప్ రికార్డర్ తీసి నూలుమీద పెట్టాను.

ఆమె విచిత్రంగా చూసింది. "అదేమిటి చిన్నోడా?"

"ఇది సింగారం పెట్టె" రికార్డింగ్ ప్లే బటన్‌లు కలిపి నొక్కాను.

"దాన్ని నాకిచ్చేస్తావా?"

"నువ్వు అన్నీ చక్కగా మాట్లాడితే ఇచ్చేస్తాను."

"ఇచ్చేయ్, చిన్నోడా! నా గేవ్ నాకేమీ తెచ్చివ్వడు. నా దగ్గర డబ్బు లాక్కుపోతాడు ..."

"వాడెక్కడుంటాడు? ఇక్కడుండడా?"

"ఊహూ. మలక్ పేటలో వేరే ఇల్లు తీసుకున్నాడు."

"ఎక్కడది?" అడిగాను తిరుగుతున్న టేప్‌ని చూస్తూ.

ఈ టేప్‌ని నింపి ఆ బొట్టుపోలిగాడి మాడుమీద కొడితే, వాడి బెదిరింపులేమిటో తెలిసిపోతుంది!

"గవర్నమెంట్ ప్రెస్ వెనుక.... రిక్షాలు తొక్కే లంబాడీలుంటారు .... అక్కడే చిన్న పెంకుటిల్లు" చెప్పిందామె.

"వాడితోపాటు ఇంకెవరుంటారు?"

"ఏమో తెలియదు, చిన్నోడా. ఇక్కడికెవర్నీ తీసుకురాడు. వాడేం చేసేవాడో కూడా తెలిసేదికాదు. కానీ మొన్నొకరోజు ఏవేవో పెద్ద పెద్ద విషయాలు మాట్లాడాడు...."

"ఏం మాట్లాడాడు?"

"లక్షలు సంపాయిస్తాడట! నాక్కావల్సినవన్నీ కొని పెట్టి ప్రేమగా చూసుకుంటాడట. అసలిక్కడ ఉండమట మేము. యెక్కడికో వెళ్ళిపోయి పెద్ద వ్యాపారం పెడ్తాడట...."

"ఇంకా?"

"తనకో అక్క వుందని చెప్పాడు, చిన్నోడా. శ్రీమంతురాలట. ఆమె ఇస్తుందట డబ్బు. వూరికే ఎలా ఇస్తుందని అడిగాను. అప్పుడేదేదో చెప్పాడు. భయమేసింది. తాగివున్నాడు చిన్నోడా, బాగా! చాలా చెడ్డగా వాగాడు...."

"ఏం వాగాడు?"

"తన అక్క దేవత ఏమీ కాదట. నాకూ ఆమెకూ తేడా ఏమీ లేదట. ఎవరితోనో తిరుగుతోందిట, భర్తనుంచుకుని, ఆ తిరుగుళ్ళు తను ఫోటోలు తీశాడట. వాటిని చూపిస్తే ఇస్తుందట అయిదు లక్షలు....నీవన్నీ పిచ్చి మాటలని కొట్టిపారేశాను. ఏదీ చేయలేక వాడలాగే కలలు కంటాడు, చిన్నోడా. అవీ చాలా చెడ్డగా కంటున్నాడనుకున్నాను....

"కానీ చిన్నోడా, నా హేళనచూసి వాడు అరిచాడు. లక్షలు గడిస్తా చూడమన్నాడు. అలాగాకపోతే ఇంకెలాగో....ఇంకేదో పెద్ద ఆలోచన కూడా వుందట. దానికి తిరుగేలేదట! అదేమిటో చెప్పనన్నాడు. డబ్బు తెచ్చి చూపిస్తా చూడమన్నాడు ...అంతే, ఆ తర్వాత ఆ విషయమే ఎత్తలేదు వాడు. తాగిన మైకంలో ఆ రోజు ఏదో వాగాడు. నేను కూడా అది మర్చిపోయాను...."

ఆమె పరీక్షగా చూసింది నన్ను. "కానీ నువ్వేం చేస్తావు, చిన్నోడా? నన్నెలా కాపాడతావు వాడి బారి నుంచి?"

తేరుకుని రికార్డర్ ఆఫ్ చేశాను. "ఆలోచిస్తాను. ప్రస్తుతానికి వాడ్నీ ఛాయలకి రావద్దని హెచ్చరిస్తాను.

తప్పక బెదురుతాడు. ఒకవేళ మొండికేస్తే రేపే నిన్నిక్కడ్నించి తీసికెళ్ళిపోయి మరోచోట వుంచుతాను, అక్కడికెలా వస్తాడో చూస్తాను. కానీ నువ్వేం చేద్దామనుకుంటున్నావప్పుడు?"

ఆమె కళ్ళు విషాదాపూరితాలయ్యాయి. "ఏమో చిన్నోడా, ఈ బ్రతుకేం అర్థంగావటంలేదు!"

"ఏం చదువుకున్నావు?"

"నా చదువు పనికిరాదు, చిన్నోడా?"

"చదువక్కర్లేదు. నీకో ఉద్యోగం ఇప్పిస్తాను, వస్తావా?"

ఆమె కళ్ళు వెలిగాయి. "ఎక్కడ చిన్నోడా?"

"నా బాస్ ఇంట్లో అతనికో చిన్న కూతురుంది. నువ్వు ఆయాగా వుంటావా?"

సంతోషంగా చూసిందామె. "అలాగే చిన్నోడా, నీకెంతో ఋణపడి వుంటాను."

"గుడ్!" నేను లేచి బ్యాగు సర్దుకున్నాను. "రేపొకసారి కలిసి నీకే విషయం చెప్తాను. వాడికి నువ్వీ సంగతి తెలియనివ్వద్దు."

"ఊఁహు, వాడికేం చెప్పను."

ఆమె చేతిలో యాభైరూపాయలు పెట్టాను.

"ఎందుకు చిన్నోడా, నీకు నేనేం ఇవ్వలేదు."

"ఇప్పుడు నువ్వెవ్వరికీ ఇలా ఇవ్వవు. ఎవరైనా లోపలి కొస్తూంటే వాడి మొహాన తలుపు వెయ్యి."

బ్యాగు తీసుకుని బయటికి నడిచాను. ఆమె తలుపు వరకూ వచ్చి సాగనంపింది. నేను వీధిలో నడవసాగాను. రాత్రి బాగా గడిచిపోయింది. వీధి అంతా నిర్మానుష్యంగా వుంది. ఇప్పుడు నా మనసు కొంత నిర్మలంగా

వుంది. నాకో సాధనమంటూ దొరికింది ఎదుర్కోవడానికి. వాడి ఆట పట్టించడానికి ఇంతకంటే అవసరం లేదు—

హఠాత్తుగా నా వెనుక అడుగులు వినిపించాయి.

నా సిక్స్త్ సెన్స్ వెంటనే నన్ను వెనక్కి తిరిగేలా చేసింది. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది....విసురుగా వచ్చిన ఆ రెండు ఆకారాలూ నన్ను చుట్టేశాయి. చీకట్లో వాళ్ళెవరో కనిపించలేదు. ఒకడి చెయ్యి నా శ్యాగుని లాక్కుంది. మరొకడి హస్తం నా నడినెత్తి మీద పడింది. ఠంగ్ మని నా మెదడులో శబ్దమూ శూన్యంతోపాటు, కళ్ళముందు ఓ మెరుపు, తర్వాత చీకటి—

తిరిగి కళ్ళు తెరిచినప్పుడు నేను కిందపడిపోయి వున్నాను. క్షణాల్లో తేరుకొని ఏం జరిగిందో గ్రహించాను. లేచి పరుగెత్తాను వెనక్కి, రాణి ఇంటి వైపు.

ఇంట్లో ఆమె రక్తపు మడుగులో పడివుంది, కత్తిపోట్లు తిని.

8

టెలిఫోన్ గణగణ మోగుతోంటే బద్ధకంగా కళ్ళు తెరిచాను.

కిటికీలోంచి ముఖంమీద పడి ఎండ చురుక్కుమంటోంది.

లేచి మత్తుగా రిసీవరందుకున్నాను. రెస్పాన్స్ యిచ్చాను.

"ఏయ్, ఏమనుకున్నావో మల్లు! నువ్వు పిచ్చివేషాలు మానకపోతే పోలీసులకి పంపిస్తాం ఆ ఫోటోలు! గుర్తుంచుకోమల్లు, ఇది ఆఖరి వార్నింగ్!"

"ఎవరు—ఎవర్రా నువ్వు?"

"నోర్మూసుకోమల్లె!" ఫోన్ పెట్టేశాడు.

ఎవడు వీడు? ఆలోచిస్తూ నేనూ పెట్టేశాను. వీడెవడో కత్తుల రత్తయ్యలా వున్నాడు. జుట్టుపోలిగాడు కాదు. వాడి అనుచరుడు, రాత్రి రాణిని చంపినవాళ్ళలో ఒకడు.

నిట్టూరుస్తూ టైము చూశాను. ఎనిమిది కావస్తోంది... రాత్రికూడా నిద్రలేదు. రాణి చాలా డిస్టర్బ్ చేసేసింది. చిన్నోడా, నువ్వు వాళ్ళ అంతు చూడకపోతే నిన్ను క్షమించను!—అని పదే పదే వచ్చి చెప్పింది కలలోకి.

ఈసరికి ఆ పేటలో ఆమె చావు తెలిసిపోయివుంటుంది. పోలీసులు వచ్చి వుంటారు. పేటలో వాళ్ళు జుట్టుపోలిగాడి గురించి చెప్పివుంటారు. పోలీసులు వాడి కోసం వెతుకుతూ వుండివుంటారు. రాత్రి వాడిల్లు వెతుక్కుంటూ నేను వెళ్ళాను. కానీ తాళం వుంది. ఎక్కడికైనా పరారయ్యాడా?

వాడెక్కడున్నా నన్ను కలిసితీరుతాడు!

టవలందుకొని బాత్ రూంకి బయల్దేరబోతున్నాను.... అప్పుడు మళ్ళీ మోగింది ఫోన్.

ఆగిపోయి, తటపటాయిస్తూ వెళ్ళి ఎత్తాను.

"ఓహ్, సురేష్!" అరిచింది అవతలి గొంతు.

ఉలిక్కిపడ్డాను గుర్తుపట్టి. "హలో, ఏమిటి?" అన్నాను, ఇప్పుడామెను పేరుతో పిలవాలంటే ఎలాగో వుంది.

"నువ్వెంటనే రా!"

"ఎందుకు?"

"మాట్లాడాలి!"

"ఏం మాట్లాడాలి?"

"నువ్వు త్వరగా రా, చెప్తాను!"

మళ్ళీ నేనేదీ అనే లోపు పెట్టేసింది ఫోను. ఆలోచిస్తూ నేను కూడా పెట్టేసి కదిలాను....

ఏమిటది, వెనువెంటనే ఇలా రెండు ఫోన్‌లు కాకతాళీయమా? ఇప్పుడు వీళ్ళిద్దరు ఒకేచోట వున్నారా? యెలా సంభవం? ఆ రత్తయ్య జుట్టుపోలిగాడి అనుచరుడైతే ఈమెకెలా తెలుసు? లేక ఆమే పెట్టుకుందా ఈ మనుషుల్ని? ఆమే చంపించిందా రాణిని? ఆమె తమ్ముడి ఈ కొత్త బ్లాక్ మెయిల్ నేనింకా చెప్పకముందే పసిగట్టిందా? మొన్న రాత్రి, వాడు మా యిద్దరి ఫోటోలతో వచ్చినప్పుడే అనుమానించి మనుషుల్ని నియమించిందా వాడిమీదా, నామీద?

ఆటో ఎక్కి నేను హోటల్ మార్యకు పోనివ్వమన్నాను. అక్కడ నే నొకటి నిర్ధారించుకోవాలి. అదొక్కటే కేవలం నేనింతవరకు ఊహించుకుంటున్న శత్రు పథకం యొక్క అస్తిత్వాన్ని నిరూపిస్తుంది.... ఇప్పుడు నన్నెవరైనా వెంటాడుతూంటే, హోటల్‌లో నా ఎంక్వయిరీ ఏ విధంగా తనకు ప్రమాదకరమో వాళ్ళు ఊహించందరు. నా పొరపాటును ఏదో దిద్దుకుంటున్నాననుకుంటారు. నా శ్రేయస్సే వాళ్ళ శ్రేయస్సు కదా?

ఆ తర్వాత సరోజని కలవాలి—ఒకప్పుడు నాకున్న సర్వస్వాన్ని.

ఆమె ఎందుకు పిలిచింది నన్ను? ఏమిటంత అర్జంటుగా మాట్లాడాలంటోంది? నాకు నీరసం వచ్చేసింది....రాత్రి సంఘటన నన్ను నిర్వీణ్యుడ్ని చేసింది. రాణి ప్రాణాలు పోయాయి సరే, నన్ను రక్షించే అతి ముఖ్యమైన సామగ్రి

పోగొట్టుకున్నాను—తిరిగి వాళ్ళ బందీనై పోయాను!

వారిపాడవునా న న్నెవ రైనా వెంటాడారేమో తెలియదు. ఆటో దిగినప్పుడు వెనుక వందగజాలదూరంలో అనుమానాస్పదంగా ఏ కదలికా కన్పించలేదు. వేగంగా హోటల్లోకి నడిచి సరాసరి మేనేజర్ గదిలోకెళ్ళి పోయాను. అతడితో మాట్లాడాను.

"సర్, నిన్న మృతిచెందిన మిస్టర్ బి.జె.పి. రావ్ నాకు బాస్ అవుతారు. నేనాయన పర్సనల్ సెక్రటరీ మిస్టర్ సురేష్ని. మా బాస్ కలాపాలు ఇక్కడ మమ్మల్ని చాలా అప్ సెట్ చేస్తున్నాయి .... మాకు తెలిసి ఆయన ఇటువంటి పని యెన్నడూ చేయలేదు. ఆయన హై మోరల్స్, నీట్ క్యారెక్టర్ అందరినీ చాలా ఇంప్రెస్ చేస్తుంటాయి....కానీ నిన్న జరిగిందానికి.... ఆయన ఇక్కడెవరో స్త్రీని కలుసుకోవడాన్ని ....నమ్మలేకపోతున్నాం.

ఆయన బుద్ధిపూర్వకంగా చేసివుండరు. ఆయన బుద్ధిని ఎవరో మళ్ళించి వుంటారని నా అనుమానం. ఆఫ్టరాల్, ఆయన మగవాడు. పైగా మొహమాటస్థులు. ఎవరైనా ఆయన్ని బలవంతంగా ఆకర్షించి లొంగదీసుకోవచ్చు.... తనకుతానుగా ఆయన సాహసించలేరు. అందుకే ఇలా లొంగిపోయి ఈ పని చేశారు....కానీ పరిణామం ఆలోచించలేదు. ఆయన బ్రతికివుంటే ఆ పరిణామాన్ని ఎదుర్కోలేకపోయేవారని నా నమ్మకం...."

"ఏ పరిణామం అని మీ ఉద్దేశ్యం?"

"బ్లాక్ మెయిల్" అన్నాను వివరిస్తూ, "అందుకోసం తప్ప మరిదేనికీ ఆయన్నిలా లొంగదీసుకునే కారణం

కన్పించటంలేదు. బిజినెస్‌లో ఆయన చాలా కాంపి టీషన్‌ని యెదుర్కోవలసివచ్చేది.... ఆయన్ని దెబ్బతీయ డానికి యెవరైనా ఇలా ప్రయత్నించవచ్చు. లేకపోతే బిజినెస్‌కి సంబంధించిన ప్రైవేట్ వ్యవహారం కావచ్చు. యెవరో బ్రతకనేర్చిన జాణ వలపన్ని డబ్బుకోసం బ్లాక్ మెయిల్‌కి పూనుకోవచ్చు...."

"బ్లాక్ మెయిలా? అదెలా చేస్తారు?"

"నాలుగు ఫోటోలు తీస్తే చాలు."

"ఓహ్, ఇంట్రెస్టింగ్‌గా వుంది."

"ఇలాటివి జరుగుతాయి. మీరు మిస్టరీస్ చదవరను కుంటాను ___"

"చదవను. సామాజిక స్పృహ లేని సాహిత్యం సాహిత్యంకాదు."

"అయితే మీ తెలివి పెరగదు. ఇంతకూ నే చెప్పొచ్చే దేమిటంటే, డియర్ మేడెజర్, ఆమె గనుక అలాటి ఫోటోలు తీసివుంటే ఎకాంప్లీస్ సహాయంతో, వాటివల్ల మా బాస్ పరువు మర్యాదలకి మోసం వుంది. ఇప్పు డాయన లేకపోవచ్చు. కానీ ఆయన పత్నికి పంపి బెది రించే అవకాశం వుంది. ఏ పత్నీ తన పతి దుష్ప్రవర్తనని బయటపడనివ్వదు, ఏమంటారు? ఆమెకలాటి ఇబ్బంది ఏర్పడకూడదనే దృష్టితో, ముందు జాగ్రత్తకోసం ఆ యువతి జాడ తెలుసుకోవడం మంచిదనుకున్నాను .... దీనికి మీ తోడ్పాటు చాలా ముఖ్యం. అంతే!"

"ఆల్‌రైట్, అయితే ఏమిటో చెప్పండి."

నిట్టూర్చాను తేలికగా. అనుమానాలు కలక్కుండా ఇతను కన్విన్స్ అవడానికే ఈ వాగుడంతా కావల్సి వచ్చింది. ఇప్పుడు నా ఈ ఎంక్వయిరీ పోలీసులకు తెలిస్తే

వాళ్ళు నన్నేం అపార్థం జేసుకోరు. యెంత విశ్వాస పాత్రుడైన సెక్రటరీ అనుకుంటారు. నేనీ ముసుగును ఇలాగే వుంచి కొనసాగాలి.

అతన్ని చూస్తూ అన్నాను. "నేను ఫోన్ కాల్స్ గురించి తెలుసుకోవాలి, మేనేజర్, ఆయన గదికి ఎన్ని కాల్స్ వచ్చాయో, యెన్ని వెళ్ళాయో వాటి వివరం కావాలి."

"కానీ..దీన్ని పోలీసులు చూస్తున్నారనుకుంటాను?"

"లేదు, వాళ్ళకు సంబంధించినంతవరకు కేసు ముగిసి నట్లే. ఇప్పుడే దర్యాప్తూ లేదు. ఈ యువతి గురించి నాకొచ్చిన అనుమానం. ఆమె ఉద్దేశ్యం కచ్చితంగా నాకు తెలియదు. అందుకని పోలీసులకి చెప్పలేదు. తెలిస్తే అప్పుడు చెప్పవలసి వుంటుందేమో...."

అతను తలపంకించి, ప్రక్కనున్న క్లర్క్‌కి రెండు నిమిషాలు ఏదో వివరించాడు.

క్లర్క్ లేచి బయటికి వెళ్ళిపోయాడు.

"ఆపరేటర్‌ని కనుక్కొని వస్తాడు.... మిస్ రీనా మొన్న రాత్రి డ్యూటీలో వుంది" అన్నాడు మేనేజర్ నాతో.

థాంక్స్ చెప్పాను. అప్పుడు నా మనసును ఏదో దొలచసాగింది....మరణ సమయం. పోస్ట్ మార్టమ్ ఏమైందో నాకంతవరకు తెలియదు. ఇన్‌స్పెక్టర్స్ మళ్ళీ రాలేను. అందులో వాళ్ళకి అనుమానాలు రాలేదా? ఎందుకు రావు? రావ్ పదకొండుగంటల ప్రాంతాల మరణిస్తే శవం నాలుగు గంటలకి కనుగొనబడింది. ఈ మధ్యన నాలుగైదు గంటలు అక్కడ అలా బహిరంగంగా ఎలా పడివుందని వాళ్ళనుమానించటం లేదా?

ఆ రాత్రి హోటల్ ప్రాంతాల ట్రాఫిక్ పూర్తిగా తగ్గి, నిర్మానుష్యం అయ్యేదాకా నే నాగవల్లి వచ్చింది. అంతసేపూ కారుని దగ్గర్లోని చిన్న గల్లీలో నిలిపి ఉంచాను. ఈలోగా హోటల్ కెళ్ళి రావ్ గదిలో పని పూర్తిచేశాను. ఇంటినుంచి తెచ్చుకున్న రెయిన్ కోటూ, క్యాపుతో నన్ను బాగా మరుగుపరచుకున్నాను. రిసెప్షనిస్టు అడిగినప్పుడు గంభీర స్వరంతో కీరింగ్ టాగ్ ని తలక్రిందులుగా తిప్పి పట్టుకుని చూపిస్తూ, "రూం 98!" అన్నాను.

అతను నిద్రకళ్ళతో కీబోర్డువంక చూసి, పొమ్మని చెయ్యి ఊపాడు. నేను వేగంగా 98లో పని ముగించుకుని, అప్పుడే వచ్చిన కస్టమర్స్ తో బిజీగా వున్న అతడిముందు నుంచి కంటపడకుండా వచ్చేశాను.

అప్పుడు బయట నాకనుకూల వాతావరణం ఏర్పడే టప్పటికి మూడుగంటలై పోయింది. కారులోంచి శవాన్ని ఫుట్ పాత్ మీద ప్లాంట్ చేసి, ఆధారాలు సృష్టించి తృప్తిగా తిరుగుముఖం పట్టాను.

అది కాదు సమస్య—

మరణ సమయం తప్ప ఇతర అన్ని విషయాల్లో జాగ్రత్త తీసుకున్నాను. మరణ సమయంతో ఛాన్సు తీసుకోక తప్పలేదు. దాన్ని టాంపరింగ్ చేయటం సాధ్యంకాదు. అంతా పోలీస్ లాజిక్, వాళ్ళ శ్రద్ధను వదిలేశాను. వాళ్ళా యాక్సిడెంట్ ని బాగా నమ్ముతూంటే, మరణ సమయం ముఖ్యం కాదనుకుంటే, అంతా బాగానే వుంటుంది. అలాగాక పదకొండు ప్రాంతాల ఆ సంఘటన జరిగితే, అప్పుడంత రద్దీగావుండే ఆ ప్రాంతంలో ఎవరూ యెందుకు చూడలేకపోయారని కుతూహలం కలిగి బయ

దేరారంటే .... నాకు సమస్యలేర్పడుతాయి. అప్పుడు వాళ్ళనెలా కన్విన్స్ చేయాలి?

తీవ్రంగా ఆలోచిస్తోంటే వెళ్ళిన క్లర్క్ తిరిగి వచ్చాడు.

ఆతృతగా చూశాను.

అతడన్నాడు. "రూం 98 నుంచి మిస్టర్ రావ్ ఆ రోజంతా యెవరికీ ఫోన్ చేయలేదు. మొన్నంతా ఒకే ఒక్క కాల్ బయటనుంచి వచ్చింది."

"ఏ సమయంలో."

"రాత్రి పదింపావుకి."

"యెక్కడ్నించి వచ్చింది?"

"తెలియదు. కానీ ఆ మాట్లాడిన వ్యక్తి గొంతు చిత్రంగా ఉండడంవల్ల బాగా గుర్తుండిపోయిందట ఆపరేటర్ కి...."

"యెలావుందా గొంతు?" అడిగాను ఆతృతని అణచుకుంటూ.

"పిట్ట అరిచినట్టు కీచుగా వుంది...."

ఉలిక్కిపడ్డాను. జుట్టుపోలిగాడు! వాడి గొంతే అది!

వాడే రావ్ కి ఫోన్ చేసి రప్పించాడన్నమాట మా మధ్యకు!

నేనూహించిన కుట్ర నిజమని రుజువై పోయిందిప్పుడు!

వాళ్ళకి 'థాంక్స్' చెప్పి వేగంగా బయల్దేరాను అక్కడ్నుంచి.

9

ఈమేనా నే నెరిగిన సరోజని యెవరంటారు?

ఈమేనా యెప్పటి మనిషిలా లేదు. పోల్చుకోలేక పోతున్నాను. మొన్నటికీ ఇవ్వాల్టికీ యెంత తేడా! ఇది

నటన అనుకోవాలో, నిజంగానే భర్త చావు అంతగా కుంగదీసిందో తేల్చుకోలేకపోతున్నాను. నటన అయితే అది లోకానికి అవసరమన్న దృష్టి ఆమెకుండటం అవసరమే, ఒప్పుకుంటాను. కానీ నాముందు నటించనవసరం లేదే? నిజంగానే ఇంత బాధ పడిపోతూంటే ఈమె అంతరంగమేమిటో చాలా విచిత్రమైనదిగా వుండాలి! ఇప్పుడీమె గురించి లోతుగా ఆలోచించాలంటే నే భయంగా వుంది.

ఈమెనా నా శత్రువు?

ఈమెనా నాకీ పరిస్థితులు కల్పించింది? ఈమె ప్రయోజనాలకేనా నేను పావుగా ఉపయోగపడ్డది? నేనింత గుడ్డివాణ్ణా మోసపోవడానికి? నాకు మించిన తెలివితేటలున్నాయా ఈమెకి?

లేదు, ఇప్పుడు నన్ను గురించి విచారించి లాభం లేదు. నడుం కట్టాలి. ఇక యెదురు దెబ్బ తీయాలి!

"సురేష్, నువ్వేం చేస్తున్నావో యెక్కడున్నావో తెలియదు.... నిన్నట్నుంచీ కన్పించలేదు...." అందామె నన్ను ఆందోళనగా చూస్తూ.

"నో! నేనేం చేశానో, చేస్తున్నానో ఈమెకు బాగా తెలుసు! నంగనాచి! ఈమె నియమించిన రోగ్స్ అనుక్షణం నన్ను కనిపెడుతూ తెలుసుకుంటూనే ఉన్నారు. ఈమె ప్రతి చర్య తీసుకుంటూనే వుంది. నేనేం చేయబోతున్నానో, నా ఆలోచనలేమిటో ఇప్పుడీమెకు చెప్పబోవటంలేదు!

ఇదే మాట ఆమెకు చెప్పాను.

ఆమె చూసింది గాభరాగా. "యెందుకు? యెందుకు చెప్పలేవు? నేన్నీకు తోడ్పడాలనుకుంటున్నాను...."

"తోడ్పడాలనుకుంటున్నావా? అయితే యెవడో కోగ ఉదయం ఫోన్ చేసి బెదిరించాడు నన్ను.... వాడెవడో చెప్పగలవా?"

ఆమె చిన్నగా ఉలికిపడింది తెల్లబోతూ, కళ్ళలో ఏదీ దాచుకోవాలన్న విశ్వప్రయత్నాన్ని పసిగట్టలేక పోయాను. అలా వున్నాయి కళ్ళు. వాటినిండా భయం. ఈమె నటనా కౌశలానికి అభినందించాలా!

"యెవరు సురేష్? యెందుకు బెదిరించాడు?"

నవ్వాను. "లోకంలో యెవరైనా యెందుకు బెదిరిస్తారు? తమకేదో మూడుతుందని, లేకపోతే తామేదో మూటగట్టుకోవాలని. వాళ్ళకీ రెండిటి విచారముంది. అందుకే రాత్రి నామీద దాడి జరిపారు. ఒకర్ని చంపారు. నా ప్రయత్నాలు మానకపోతే ఆ ఫోటోలు పోలీసులకి పోతాయని ఉదయం బెదిరించాడు...."

ఆమె అవాక్కయిపోయింది. "ఎవరది? ఇంకెవరున్నారిందులో? నీమీద యెందుకు దాడిచేశారు? యెవర్ని చంపారు?

"నామీద యెవరు దాడిచేశారో, యెవర్ని చంపారో చెప్పి నిన్ను అప్ సెట్ చేయలేను. కానీ ఇందులో నీ తమ్ముడొక్కడే కాదు, మరిద్దరున్నారని తెలుసుకో. వాళ్ళు కంట్రోల్ చేస్తున్నారు. ఇప్పుడు అయిదు లక్షలు కావాలి వాళ్ళకు."

ఆమె కళ్ళు పెద్దవిగా చేసింది ఆశ్చర్యంతో. "అయిదు లక్షలా! యెందుకు, రెండు లక్షలే కదా...."

"కాదు. వాళ్ళకిప్పుడు ఇంకో పెద్ద పట్టు చిక్కింది. దిగిరారు."

"ఇంకేమిటి చిక్కింది!" అర్చిందామె అయోమ

యంగా.

అచ్చా, ఈమె నటనా సామర్థ్యాని కిప్పుడు పరీక్ష పెడతాను.

జేబులోంచి ఆ ఫోటోలు తీశాను నెమ్మదిగా....

అవి మడతపడి, నలిగి వున్నాయి. ఆమెని జాగ్రత్తగా గమనిస్తూ వాటిని వళ్ళోకి విసిరాను. ఆమె రియాక్షన్ కోసం వళ్ళంతా కళ్ళు చేసుకున్నాను.

వాటిని చూసిందామె. చూసి కళ్ళు విశాలంగా చేసింది, అవి చిన్నగా ఉలిక్కిపడ్డాయి. ముఖమంతా యెలాగో అయిపోయింది.... వాటిని పడేస్తూ గబుక్కున దగ్గరికి జరిగి నన్ను చుట్టేసింది చేతులతో, నా భుజం వెనుక ముఖాన్ని దాచేసుకుంటూ—తన భావాలు మోస పుచ్చుకుండా! గుడ్ ట్రిక్! ఇది నేనూహించలేదు. ఆమె ముఖం, వళ్ళు చల్లగా తాకుతున్నాయి. చేతులు సన్నగా కంపిస్తున్నాయి....అవి నన్నింకా చుట్టివేస్తున్నాయి.

అలా కొన్ని క్షణాలు ఉండిపోయింది.

తర్వాత, "ఓహ్, సురేష్! భరించలేను...." అని అస్పష్టంగా మాత్రం గొణిగింది.

"వదులు!" అన్నాను విడిపించుకుంటూ, "మనం హాలులో వున్నాం, ముసలి రాజయ్య ఇటు రాగలడు.."

ఆమె వదిలేసి అలాగే దూరంగా జరిగింది సోఫాలో. అప్పుడామె కళ్ళలో నిస్సహాయత, ముఖంలో బేలతనం చూస్తే చక్కని అభినేత్రి అనిపించింది.... ఈమె ముందు ఏం పనికొస్తుంది వాణిశ్రీ? పరీక్ష నెగ్గింది. పుణ్యస్త్రీ కదూ?

ఆ ఫోటోలుతీసి నా జేబులో పెట్టుకున్నాను.

"యెలా ఇప్పుడు....ఎలా తీశాడు వాడా ఫోటోలు?"

"వాడి తెలివి వాడిది....నిన్ను డబుల్ క్రాస్ చేశాడు."

ఆమె ఏమాత్రం కంగారుపడలేదు, "డబుల్ క్రాస్ చేశాడా?" అంది అలాటిది తానేమీ యెరగనట్లు మామూలుగా.

ఇహ ఈమెను చీట్ చేయటం సాధ్యంకాదని తెలిసి పోయింది.

"అవును. వాడు ముందు వేరే ఫోటోలతో వచ్చి రెండు లక్షలు కావాలన్నాడు. ఇప్పుడీ ఫోటోలతో అయిదు లక్షలంటున్నాడు..నిన్ను డబుల్ క్రాస్ చేయడం కాదా?"

"ఓహ్, ఇచ్చేద్దాం! వాడి మొహాన పారేద్దాం! మనం క్షేమంగా వుంటే చాలు! అయిదు లక్షలో లెక్కకాదు, మన శ్రేయస్సుకంటే!"

ఆమె ఉద్రేకంగా అంటున్న ఈ మాటలు విని ఉలిక్కిపడ్డాను. జుట్టుపోలిగాడి మాటలు గుర్తొచ్చాయి రవ్వూఫ్ కేఫ్‌లో. ఈమె అంత సులభంగా డబ్బివ్వదను కున్నాడు వాడు. చాలా ఒప్పించాలనుకున్నాడు. అలాగే నేనూ అనుకున్నాను. నా ఖర్మకొద్దీ యెలాగో ఒప్పించి వాడికా డబ్బింప్పించాక, ఇహ నన్ను దరిచేరనివ్వదను కున్నాను. కానీ ఇప్పుడు తనే డబ్బిచ్చేద్దామని అంటోంటే నాకర్థంగాలేదు, ఏమిటీ మార్పు? ఏదైనా అంతరార్థ ముందా? అయిదు లక్షల్ని అంత తేలిగ్గా వదులుకుం టుందా?

అప్పుడు నా మెదడులో ఏదో మెరిసింది.

"ఏమిటది? .... అసలా జుట్టుపోలిగాడు బ్రతికే వున్నాడా అని! లేక తాళంవేసిన వాడింట్లో చచ్చి

పడున్నాడా? ఆ వేళ వాడా రెండు లక్షలకోసం వచ్చి నప్పుడే, వాడి బ్లాక్ మెయిల్ టెండెన్సీని పసిగట్టి, ముందు ముందు కూడా ఈ ప్రమాదం వుంటుందని, ఈమె వాడి నోరు శాశ్వతంగా నొక్కేయించిందా తన రౌడీస్ కి పురమాయించి?

అందుకే తమ్ముడితో కలిసి తను కుట్రపన్నినట్లు తెలిపే సాక్ష్యం ఆ టేప్ రికార్డింగ్ ని నా దగ్గర లేకుండా చేసి, రాణిని చంపించింది? ఇదేనా రాణి హత్యకు మోటివ్?

అందుకేనా డబ్బు గురించి ఇంత తేలిగ్గా మాట్లాడు తోంది?

ఓహ్, అయితే యిప్పుడు నన్నెందుకు పిలిచినట్టు? అసలు నాకు నేనుగా వస్తే తప్ప తను పిలవదనుకున్నాను. అలా నేను వెళ్ళే పేళనగా నన్ను గేటు చూపిస్తుందను కున్నాను. తనకేమిటి ఇప్పుడు నా అవసరం? తను ఛీ కొడితే నేను చేసేదేముంది, వెర్రి మొహం వేసుకుని పోవడం తప్ప?

అయితే ఇప్పుడెందుకు పిల్చిందో తనే పిల్చింది. అంటే ఆ పని అప్పుడే చేయదు, నాతో చేయించుకు నే పనులు ఇంకేవో మిగిలివున్నట్టున్నాయి. అవయ్యాకే చూపిస్తుంది గేటు! అంతవరకు ఇలాగే జాగ్రత్తగా వ్యవహరిస్తుంది, రంగు బయటపడకుండా!

"సురేష్! నాకెందుకో ఏదో భయంగా వుంది...." అని ఆమె చటుక్కున నన్ను పరీక్షగా గమనించడం మొదలుపెట్టింది. "ఏమిటది? యెందుకలా వున్నావ్? సురేష్! యెందుకలా నన్ను కొత్తగా చూస్తావ్.... ఇదంతా నావల్లే జరిగిందని కోపమా?"

"నీవల్ల ఏం జరిగింది? నేనే పొరపాటు చేశాను...."

"ఓహ్, విచారించకు ఇప్పుడు! డబ్బు గురించి ఆలోచించకు! వెధవ డబ్బు, ఎంత కావాలన్నా ఇస్తాను! వాళ్ళ నోళ్ళు మూయించు—"

"ఇంకా?"

"ఓహ్, అసలు నీకు ఇంకో పని — విషయం చెప్పడానికే పిల్చాను."

"అదే.... చెప్పు, ఏమిటది?"

"అతను ఉదయమే వచ్చాడు, ఏడుగంటలకి...."

"ఎవరు?"

ఆమె కణతలు నొక్కుకుంటూ చెప్పింది. "ఇన్‌స్పెక్టర్."

10

ముసలి రాజయ్య.

అతను చేతులు తుడుచుకుంటూ హాల్లోకొచ్చి, మమ్మల్ని చూసి ఆగిపోయి, తిరిగి తల వంచుకుని సాగిపోయాడు విచారవదనంతో.

యజమాని చావు మా అందరికంటే అతన్నే ఎక్కువ బాధిస్తున్నట్లులా వుంది. అవును మరి, యజమానితో అతడికున్న అనుబంధంతో పోల్చుకుంటే మేమెంత? చెడ్డవాడో, క్రూరుడో, ముఫ్పై ఏళ్ళుగా కనిపెట్టుకుని వున్నాడు విశ్వాసంగల జాగిలంలా. మరి మేము? మా గురించి యెంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది.

తేరుకుంటూ ఆమెను చూశాను. "ఇన్‌స్పెక్టర్ వచ్చాడా? ఏ ఇన్‌స్పెక్టర్?"

ఈ ప్రశ్న అడుగుతున్నప్పుడు నేను కేవలం మానవ రూపంలో వున్న యంత్రాన్ని. రోబాట్‌ని. సర్వేంద్రి

యాలూ వాటి స్పందన మేరకు స్తంభించిపోయాయి. మాటలు యాంత్రికంగా వస్తున్నాయి...."

"ఇన్‌స్పెక్టర్ శివశేశన్" చెప్పిందామె.

"యెందుకు? ఏమన్నాడు వచ్చి?"

"పోస్టుమార్టమ్‌లో ఏదో చిక్కు ఏర్పడిందట.... వాళ్ళు ముందు అనుకున్నట్లు చావు నాలుగు గంటలకు జరగలేదట. అంతకు చాలాముందే, అర్ధరాత్రి ప్రాంతాలే ప్రాణాలు పోయాయట! ఇది నిజమే కదూ? కానీ నేనేం చెప్పలేదు. అతను చెప్పిందే విన్నాను..."

"చెప్పు! ఇంకేమన్నాడు?"

"ఆయన యెప్పుడు చనిపోయినా చనిపోయినట్టుకిందే లెక్క, ఇక యెలా చనిపోయారో తామూహించినదానికి పోస్టుమార్టమ్‌లో భిన్నంగా లేదన్నాడు. మరణ సమయం ఒక్కటే తేడా వచ్చిందట. ఆ గాయం స్తంభంవల్లనే అయిందట, సురేష్. దాన్ని యాక్సిడెంట్‌గా తప్ప మరోలా అనుమానించలేమంటున్నాడు పోస్టుమార్టమ్ లోనూ, సర్కమ్‌స్టేన్షియల్‌గానూ!

శవం పైన వస్తువులు యధాతథంగా వున్నాయి. బహుశా ఆ స్తంభం మీద లైటు వెలగకపోవడం వల్లనే అన్ని గంటలు శవం యెవరికంటా బడలేదేమో అన్నాడు. ఆ చూసిన ఆటో డ్రైవర్ కూడా నిజాయితీపరుడు కావడంవల్ల శవాన్ని తాకకుండా తిన్నగా పోలీసులకి ఫోన్ చేశాడట. అదే మరెవరైనా నీచబుద్ధి గలవాడైతే శవంమీద వస్తువులన్నీ దోచుకుని తనదారిన పోవడమో, లేకపోతే ఉడుతా భక్తిగా ఓ ఫోన్ కొట్టి పోవడమో చేసేవాడట! అప్పుడది యాక్సిడెంటా లేక

దారి ప్రోపిడీయా కచ్చితంగా తెలిసేది కాదన్నాడు...."

నేను మాట్లాడలేదు. చెవులు రిక్కించి వింటున్నాను.

"అంతే, సురేష్. అర్ధరాత్రి సమయంలోనే ఆ సంఘటన జరిగిందన్నాడు ఇన్స్పెక్టర్. అప్పుడే ఆయనా స్త్రీని బయట ఆటోలోనో, టాక్సీలోనో యెక్కించి పంపించేస్తూ యాక్సిడెంట్ పాలయ్యాడన్నాడు. కానీ నాలుగైదు గంటలవరకూ శవం యెవరికంటా పడకుండా వుండటం కొంచెం వింతగా వున్నా, వింతలెందుకు సాధ్యం కావూ అన్నాడు. మోటివ్ ఏదీ లేనప్పుడు, చావుకు కారణం స్పష్టంగా తెలుస్తున్నప్పుడు, మరణ సమయం ఒక్కదాన్ని పట్టుకుని తర్కించుకుంటూపోతే అర్ధంపర్ధంలేని అనుమానాలు చాలా వస్తాయన్నాడు. ఏమిటి ప్రయోజనం?"

నేనామె ముఖంలోకి ఆశగా చూశాను.

"అందుకని అంతసేపూ యెవరూ చూడకపోవడమనే అనవసర ప్రశ్నని లెక్కలోకి తీసుకోకుండా, దాన్ని యాక్సిడెంట్‌గానే నిర్ణయించి ఫైలు మూసేస్తానన్నాడు. నాకేవైనా అభ్యంతరాలూ, అనుమానాలూ వుంటే చెప్పమన్నాడు. చెప్పడానికింకేముంది? ఒక పరాయి స్త్రీతో ముడిపడివున్న ఈ వ్యవహారం యెంత తొందరగా ముగిస్తే అంతమంచిదన్నాను. అతను అర్ధం చేసుకుని అలాగే చేస్తానన్నాడు. అయితే మున్ముందు ఏమైనా కాంప్లికేషన్స్ ఏర్పడితే మళ్ళీ దర్యాప్తు గురించి ఆలోచించవల్సి వుంటుందన్నాడు.... కానీ కాంప్లికేషన్స్ ఏమున్నాయి, సురేష్? ఏమీ ఏర్పడవుకదూ..?"

అప్పుడు నేను తేరుకుని ఉద్రేకపడ్డాను. అంతవరకూ అణచుకున్న ఉత్సుకతతో లేచి గంతులేయాలనిపించింది!

ఇంకొక్కడి కాంప్లికేషన్స్! ఇదొక్కటే నేను భయపడ్డ కాంప్లికేషన్! ఈ గండమూ గడిచింది!'' ఆరాటాన్ని అణచుకోలేక ఆమెను లేపి గిరగిరా తిప్పేస్తూ ఉక్కిరి బిక్కిరి చేసేయాలనుకున్నాను. ఇలాంటి ఘట్టంలో ఓ ఆడమనసు అవసరం ఆనందాన్ని పంచుకోడానికి. మేం ఇప్పుడున్న స్థానాల్లో లేకపోతే అంతపనీ చేసేవాడ్ని. ఈ ఆడది నాకు తగలేదు. కలిసిరాలేదు.

"మంచి సంగతి చెప్పావు, సరోజా. థాంక్స్. ఇప్పుడు నా కెంతో రిలీఫ్ గా వుంది! కానీ—నువ్వసలు ముందు చెప్పబోయింది ఇదికాదు—అవునా? ఉదయం నాకు ఫోన్ చేసిందీ యిందుకు కాదు—ఏమిటి? ఇందాక నువ్వేదో పని—అని చెప్పబోతూ మనసు మార్చుకున్న ట్లున్నావు?"

ఆమె కళ్ళు చిటపటలాడిస్తూ చూసింది.

"అవును, సురేష్....నిన్ను మరొకందుకే పిల్చాను. ఇంత చేసినవాడివి నువ్వీపని చేయకపోతే ప్రమాదం....ఇది నాకెలా తట్టిందో-ఉదయం నేనాలోచిస్తూంటే మొన్న మనం చేసినదాంట్లో లొసుగులేమన్నా వున్నాయేమో నని-అనుకోకుండా ఇది తట్టింది...."

"ఏమిటది?"

"ఇది నీకూ తట్టిందనుకోను — అది, ఆడి—రాత్రి ఆయన యింటికి వచ్చినప్పుడు ఎలా వచ్చాడూ అని!"

నేనామె ముఖం చూస్తూండిపోయాను. ఏమిటీమె మాటలకరం?....అదిరిపడ్డాను! ఓ మై గాడ్! ఇది నాకు తట్టనేలేదు! యెంత పెద్ద పొరపాటు!

రావ్ యింటికెలా వచ్చాడు మొన్నరాత్రి హోటల్ నుంచి? టాక్సీలోనా? ఆటోలోనా? ఇప్పుడా డ్రైవర్

నా బాస్ మరణవార్తతో సహా ఫోటో, జీవిత వివరాలూ చూసి పోలీసులవద్దకి పరుగుపెడితే నా గతేం కాను!

"అర్థమైందా, సురేష్?" అందామె ఆందోళనగా చూస్తూ "ఆయన ఆటో ఎక్కడు, టాక్సీలోనే వచ్చి ఉంటాడు. ఆ టాక్సీవాడ్ని మనం పట్టుకోవాలి!"

"ఎందుకు?" అన్నాను తేరుకుంటూ.

"ఓహ్, వాడు మన పక్కలో టైం బాంబులా వుంటాడు! యెప్పుడు పేలుతాడో, అసలు పేలుతాడో లేదో తెలియదు! అదేదో తెలుసుకుంటే మన ప్రాణాలకు హాయి కదూ, ఇలా భయపడుతూ కూర్చునేకంటే?"

"అవును.... అవునవును.... పేలుతాడని తెలిస్తే?"

"చంపెయ్యడం మంచిది. ఒకర్ని చంపావు, మరొకడ్ని చంపలేవా?"

ఉలిక్కిపడి ఆమెని చూశాను. ఎంత తేలికగా అనేసిందీమాటలు..ఆవేశంతో పళ్ళు కొరికాను. అర్థమైంది... అర్థమైంది, దొంగలరాణీ! నీ తొత్తులకి ఇది చాలదు. ఆ డ్రైవర్ని గాలించి పట్టుకోవడం నా తెలివితేటలతో, నాతోనే సాధ్యపడుతుందనుకుంటున్నావు. వాడ్ని చంపే అవసరం, అగత్యమూ నాకే వున్నాయనుకుంటున్నావు. సరే,సరే, దొంగలరాణీ, నీకు నా క్షేమంకాదు ముఖ్యం. నావల్ల నీ యోగక్షేమాలకెక్కడ ముప్పు వస్తుందోనని నాకీ సలహా పారేసి పరోక్షంగా నిన్ను రక్షించుకుంటున్నావు. నేను దొరికిపోతే మనిద్దరి రంకు బయటపడుతుందని కాబోలు నీ జంకు.

ఆవేశం అణచుకుంటూ, "వాడ్ని పట్టుకునే ప్రయత్నం చేస్తాను" అన్నాను.

ఆమె తేలికపడింది. "ప్రమాదమనుకుంటే ప్రాణం

తీయడానికి వెనుకాడకు!"

"ఇహ ఇప్పుడు దేనికీ వెనుకాడను!"

"రాత్రి యెవర్నో హత్యచేశారన్నావు, ఎవర్ని?"

చాలా అమాయకంగా ఈ ప్రశ్న అడిగిన ఆమె ముఖంలోకి పాలోచనగా చూశాను. ఓహ్, నన్నెలా టాకిల్ చేయాలో ఈమెకు బాగా తెలుసు! నేను చెప్పే మాటలకి అతి జాగ్రత్తగా ట్రాక్ వుంచుకుంటోంది.... అనుమానాలు వేరే కలక్కుండా వాటిని అడిగేస్తోంది...

నేనన్నాను తీక్షణంగా, ఏవగింపుగా చూస్తూ. "నీ గతంలాంటిదే ఆమె వర్తమానం కూడా! నీ వెధవ తమ్ముడికోసమే తను బలియై వాడ్ని బ్రతికిస్తూ వెన్నుపోటు తింది, చాలా?"

ఆమె బిత్తరపోయి చూస్తూంటే నేను లేచి గబగబా వచ్చేశాను. ఎవరితో దాగుడుమూతలాడాలనుకుంటోందీ దొంగలరాణి?

బయట ముసలిరాజయ్య యెదురై కన్నీరు కార్చాడు.

"నేను సూడలేను, బాబయ్యా! అయమ్మగోర్నిలా సూడలేను!"

"నన్నేం చేయమంటావు?"

"ఏంసేయగలం బాబయ్యా, దేముడు దయలేనోడు!"

"నువ్వు బాధపడకు తాతా, నువ్వే ఆమెకు ధైర్యం చెప్పాలి."

"నాకంత శక్తి యెక్కడిది, బాబయ్యా?"

"వుంది తాతా, నువ్వే ఆమెకు ధైర్యం చెప్పాలి..."

నేను చటుక్కున అక్కడ్నుంచి కదిలాను. అతన్ని 'తాతా' అని పిలిచేందుకు నేనిప్పుడు తగనన్పించింది.... నేనేంచేశానో తెలిస్తే ఎంత ఏవగించుకుంటాడీ ముసలి

తాత! పెద్ద వయసులో ఒకరి మనసు కష్టపెట్టే ఖర్మ నాకెందుకు పట్టించావు భగవాన్!

ఇంతకంటే చచ్చిపోవడం మేలు!

11

హోటల్ మౌర్య ఇంటర్నేషనల్ ముందు ఆటో దిగి చుట్టూ చూశాను.

నాకెక్కడా ఆ పరిసరాల్లో టాక్సీ స్టాండ్ కన్పించ లేదు. ఈ చివరనుంచీ ఆ చివరదాకా ఎక్కడా లేదు. బహుశ ఏ రన్నింగ్ టాక్సీలోనో ఎక్కివుంటాడు రావ్. ఎలా దాన్ని కనుక్కోవడం?

ఎదురుగా క్యాంటీన్‌లో వెళ్ళి కూర్చుని, ఒక స్ట్రాంగ్ టీకి ఆర్డరిచ్చి, లెక్క వేసుకున్నాను.... వెల్, యుగంధర్ - మొట్టమొదటి నా అభిమాన డిటెక్టివ్ పాత్ర—పుట్టిన నాలుగేళ్ళకు నేను పుట్టివుంటాను. మామూలు సెక్రటరీని బిజినెస్ తప్ప మరో వ్యాపకం తెలియనివాడ్ని, ఇప్పుడు యుగంధర్‌లా ఆలోచించాల్సిన పరిసితి నాకేర్పడింది. నేను యుగంధర్‌లా ఆలోచించి సక్సెస్ కాలేనా? చూద్దాం....

టీ తాగుతూ, ఒక సిగరెట్ కూడా వెల్గించుకుని, సీరియస్‌గా ఆలోచనల్లో పడ్డాను....ఆ టాక్సీ డ్రైవర్ కంటే జుట్టుపోలిగాడే డామినేట్ చేయసాగాడు ఆలోచనల్లో.

నిజంగా ఆ డ్రైవర్‌వల్ల ప్రమాదముందోలేదో దేవు డెరుగు! కానీ జుట్టుపోలిగాడివల్ల నిశ్చయంగా వుంది! వాడా ఫోటోల్ని సీలుచేసి ఫ్రెండ్‌కిచ్చానన్నాడు, తను చచ్చిన పక్షంలో పోలీసులకి పంపమని. అది నిజంగా చేశాడా? లేక బుకాయింపేనా? వాడి దృష్టితో కేసు

తీవ్రతనిబట్టి చూస్తే చేసివుంటాడనే అనిపిస్తోంది. వాడి జీవన్మరణ సమస్య అది. ఎందుకు రిస్క్ తీసుకుంటాడు?

కాబట్టి ఇప్పుడు ప్రశ్నేమిటంటే—వాడిప్పుడు సజీవంగా వున్నాడా లేదా అనేది. వుంటే నన్నెందుకు కలుసుకోలేదింతవరకూ? రాత్రి నా దగ్గర యెవిడెన్స్ దోచుకుని, రాణీని హత్యచేస్తే, ఆ వెంటనే వచ్చి బెదిరించాలి కదూ—వ్యవహారాన్ని తానెంత సీరియస్‌గా తీసుకుంటున్నాడో శాంపిల్ చూడమని! తన కంత్రీల్ని నాకు పరిచయంచేసి ఇంకా భయపెట్టించాలికదా? అసలు డబ్బు గురించి మా ఆలోచన ఏమైందో తెలుసుకుందుకైనా రావాలి కదూ?

అందువల్ల, ఇలా ఇవేమీ జరుగకపోవడాన్నిబట్టి చూస్తే — ఆ రోగ్స్‌తోగానీ, రాణి హత్యతోగానీ వీడికేం సంబంధం లేదనిపిస్తోంది. ఆ పార్టీ వేరు, వీడు వేరు. కాబట్టి ఆ పార్టీ చేతిలో వీడి చావుకి అవకాశం ఎంతైనా వుంది. అప్పుడే నాకు ప్రమాదముంది—ఒకవేళ నిజంగా ఆ ఫోటోలు పోలీసులకి చేరే ఏర్పాటు జరిగి వుంటే, అప్పుడు సరోజా వుంటుంది, నాతోపాటు జైలు గోడలమధ్య. ఆమెనెందుకు వదుల్తాను?

సరోజ తమ్ముడ్ని చంపించివుంటే, పప్పులో కాలేసింది! తన చావును తనే తెచ్చుకుంది!

నవ్వుకున్నాను కసిగా.

నా పరిస్థితి ఏమిటో ఇప్పుడు స్పష్టమైపోయింది—ఆమెమీద నాకే గెలుపుకు అవకాశాలున్నాయి!

ఒకటి—ఆ ఫోటోలవల్ల నేను జైలుపాలవుతే తనూ అవుతుంది.

రెండు-ఒకవేళ ఆ ఫోటోల ఏర్పాటు బూటకమైతే,

మరే రూపంగానూ నాకు ప్రమాదం లేకపోతే, తనకూ వుండను కాబట్టి, ఆ ధైర్యంతో ఆమె నన్ను ధీకొట్టి గెటు చూపించే అవకాశమే లేకుండా, నా దగ్గరా రంకు ఫోటోలున్నాయి!

ఇప్పుడు తేల్చుకోవల్సింది — ఈ పై రెండిట్లో ఏది జరగనున్నదో అనేది.

జుట్టుపోలిగాడి చావు తెలియనంత కాలం వాడి ఫ్రెండ్ దగ్గరా ఫోటోలు అలాగే వుంటాయి. వాడెవడో తెలుసుకుని నేను పట్టుకోగలిగితేనా.... వాడా పని చేయకుండా ఆపుతాను. అందుకవసరమైతే చంపుతాను. నేనెందుకు వెనుదీయాలిప్పుడు, నా భద్రతని గాలికొదిలేనూ? సరోజ ఏమంది? ఒకర్ని చంపావు, మరొకడ్ని చంపలేవా? వెల్, తప్పకుండా చంపుతాను. ఒక తప్పు చేశాక దాన్ని కప్పిపుచ్చడానికి ఎన్నో చేయాలి, తప్పదు.

ముందీ జుట్టుపోలిగాడి చావు నిర్ధారించుకోవాలి.

లేచి బిల్లు చెల్లించేసి గబగబా బయటకొచ్చి ఆటో యెక్కాను. ఇప్పుడా రోగ్స్ నన్ను వెంటాడుతున్నారనుకోను. నేను నాకు ప్రమాదాన్ని తొలగించుకునే ఎసైన్‌మెంట్ మీద వున్నాను—ఆ టాక్సీ డ్రైవర్ని పట్టుకోడానికి, అదీ సరోజ సూచనమీదనే, కాబట్టి నన్ను వెంటాడరు. నేను జుట్టుపోలిగాడింటికి పోతానని ఊహించరు.

12

ఆ వీధి నిర్మానుష్యంగా వుంది. వాడింటికి ఇంకా తాళం వేలాడుతూనే వుంది.

నన్నెవరూ గమనించటంలేదని నిశ్చయించుకుని,

కుడివైపు మూలాన్నుంచి పడుతున్న లైటు స్తంభం వెలుగుకి ముఖం ఇటు తిప్పుకుని తాళాల గుత్తితీసి చకచకా పని మొదలెట్టాను డిటెక్టివ్ వర్క్. ఆ పాత అలిగఢ్ తాళంకప్ప అల్చిప్పలా విచ్చుకుంటుంది, రాయి తీసుకుని ఓ దెబ్బకొడితే. కానీ అలాంటి పని దొంగలు చేస్తారు. దొంగలకూ నాకూ తేడా వుంది. అందుకని అయిదు నిమిషాలు కష్టపడ్డా, ఆ యింటి ఆసామీలా లోపలికి అడుగుపెట్టాను.

తలుపు మూసేశాను వెంటనే. లైటు వేయకుండా లైటర్ వెలిగించాను. ఆ వెలుగులో ఆ ముందు గదిని చూశాను. అక్కడేమీ లేదు. కూర్చునేందుకు చిన్న స్టూలు కూడా లేదు. ఖాలీ గదిలా నిరాడంబరంగా వుంది.

దాని వెనుక గదిలోకి వెళ్ళాను. అక్కడ సామానులున్నాయి. కింద పక్క పరచివుంది. అది చెదిరిలేదు. దుప్పటీ, దిండూ బాగా మాసివున్నాయి. పక్కనే నీళ్ళ కూజా, ఒక గ్లాసూ వున్నాయి. వాటి పక్కన చిన్న సూట్ కేసు.

నేను పక్కనీ, దిండునీ తనిఖీచేసి సూట్ కేస్ తెరిచాను. దానికి తాళంవేసిలేదు. లోపలబట్టలున్నాయి. రెండు సెక్సుపత్రికలూ, రెండు సినిమాతారల అర్ధనగ్న చిత్రాలతోపాటు ఒక బ్రాసిరీ వుంది. షాక్ తిని లేచిపోయాను.

గాడ్, ఎలాంటి కొంపలో వచ్చిపడ్డాను! అదెవరిది? ఆ వెధవ జీవితంలో ఈ మరో ఆడదెవరు? ఆమెకేమేం తెలుసు? ఇల్లు చూస్తే ఇంకా యెవరూ సోదా జరపనట్లు కన్పిస్తోంది, కానీ కేమేరా, ఫోటోలులాంటివి ఏవీలేవు. యెక్కడ దాచాడు వాటిని?....హఠాత్తుగా దుబ్బుమని

ఏదో శబ్దం! వెంటనే దగ్గరవుతున్న అడుగుల సవ్వడి! ఇంటి వెనుకభాగంలో చప్పుడు అవుతోంది! చటుక్కున లైటర్ నార్పేసి ఆ గది వెనుకవైపు తలుపు దగ్గరికి కదిలాను.

అడుగులు అక్కడే తలుపవతల తచ్చాడుతున్నాయి.

తలుపుకున్న సందులోంచి అవతల చూశాను. చీకటి. అంతలో తలుపు నానుకునే యెవరో నిలబడి వేగంగా ఊపిరితీసుకుంటున్న సవ్వడి!

నేను నిశ్శబ్దంగా పక్కకు జరిగి, గోడనానుకుని నిలబడ్డాను.

తలుపు లోపలినుంచి గడియ వేసి వుంది. గదిలో చిమ్మ చీకటి.

అప్పుడే ఏదో చప్పుడు కిరకిరమంటూ....

తలుపు సందులోంచి ఏదో వస్తోంది పొడుచుకొని..

దగ్గరికి జరిగి దాన్ని పరీక్షగా చూశాను. సన్నగా, అస్పష్టంగా ఏదో కనిపించింది. కడ్డీలాంటిది. పుల్ల— సైకిలు పుల్ల.

దాన్ని ఆసక్తిగా చూడసాగాను కదుల్తాం టే.

అది చాలా లోపలికి పొడుచుకొచ్చి, గడియను పైకి లేపుతోంది.

తలుపు తెరచుకోబోతోంది!

నేను గబుక్కున పక్కకు జరిగి మళ్ళీ గోడకానుకున్నాను. ఆయుధంకోసం జేబులు చూసుకున్నాను. పొరపాటు! ఒక కత్తి వుంచుకోవాల్సింది.

నేనాలోచిస్తూండగానే గడియ పూర్తిగా లేచి ప్రక్కకుపడింది.

తలుపులు ఒక్కసారి తెరచుకున్నాయి!

ఊపిరి బిగబట్టి చేతులతో దాడికే సిద్ధమయ్యాను.

ఆ ఆకారం గబ్ చిబ్ గా లోపలికొచ్చేసింది....

అది నా పక్కనే గోడకున్న స్విచ్ నొక్కబోతూంటే—చటుక్కున ప్రక్కకు జరిగిపోయాను—దాడికి వెలుతురై తేనే బాగుంటుందన్న ఆలోచనతో.

హఠాత్తుగా లైటు వెలిగి గది ప్రకాశవంతమైంది.

కానీ నాకు దాడిచేసే అవసరం కన్పించలేదు—ఆ ఆకారానికి అసలా ఆలోచనే లేదు.

మేమిద్దరం ఒకర్నొకరం రెప్పవేయకుండా చూస్తున్నాం.

నాకంటే ముందు వాడే తేరుకుని, "నువ్వా!" అని నోరు తెరిచాడు.

నేను తలూపి నవ్వాను అవునన్నట్లు.

"నువ్విక్కడికెలా వచ్చావ్?" అన్నాడు ఈసారి ఆశ్చర్యమేగాక భయపడిపోతూ.

"నువ్వు మర్యాద తప్పుతున్నావు...." అన్నాను తీక్షణంగా చూస్తూ.

మా ఇద్దరిమధ్య అయిదడుగుల దూరముంది.

"సారీ, మిస్టర్ సురేష్, మీరిక్కడికెలా వచ్చారు?" వాడన్నాడు ఒక అడుగు వెనక్కు వేస్తూ.

"ఎలా రాలేనో చెప్పు నువ్వు!" అన్నాను ముందుకు కదులూ.

"అక్కడే ఆగండి! నన్ను కొట్టకండి!" అరిచాడు వాడు చేతు లడ్డంపెట్టి. "మీరెలా వచ్చారసలు? ఈ ఇల్లు యెవరికీ తెలీదు, ఆ చచ్చినదానికి తప్ప!"

"ఆ చచ్చినదే నాకు చెప్పింది" అన్నాను నేనాగి

పోయి, వాడికి హాని చేయనన్న నమ్మకం కలిగిన్నూ.

వాడు ధైర్యంగా చూశాడు. "ఓహ్, అయితే ఫరవాలేదు. పోలీసులకి యెక్కడ తెలిసిపోతుందోనని నేను భయపడ్డాను. అందుకే ముందు తాళంవేసి వుంచి వెనకదారి ఉపయోగించుకుంటున్నాను. పగలంతా బయటే గడిపి, రాత్రి పడుకోడానికి మాత్రమే వెనక గోడ దూకి వస్తున్నాను, సార్."

"నీ తెలివి బాగానే వుంది, దొడ్డిదారి వెధవా!"

"కానీ మీరిక్కడేం చేస్తున్నారు, సార్? మీరూ పారిపోయి వచ్చారా?" అన్నాడు వాడు పూర్తిగా భయం తొలగించుకుని, "రండి సార్, యిక్కడ కూర్చుందాం. మంచినీళ్ళు తాగుతారా?"

"వుండనీ.... రాత్రి అక్కరకొస్తాయి."

"దేనికి, సార్?"

"నీ కొత్త లవర్ కోసం కావద్దూ...."

వాడు ఉక్కిరిపడి చూశాడు. అంతలోనే తేరుకుని కోపంగా చూశాడు, "మిస్టర్ సురేష్, మీరిక్కడికెందుకొచ్చారో చెప్పడంలేదు. మీకీ విషయాలన్నీ యెలా తెలుసు?"

"ఏ విషయాలు, వెధవా?"

"లవర్ అంటున్నారు...."

"కొత్త లవర్ అన్నాను, నీ పెట్లో వెలికాను."

"ఓ, అదా!" వాడు నవ్వాడు, "అది నా లవర్ కాదు, మిస్టర్ సురేష్. నాకు లవర్స్ ఎవరూ లేరిప్పుడు. ఆ చచ్చినదాన్నుంచి పాఠం నేర్చుకున్నాను, లెంపలేసుకున్నాను. లవర్స్‌కెన్ని కోరికలు! యెన్ని అర్డర్స్! ఎన్ని సాధింపులు! ఓహ్ బ్రదర్, యెంత బోరు! సరిపడా

డబ్బులు పారేస్తే ఓ రాత్రికి కావల్సిందంతా ఇచ్చిపోయే బరి తెగించిన భామలుండగా, వేరే యెవర్నో ప్రేమించడ మెందుకు? తలనొప్పి తెచ్చుకోవడ మెందుకు? నాన్సెన్స అంతా!"

వాడ్ని సూటిగా చూశాను కళ్ళలోకి. "రెండు పదులకే నలభై నిండిన కూతలు కూస్తున్నావు....ఏం భావరా అది? నీకిప్పుడే యెందుకురా ఇవన్నీ. అప్రాచ్యుడా!"

"అదిగో, నన్ను తిట్టే అధికారం మీకు లేదంటున్నాను! నా అక్కతో మీరు కులుకుతున్నారు.... ఏమన్నా అన్నానా నేను? యెవరి బ్రతుకు వారిదని సర్దుకుపోవాలి—ఊరుకోవాలంతే!"

"వెధవా, నువ్వు సరోజకి తమ్ముడి వయ్యావు కాబట్టి సరిపోయింది. నా తమ్ముడివే అయివుంటే ఆనాడే—ఎప్పుడు?—తిరగమరిగినప్పుడే మక్కెలిరగ్గొట్టి కప్పెట్టేసే వాడ్ని."

"మీరు—మీరిప్పుడెందుకొచ్చారసలు?"

నవ్వాను. "ఓహ్, మాటల్లోపడి మర్చిపోయాను. నువ్వు ఉదయంనుంచీ కన్పించకపోతే నేనే బయల్దేరి వచ్చాను, డోస్ ఇచ్చిపోదామని."

"డోసా?"

"దేహ శుద్ధి .... వాయిదాల పద్ధతిపై చేస్తానని చెప్పానుగా?"

"మిష్టర్ సురేష్, మీకిదేం బాగాలేదు!"

"ఎందుకని లేదు, వెధవా?"

"ఆ ఫోటోలు పోతాయి పోలీసులకి!"

"ఛీ, నోర్మూయి! నువ్వింకా కళ్ళు మూసుకుని

వున్నావు. అవి నువ్వెక్కడికి పంపినా భయపడను, తెలిసిందా? నీకు తగినశాస్తి చేసే పోతానప్పుడు."

"ఏం చేస్తారు మీరు?"

"నీ అక్క పంపింది నన్ను — పట్టుకుని చంపమని నిన్ను. కానీ ఆ పని చేయను ఇంకోరకంగా నిన్ను శిక్షించిపోతాను. అప్పుడా ఫోటోలు పంపడం మంచిదా కాదా అని నువ్వే ఆలోచిస్తావు. కచ్చితంగా పంపమని నా భరోసా, నువ్వు బాగుండాలనుకుంటే!"

"ఏమిటది.... అక్క డబ్బివ్వనందా?"

"కచ్చితంగా ఇవ్వనంది."

"ఎంత ద్రోహం?"

"నువ్వు చేయలేదూ? అందుకే యిప్పుడనుభవిస్తున్నావు?"

"ఇప్పుడు మీవల్ల ఏమిటి నాకు ప్రమాదం?"

"ఉంది, చాలా వుంది, నా షరతు ఒప్పుకుంటే చెప్తాను."

"ఏమిటా షరతు?"

"ఆ ఫోటోలు — నీ దగ్గరున్న అన్ని ఫోటోలూ నాకిచ్చేయాలి నెగటివ్స్‌తో సహా!"

"భలేవారే.... బలేబాగు! ఎంతాశ....!"

"వెధవా, అనుభవిస్తావు .... నీ కిది తెలుసా? ఈ న్యూస్ బులెటిన్ విను....నీ బావగారు దిగిన హోటల్ గదికి ఆ రాత్రి ఫోన్ వచ్చిందట, పదింపావుకి. ఆ గొంతు గమ్మత్తుగా అనిపించటంవల్ల బాగా గుర్తుండి పోయిందట ఆపరేటర్ కి. కీచుగొంతు. వింటున్నావా? పిట్టలా అరిచాడట. ఆ తర్వాత నీ బావగారు కిందికి

వెళ్ళి టాక్సీకోసం చూస్తున్నప్పుడు, ఆ టాక్సీవాడు అప్పుడే వూడిపడి ఎక్కించుకుపోయాడట ఇంటికి.

ఆ టాక్సీవాడు బక్కగా నల్లగా, పొట్టిగా వుంటాడట. వయసు ఇరవై మించదట. నెత్తిమీద పెద్ద జుట్టువుంటుందట, పెంటకుప్పలా, వాడ్ని చూసిన ఒకడు జుట్టుపోలిగాడని పేరు పెట్టేశాడు. ఇంతకూ ఆ టాక్సీ వాడి స్వంతం కాదట. దొంగిలించి తెచ్చాడట..."

వాడి ముఖంలో రక్తం మాయమై ఏడుపు మొహం పెట్టేశాడు.

నేను నవ్వాను. "ఇప్పుడేమంటావు చెప్పు, హీరో!"

వాడదే మొహంతో ఏదో చెప్పాలని నోరు తెరిచాడు. వెంటనే మూసుకున్నాడు చటుక్కున.

రంకెలు వేయకుండా నిశ్శబ్దంగా, కత్తులు పట్టుకుని లోపలికొచ్చేశారు రక్తయ్యలిద్దరూ.

13

అప్పుడు చూశాను వాళ్ళిద్దర్నీ నేను—

ఒకటవ రక్తయ్య జూలు చక్రవర్తిలా కన్పించాలని ప్రయత్నిస్తున్నాడు.

రెండవ రక్తయ్య సీజర్‌లా కన్పించడానికి అవస్థ పడుతున్నాడు.

వాళ్ళిద్దరి చేతుల్లో కత్తులు తళుక్కున మెరుస్తున్నాయి.

జుట్టుపోలిగాడు భయకంపితుడై చూస్తున్నాడు వాళ్ళని.

వాళ్ళ ఆకారాలు మరీ వికృతంగా, అసహ్యంగా వున్నాయి. మొన్న రాత్రి చీకట్లో సరిగ్గా చూడలేక

పోయాను.

జారు చక్రవర్తి శరీరం నిగనిగలాడుతూ, నల్లగా, గొడ్డు తోలులా వుంది.

సీజరుగారి శరీరం దుమ్ముకొట్టుకుపోయి, గుబురుగా, గొర్రె తోలులా వుంది.

వాళ్ళవైపు కన్నార్పకుండా నేను చూస్తూంటే, గొడ్డు తోలు అన్నాడు.

"ఏందిరా చెలరేగిపోతున్నావ్, చస్తావా?"

నేను తలూపాను అలాగే చూస్తూ, "అవున్రా, చంపు."

"ఓర్నియవ్వ, అంత మొనగాడివా?"

"నీ మొహం, నువ్వంత మొగాడివా?"

"బొమ్మల్ల, చూస్తావా?"

"తప్పదియ్యా, చూస్తాన్రా!"

నాది తెగింపని తెలుసు. నిజానికి వాళ్ళనెదుర్కొనే శక్తియుక్తులు నాకు లేవు. వాళ్ళలో ఒక్కడు చాలు సునాయాసంగా నన్ను లేపేయడానికి! అయినా నేనిప్పుడు వెనుదీయదల్చుకోలేదు. ఇలాంటి పరిస్థితి ఎదురైతే చంపాలి లేదా చచ్చిపోవాలి—

జుట్టుపోలిగాడు తేరుకుని దూరంగా జరిగిపోతూ అరిచాడు.

"నామీద చెయ్యివేశారంటే చూడండి, ఏమవుతుందో!"

"ఏమవుతుంది, బే?" గొడ్డుతోలు అడిగాడు.

"దాన్ని తెగనరికి దాంతో నే చావబాదుతాడు" అన్నాన్నేను.

"కాదు! ఆ ఫోటోలు పోలీసులికి పోతాయి!

పాలోమని జైలుకెళ్ళిపోతారు మీరంతా!"

"పోరా బచ్చా! పిచ్చిగా వాగక! నీ పిట్టమాతలకి బెదురుతామనుకున్నావా! నువ్వు ప్రతిఘటించేనే మాకు డేంజరు.... లొల్లి చేయక చచ్చిపో!"

జుట్టుపోలిగాడి కళ్ళలో భయం మెరిసింది. ధైర్యం కోల్పోయి బయటికి పరుగుతీయబోయాడు. గొర్రెతోలు మెరుపు వేగంతో కదిలి వెనకనుంచి వాడి జూలుపట్టి లాగాడు. వాడు అమాంతంగా వచ్చి గదిలో కింద పడ్డాడు. వాడిమీద గొర్రెతోలు పడ్డాడు. ఇద్దరూ ఫైట్సు చేయనారంభించారు...

గొడ్డుతోలు నన్ను సమీపిస్తున్నాడు, కత్తిని తిప్పుతూ.

వాడి కదలికల్ని జాగ్రత్తగా గమనిస్తూ నేను దెబ్బ తీసే మార్గాన్ని ఆలోచిస్తున్నాను వేగంగా.

అవతలి టీములో పోటీ విపరీతంగా పెరిగింది. నొప్పుతూ రోజుకుంటూ ఒకరిమీద ఒకరుపడి దొర్లుతున్నారు. కత్తితో పెనుగులాడుతున్నారు.

కారాటే, జూడో, కుంగ్‌ఫూలాంటి ఫైట్స్ ఏవీ నాకు తెలియవు. నాకు తెలిసిందల్లా పిడిగుద్దులూ, చెంపపెట్లూ. అలాగని నేనింతవరకూ ఏ దొమ్మీల్లోనూ పాల్గొనలేదు. ఎవరితోనూ పోరాడలేదు. ఇప్పుడీ ప్రాణరక్షణ సమస్య వచ్చింది. ముందు వీడి చేతిలో కత్తిని యెగరగొట్టగలిగితే, వీడి గొడ్డు కాయంతో ఎలాగో పట్లు పట్టి నేల కరిపించవచ్చుననుకుంటూ, కరాటే పద్ధతిలోనే పైకెగురుతూ కాలెత్తాను.

వాడు దాన్ని పుచ్చుకుని లాగేశాడు.

గుభీ గుభీమంటూ అవతలి టీమునుంచి పిడిగుద్దులు వినిపించాయి.

వెల్లకిలా విరుచుకు పడిపోతున్న నేను ప్రమాదాన్ని గ్రహించి, నామీదకి అడవి దున్నలా వచ్చి పడబోతున్న వాడి జిడ్డు ముఖంమీద, జాయింట్ పిడికిలిగా రెండు చేతులూ బిగించి మోదాను జమాయించి! ఠప్-ఫట్ మన్న ఆ దెబ్బకి వాడొక్క మూల్గుమూల్గి పక్కకు దొర్లి పోయాడు. కత్తివెళ్ళి అవతల టీముదగ్గర పడింది. కింగ్స్ ఆఫ్ ది స్క్వ్యేర్ రింగ్ సినిమాలో అంటోనియోఇనోకిలా బొక్క బోర్లాపడి, తలతో నా ముఖాన్ని బద్దలు కొట్టే యాలనుకున్నాడు వాడు! నేనా సదవకాశం ఇవ్వలేదు.

వెంటనే నేను కిందనుంచి లేస్తున్న క్షణంలో, అవతలి టీములో ఏం జరిగిందో, జుట్టుపోలిగాడి ప్రతాపానికి అమాంతం వచ్చి నా మీదపడ్డాడు గొర్రెతోలు!

కత్తి కొమ్ములూ లేవుగానీ వాడిదగ్గర, తలతో నా కడుపులో కుమ్మిన కుమ్ముకు పేగులు వెళ్ళుకొచ్చేసినట్లయింది! కళ్ళు బేలవేసి బాధగా అరవబోయాను. గొంతు పెగల్లేదు. వాడప్పటికే నా గొంతును బలంగాపట్టి నొక్కేస్తున్నాడు. ఊపిరికోసం ఉక్కిరిబిక్కిరి అయ్యాను. కళ్ళముందు చీకటి! చెవిలో రొద! కాళ్ళు చేతులూ ఆడటంలేదు... గొంతు నలిగిపోతోంది.... వాడు ఆయాస పడుతూ ఇంకా నొక్కుతున్నాడు. ఒక్కక్షణం ఇదే నా అంతం అనుకున్నాను....

అప్పుడు — కడుపుమీద దెబ్బనుంచి కొంతవరకు కోలుకున్న నేను, నా చేతులు ఫ్రీగా ఉండటంచూసి, వేళ్ళతో వాడి కళ్ళలో పొడిచాను.

ఒక విచిత్రమైన ధ్వని గదిలో మార్మోగింది. ఏ జంతువు అరుస్తుందలా? హఠాత్తుగా నామీద బరువు, గొంతుమీద పట్టూ తొలిగాయి. గబగబా ఊపిరిఅందింది.

అవయవాలు అదుపులోకొచ్చాయి. క్షణంలో మామూలు అయ్యాను. అవుతూనే స్ప్రింగులా లేచి ప్రక్కనే బోర్లా పడుకుని ముఖం పట్టుకుని బాధపడుతున్న వాడి తలమీద లాగి బలంకొద్దీ తన్నాను. వెల్లకిలా తిరిగి వాడు దొర్లుకుంటూ దూరంగా వెళ్ళాడు బాధగా అరుస్తూ.

టీము మారింది—

అవతలి టీములో గొడ్డుతోలూ, జుట్టుపోలిగాడూ, ఇద్దరూ కలిసి యమకొట్టుకుంటున్నారు. ఇద్దరి చేతుల్లోనూ కత్తులున్నాయి. రక్తాలు కారుతున్నాయి....

నేనాలస్యం చేయకుండా మళ్ళీ తన్నడానికి గొర్రె తోలుని సమీపించబోయాను—వాడంతలోకి చెవికోసిన నక్కలా లేచి కాలు విసిరాడు. ఆ దెబ్బ సరీగ్గా నాభికి తగిలేదే తప్పించుకోకపోతే, నేను పక్కకు తొలగడంతో వాడదే విసురుగా వెళ్ళి గోడని కొట్టుకుని కెవ్వుమని అరిచాడు.

వాడి అరుపుతో మరోకేక కలిసింది. నేను గొర్రె తోలు దగ్గరికి వురుకుతూ తలతిప్పి చూస్తే, అవతలి టీములో హోరాహోరీ పోరాటం జరుగుతోంది. ఆ కేక వేసింది గొడ్డుతోలు. వాడు కింద వెల్లకిలాపడి యెదుర్కొంటున్నాడు. జుట్టుపోలిగాడు వాడిమీద పడి యెక్కడపడితే అక్కడ పొడిచేస్తున్నాడు. గొడ్డుతోలు నుంచి పోట్లు తింటున్నాడు. కత్తులు, గాయాలు, మూల్గులు, రక్తాలు, భీభత్సం.

గొర్రెతోలు మెడపట్టి లేపి వాడ్ని గోడకేసి బాదాను. ముక్కులోంచి నెత్తురు కారి కెవ్వుమన్నాడు. మాగోసారీ అలాగే చేశాను. వాడి పళ్ళు కదిలిపోయాయి. పట్టు విడవకుండా మరోసారి బాదబోయాను, కానీ అవతలి

టీములో నిశ్శబ్దం నన్ను అటు చూసేలా చేసింది.

ఆ ఒక్క క్షణంలో గొర్రెతోలు కోలుకుని వూహించని దెబ్బతీశాడు. పొట్టలో పేగులు కదిలినట్లయి దూరంగా వెళ్ళి పడ్డాను. వాడు తలుపు దగ్గరికి పరుగు తీసేలోగే తిరిగిలేచి వాడ్నందుకున్నాను. కానీ వాడి చేతిలో కత్తివుందని నాకు తెలియదు. చెయ్యి విసిరాడు. వచ్చి తగిలింది. నా కుడిచెయ్యి మణికట్టుమీద కసిక్కున దిగింది. జివ్వుమని రక్తం చిమ్మింది.

వెర్రి ఆవేశంతో వాడిమీదికి వెళ్ళేలోగా వాడు బయటికి పరుగుతీశాడు, తలుపులు దగ్గరికి లాగేస్తూ. నేనాలస్యం చేయలేదు, చచ్చి ఒకరిమీద ఒకరు పడి వున్న గొడ్డుతోలు, జట్టుపోలిగాళ్ళని దాటుకుంటూ, తలుపుతీసుకుని బయటకురికాను.

వీధి చీకటిగా, నిర్జనంగా వుంది. వాడు యెడమ వైపుగా ఉరుకుతున్నాడు. వంట్లో శక్తి తెచ్చుకుంటూ పరిగెత్తాను వాడి వెనుక. వాణ్ని తప్పించుకో నివ్వద్దు!

చూస్తూండగానే గొర్రెతోలు సందులన్నీ దాటేసి మెయిన్ రోడ్డెక్కేశాడు. మధ్య మధ్యలో వెనక్కి చూస్తూ, వెంబడిస్తూన్న నన్ను పోల్చుకుని ఇంకా వేగం పెంచుతున్నాడు.

కొత్త కొత్త సందులూ, కొత్త కొత్త దారులూ, నాకందకుండా వాడు దౌడుతీస్తోంటే, వాడెక్కడో మాయంకాకుండా కాయశక్తులా వాడి ట్రాక్‌లో వుంటున్నాను. అలా పరిగెడుతూ పరిగెడుతూ, చివరికి మలక్‌పేట రైల్వేస్టేషను ముందు తేలాడు.

ఇహ చెంగు చెంగున మెట్లెక్కేసాగాడు.

ఎత్తుమీదున్న ఆ స్టేషన్‌లోకి అన్ని మెట్లెక్కి నేను

ఈ పరిస్థితిలో రాలేనని వాడి ఆలోచన కావచ్చు. నిజంగానే నా పరిస్థితి అలాగే వుంది. ఆయాసంతో యెక్కడవాన్నా కూలబడాలనిపిస్తోంది. అయినా శక్తిని కూడదీసుకుని వురికాను మెట్లమీదికి, జనాన్ని తోసుకుంటూ.

అది చూసి వాడు నిజంగానే బెదిరిన గొర్రెపిల్లలా చిన్న కేక వేసి, దబదబమని పైకి చేరుకుని స్టేషన్లోకి దూరాడు.

అప్పుడు ఇంకో ప్రమాదాన్ని గ్రహించాను. వాడే రైల్లోనో ఎక్కిపోతే కష్టం! దాగుడుమూతలాడాలి. రైలు కదిలితే సాహసాలు చేయాలి. రైలు లేకపోతే ప్లాట్ ఫాంమీదే వాడు జనంతో కలిసిపోయి జారుకోవచ్చు...

నా పట్టుదల మరింత పెరిగింది. వాడలాటి గుంపులోకి చేరకముందే చిక్కించుకోవాలి! వేగం పెంచి నేను స్టేషన్లోకి చేరుకోగానే, వాడు పదిగజాల దూరంలోనే కన్పించాడు, ప్లాట్ ఫాంకడ్డంగా వురుకుతూ. అదృష్టవశాత్తూ ఏ రైలూ లేదు! జనమూ ఎక్కువ లేరు! వాడికస్లిప్ ఇవ్వలేదు.

మేమలా ఉరుకుతూంటే జనం ఏమిటి? ఏమైంది? అంటూ కేకలేయసాగారు. జేబు దొంగ! నన్ను పొడిచి పారిపోతున్నాడు! అంటూ నేనాగకుండా వురకసాగాను.

వాడు ప్లాట్ ఫాంమీంచి పట్టాలమీదికి దూకేశాడు. నేనూ దూకాను. నా వెనుక యెవరూ రాలేదు. అంతా ముందుకొచ్చి చూస్తున్నారు.

వాడు ఆగకుండా కుడివైపు యెంతో నేర్పుగా,

వేగంగా వురుకుతూంటే — పట్టాలకింద ప్లాంక్స్ మీద అడుగులు సరిగా వేయలేక అవస్థపడుతూ నేను వెళ్తున్నాను. వాడ్ని వెంబడించడం ఇలా అసాధ్య మనిపించింది.

ఇద్దరి మధ్య యెడం క్షణక్షణానికీ మించిపోతోంది.. ఇరవై, యాభై, డెభై గజాల దూరంలోకి వెళ్ళి పోయాడు. అప్పుడు నేనలాగే అవస్థపడుతూ పరిగెడుతున్న వాడినల్లా, వందగజాల దూరంలో ఠక్కున ఆగిపోయాను వాడ్ని చూసి.

14

డాక్టర్ మనోహర్‌రావు చిరునవ్వుతో చూసి, "ఇప్పుడు నీకేం ఫరవాలేదు....ఒక యింజక్షన్ ఇస్తాను, నయమైపోతుంది—" అంటూ కదిలాడు, నా వీపుతట్టి.

బాధగా నా చేతిని చూసుకున్నాను. కట్టు బాగానే వుంది. కట్టువేస్తానంటే వద్దన్నాను. ఇంజక్షను తప్పదు. ఇలా నా వంటిమీద డాక్టర్ చేయి వేయించుకుని చాలా ఏళ్ళయింది. రోగాలూ గాయాలూ నాకెందుకో తగలవు. ఇప్పుడీ సాహసకృత్యంతో తగిలించుకున్నాను.

ఇంజక్షనుకూడా ఇచ్చి ఆయన, "అయితే అప్పుడేం జరిగింది?" అనడిగాడు, తన కుర్చీలో వెళ్ళి కూర్చుంటూ.

అప్పటికి నేనింకా పూర్తిగా చెప్పలేదు.

నేనన్నాను, "వాడలా నా చేతిమీద పొడిచి పారి పోతూంటే పట్టుకుందామని వెంటాడాను, డాక్టర్. నేనక్కడ ఆటోకోసం చూస్తూ నిలబడ్డాను, మలక్ పేటలో ఫ్రెండ్ ఇంటినుంచి వస్తూ. అప్పుడా వెనుక నుంచి వాడు నా జేబులో చేయివేస్తే పట్టుకున్నాను. వాడు వేగంగా కత్తితో నా చేతిమీద పొడిచి పారి

పోయాడు....వాడ్ని వెంటాడుతూ నేను మలక్ పేట రైల్వేస్టేషన్‌లో వరకూ వెళ్ళాను....వాడు ప్లాట్ ఫారం దూకేసి పట్టాలమీదికి వురికాడు. వాడ్ని వదలకూడదని నేనలాగే వెంబడించాను. కానీ కొంతదూరంలో ఏమైందో కాలుజారి పడిపోయాడు...."

"పట్టాలమీద నే?"

"కాదు. వాడప్పటికి ఓవర్ బ్రిడ్జిమీద వున్నాడు. అక్కడ్నించి జారి కింద రోడ్డుమీద పడ్డాడు. అప్పుడే సిటీలోకి వస్తున్న సరుకుల లారీ వాడ్ని కాపాడలేక పోయింది...మీదకెక్కేసింది....చచ్చిపోయాడు అక్కడి కక్కడే."

"ఓహ్, వెరీ సారోఫుల్ డెత్!" కళ్ళు మూసుకుని అన్నాడు డాక్టర్, "తర్వాతేమైంది? నువ్వేంచేశావ్?"

"నేనక్కడ వుండలేదు. వాడి ప్రాణాలు పోతే నా బాధ్యత కాదు. పోలీసుల్ని కలవలేదు. వాళ్ళు వచ్చేలోపునే వచ్చాను....నా బాస్ చావుతో నాకు చాలా సమస్యలున్నాయి, ఇంకా ఆ తలనొప్పి ఎందుకు?"

"సమస్యలా?"

"కంపెనీ సమస్యలు" అంటూ లేచాను.

"అవును...మీ బాస్‌కిప్పుడు వారసులెవరు?"

"అదింకా లాయర్ చెప్పలేదు. విల్లు రాశాడో లేదో కూడా తెలియదు. థాంక్స్ డాక్టర్. నౌ అయామ్ ఫైన్, మీ ఫీజుకు అంత డబ్బు ఇప్పుడు నా దగ్గరలేదు... మళ్ళీ వచ్చి ఇస్తాను."

బయటికి నడిచాను లేచి.

వర్షం కురుస్తోంది బయట హోరున...వెంటనే ఒక ఆటో ఎక్కి పోనివ్వమన్నాను. ఎక్కడికన్నాడు వాడు.

నీ యిష్టం ఎక్కడికైనా పోనివ్వమన్నాను. నేను చెప్పే వరకూ అలా తిప్పుతూనే ఉండమన్నాను. వాడు విచిత్రంగా చూశాడు. చేతిలో అయిదు రూపాయలు పెట్టి, వెళ్ళి మోడ్రన్ బ్రెడ్ అరటిపళ్ళూ తెమ్మన్నాను. ట్రాన్స్‌లో వున్నవాడిలా వెళ్ళి తెచ్చాడు. ఇక పోనివ్వమన్నాను ఆలస్యం చేయకుండా. వాడు తికమక పడిపోతూ స్టార్టు చేశాడు.

ఆటో పోతోంటే ఆహారం అరగిస్తూ నేను తిరిగి ఆలోచనల్లో పడ్డాను. ఆలోచనలకి ఒక్కోసారి మూడ్ మారుతుంది. నాకిప్పుడు ఇలా తిరుగుతూ ఆలోచించాలని వుంది...

వర్షాన్నీ, ట్రాఫిక్‌నీ, లైట్లనీ చూస్తూ, రోడ్లన్నీ చుట్టేస్తూంటే ఆలోచనలు అలా సాగిపోతున్నాయి...

రాణి హంతకుల చావు చూడటం తృప్తిగా నేవున్నా, నన్ను శత్రువు దగ్గరికి చేర్చే వాళ్ళిద్దర్నీ కోల్పోవడం నిరాశగా వుంది...

జుట్టుపోలిగాడూ చచ్చాడు. ఫోటోల గురించి వాడిదంతా బుకాయింపని ఇప్పుడు తెలిసిపోయింది. అందుకే చంపేశారు. వీడు అబద్ధాలాడుతున్నాడని అంత నమ్మకంగా ఎలా తెలుసు సరోజకి? తెలిస్తే ఎప్పుడో చంపేయకుండా నేను పట్టుకునేంతవరకూ ఎందుకాగింది? అసలా డ్రైవర్‌ని పట్టుకోమని నన్నెందుకు కోరింది— అదామె తమ్ముడే అయితే? తన కుట్ర ఇలా నాకు తెలిసిపోయేలా యెందుకు చేసుకుంది? నాకర్థంకావడం లేదు.

ఆమె తెలివిగా ఏదో గేమ్ ఆడుతోంది. అదింకా అంతుబట్టడంలేదు. ఆమె ఆలోచన ఏమై వుంటుంది?

టైమ్ చూసుకున్నాను. తొమ్మిదవుతోంది. ఇప్పుడు ఈ రాత్రి! ఆమె తన గుట్టంతా కక్కేయాలి! తమ్ముడ్ని చంపమని తనే పంపింది గనుక వాడి చావు ఆమెకు షాక్ కాదు. కానీ ఆ గోగ్స్ చావు వెయ్యి వోల్టేజిల షాక్‌లా తగులుంది ఇప్పుడు తెలిస్తే....

నాకో అనుమానం వచ్చింది. ఆమె నన్ను కూడా చంపించాలనుకుందా? అవును, గొడ్డు తోలు ముందు నాతోనే సవాలు చేశాడు. రావడంతోనే చస్తావా అని బెదిరించాడు. నాకిప్పుడర్థం అయిపోయింది....తమ్ము డెక్కడున్నాడో తెలియదు వాళ్ళకి, నాద్వారా వాడి జాడ తెలుసుకుని మా ఇద్దర్నీ మట్టుబెట్టాలనుకుందామె!

నన్ను చంపాలనుకుంది! అదే ఆమె ఆలోచన.

ఆటోవాడికి ఆమె ఇంటికి దారిచెప్పి సిగరెట్ వెలిగించుకున్నాను....

ఇప్పుడామె బుద్ధి తెచ్చుకుని రాజీకొచ్చినా అది పరస్పరం మా ఇద్దరి రక్షణకోసమే కావాలి. ఆమెతో ఇంకే సంబంధాలూ వద్దు. ఆమె నన్ను ఛీకొట్టకముందు నేనే కొట్టాలి. నా విలువ దక్కుతుంది. ఆమె యెవరు నన్ను ఫూల్‌ని చేయడానికి? ఆమెను ఏ దృష్టితో చేరదీశాను నేను? తనేం చేస్తోంది నాకిప్పుడు!

ఆటో పోతోంటే ఆలోచనల్నాపి వర్షంలోకి చూశాను...మరింత యెక్కువైంది వర్షమిప్పుడు. అలా చూస్తూంటే మొన్న రాత్రి జ్ఞాపకం వచ్చింది...ఈ వర్షంలోనే నా బాస్‌ని కొట్టి చంపేశాను, ఈ ఆడదాని కోసం! నాకేడ్వాలనిపించింది....

నిజంగా నేను అతడు శాడిస్టు అన్న కసితోనే చంపానా, లేక సరోజ నాది కావాలన్న స్వార్థంతోనా?

కాదు — స్వార్థంకంటే అప్పుడతనికి శాస్తిచేయాలన్న ఇచ్ఛ కొంత, ఆత్మరక్షణాభావం కొంతా కలిసి నన్నాపని చేయించాయి! ఇద్దరు భార్యల్ని పొట్టన బెట్టుకున్నాడు కదూ అతను? స్వార్థంతో చేసినా వాళ్ళ ఆత్మలకి శాంతిని చేకూర్చాను—అది చాలు.

నేనొకడ్ని చంపానంటే నేనే నమ్మలేకపోతున్నాను. అనూహ్యంగా నేను హత్య చేస్తాననుకోలేదు. కానీ చేసేశాను. ఆ సమయం అలా వచ్చింది....అందరు హంతకులకిలాగే ఇప్పుడీ పాట్లన్నీ! కానీ—

హత్యచేసిన రాత్రి .... ఆ దృశ్యమంతా కళ్ళముందు కదులోంది సినిమా రీలులా. అందులో నాకేదో అసహజంగా కన్పిస్తోంది....నిజం. ఏమిటది? ఎక్కడ? ఆ సమయంలో జుట్టుపోలిగాడిరాక! అవును, వాడెందుకొచ్చాడప్పుడు? హత్య ఫోటోలు తీయడానికి, కానీ ఇంట్లోకెందుకొచ్చాడసలు? ఆ ఫోటోలు తీసుకుని రహస్యంగా వెళ్ళిపోవచ్చునే? ఆ ప్రేమ ఫోటోలతో అప్పుడే వచ్చి వ్యర్థంగా బెదిరించడమెందుకు? అ స హ జ ం కదూ? ఏకంగా మర్నాడే వచ్చి ఆ హత్య ఫోటోలతో బెదిరించవచ్చుగా?

నాకిందులో ఏదో కిటుకు వుందని నిశ్చయమైపోయింది- ఏమిటది? వాడి రాకలోని ఆంతర్యమేమిటి?

సిగరెట్ దమ్ము లాగుతూ ఆ రాత్రి సంఘటనను మళ్ళీ గుర్తు చేసుకున్నాను. రావ్‌ని కిందపడేసి మీదెక్కి కూర్చున్నాన్నేను. చేత్తో పక్కనే ఫ్లవర్ వేజ్ అందుకుని అతని నెత్తి మోదాను. అది పట్టుతప్పి నా చేతిలోంచి దూరంగా పడింది. దాన్నందుకోబోతున్నాను. అదే క్షణంలో కింద కాలింగ్ బెల్ మోగింది. సరోజని

చూడమని కిందికి పంపాను. నేను గదిలోనే కొద్ది సేపు వున్నాను. రావ్ నేను కొట్టినప్పుడే స్పృహతప్పి పడి వున్నాడు. తర్వాత నేను కూడా గది తలుపులేసి కింది కొచ్చాను. సరోజ అప్పుడే తలుపు తీసింది. జుట్టుపోలి గాడు లోపలికొచ్చాడు టార్చి పట్టుకుని.

—టార్చి పట్టుకుని.

—నేను బాస్‌ని కొట్టిన రెండు మూడు క్షణాల్లోనే కింద బెల్ మోగింది.

—సరోజ కిందికి వెళ్ళి తలుపు తీయడానికి కనీసం రెండు నిమిషాలైనా పట్టింది.

ఇప్పుడు ప్రశ్నేమిటంటే—నేను రావ్‌ని కొట్టినప్పుడు కిటికీ దగ్గర బాల్కనిలో వుండి ఫోటోలు తీస్తున్న జుట్టుపోలిగాడు, అదే క్షణంలో కిందికి వెళ్ళి ఎలా బెల్ నొక్కాడా అన్నది!

ఫోటోతీసి, బాల్కని దిగేసి వెళ్ళి ముందు తలుపును చేరుకోడానికి కనీసం రెండు మూడు నిమిషాలైనా పడు తుంది. కానీ క్షణాలే పట్టింది వాడికి. ఎలా సాధ్యం?

మాంత్రికుడు కాదు వాడు. బాల్కనీ అప్పుడే దిగ లేదు వాడు. బెల్ నొక్కనే లేదు వాడసలు. వాడి తరపున నొక్కారెవరో.

ఇక్కడ ఫోటో తీసిన వెంటనే అక్కడ కింద వున్న తన మనిషికి సంకేతం పంపాడు బెల్ నొక్కమని!

టార్చివేసి సూచించాడు అలా!

వాడి చేతిలో అప్పుడు టార్చికదే అర్థం!

తర్వాత బాల్కని దిగి సరోజ తలుపు తీసేలోగా చేరుకున్నాడక్కడికి!

అంతే! ఇంతకంటే మరో వివరణలేదు దీనికంతటికీ!

ఇలాగే జరిగింది కచ్చితంగా!

కానీ — యెందుకు జరిగింది? యెందుకలా చేయాలి అప్పుడు? అదే క్షణంలో బెల్ యెందుకు నొక్కాలి? మమ్మల్ని యెందుకు డిస్టర్బ్ చేయాలి?

నాకిప్పుడు తెలిసిపోయింది .... వాడా సమయంలో ఫోటోలతో రావడమన్నది ఉట్టి నాటకం! మమ్మల్ని కొంతసేపు కింద ఆపి వుంచడానికి వచ్చాడా వంక పెట్టుకుని! లేకపోతే వాత్స్య ఫోటో తీశాక ఆ ప్రేమ ఫోటోలు ఏమంత పనికొస్తాయి?

వాడు మమ్మల్ని గదిలోంచి కిందికి రప్పించి, కొంత సేపు ఆపి వుంచడానికే ఆ ఫోటోలతో దండగ బేర మాడాడు!

అయితే—మరో ప్రశ్న—మమ్మల్ని యెందుకలా ఆపాలి?

దీనికి ఇక ఒక్కటే జవాబు వుంది ... నా గుండె అదిరిపడసాగింది. కొయ్యబారిపోయాను. నిజమా! అలా జరగడం సాధ్యమా! బాస్‌ని పూర్తిగా చంపడానికే మమ్మల్ని స్థలాన్నుంచి తప్పించారా! వాడి జతగాడు అప్పుడు పైకి చేరుకుని రావ్ తల బద్దలు కొట్టాడా!

దిమ్మెరపోయి కూర్చున్నాను.

వాళ్ళ ఉద్దేశ్యం రావ్‌ని నాచేత చంపించాలని కాదా? నేను చంపుతానని నమ్మలేదా? నేనే ఆ చండ శాసనుడి చేతిలో చస్తానని అనుకున్నారా? ఒకటి రెండు దెబ్బలు వేస్తూండగానే ఫోటో తీసి, నన్నక్కడ్నుంచి క్షణంలో తప్పించి, మిగతా పని తాము పూర్తి చేశారా!

ఇంత వర్షంలోనూ చెమట విపరీతంగా పట్టేస్తోంది నాకు.... నేను కొట్టిన దెబ్బకు రావ్ చావలేదన్నమాట!

స్పృహ తప్పాడు. నేనా గదిలో కాస్సేపు వున్నాను. అంత సేపూ రక్తంలేదు. అప్పుడే తల పగిలివుంటే రక్తం రావాలి! దేహం చిట్లిన క్షణంలో నే రక్తం చిమ్ముతుంది! దానికాలస్యం లేదు! ఈ కామన్ సెన్స్ నాకింతవరకూ స్ఫురించలేదు! ఇంత మానసిక శ్రమా, భయాందోళనలకు అనవసరంగా లోనయ్యాను!

ఆ సమయంలో తల చిట్లలేదంటే, రావ్ నా చేతిలో చావలేదు!

ఓ మై గాడ్, అయితే రావ్ని చంపింది నేను కాదా?

నేనంత అదృష్టవంతుడ్నా!

నా ఒళ్ళు పూర్తిగా చల్లబడిపోయింది....

ఎలా నమ్మాలి—దీన్నెలా నిరూపించాలి?

ఆటో వర్షాన్ని చీల్చుకుంటూ దూసుకుపోతోంది.

15

వర్షాన్నీ, చీకటినీ చీల్చుకుంటూ ప్రసరిస్తున్నాయి నా చూపులు తీక్షణంగా—ఆ ఇంటిమీదకి.

ఆ పెరటి గోడమీద పదినిమిషాలనుంచీ కూర్చుని వున్నాను, ఎదురు చూస్తూ.

వర్షానికి తడిసిపోతున్న స్పర్శ, చలికి వణికిపోతున్న స్పృహ నాకేమీ లేదు. నా గుండెల్లో రగిలిపోతున్న అగ్నికి ఇవేవీ తెలియడంలేదు. ఇంతటి వ్యధకు లోనైన మనసు వీటిని వెంటనే ఖాతరు చేయడంలేదు.

ఇప్పుడొక్కటే నా లక్ష్యం!

నాకు సాక్ష్యం కావాలి. నేను నిర్దోషినని నిరూపించుకునే సాక్ష్యం కావాలి. ఈ హత్య నేను చేయలేదు. ముమ్మాటికీ చేయలేదు. మనస్సాక్షి చెప్తోంది గట్టిగా. ఆ

రాత్రిని మననం చేసుకున్నకొద్దీ ఇంకా బలంగా నమ్మకం కలుగుతోంది నేను హంతకుడ్ని కానేకాను! అయ్యో అవకాశం లేనేలేదు!

బిజినెస్ మాగ్నెట్ మిస్టర్ బి.జె.పి. రావ్‌ని హత్య చేసింది అతని పర్సనల్ సెక్రటరీ సురేష్‌కుమార్ కాదు. కానేకాదు.

నూరుపైసల నిర్దోషి సురేష్‌కుమార్. ఇది నిరూపించుకోవాలి.

ఇంట్లో ఏ శబ్దాలూ లేవు. పెరట్లో లైటు కూడా లేదు. టైము పదిదాటి అయిదు నిమిషాలు. సరోజ ఈ పాటికి నిద్రపోయి వుంటుందా? రోగ్స్ కోసం యెదురు చూస్తోందా?

గోడ దిగుతూ ఆలోచించాను .... జుట్టుపోలిగాడి ఆ జతగాడెవరు? బెల్ నొక్కిందెవరు? పైకి వచ్చి హత్య చేసిందెవరు? ఆ రోగ్స్‌లో ఒకడా? గొడ్డుతోలుగాడా? సరోజకి తమ్ముడు బాల్కనీలో వున్న సంగతి తెలుసు. అయితే సరైన క్షణంలో చూసి కింద బెల్ నొక్కే వాడి కోసం టార్చి వేయమని మాత్రమే చెప్పింది—తన స్కీము ప్రకారం. కానీ వాడామెకు తెలియకుండా ఫోటో కూడా తీశాడు. అత్యాశకు పోయాడు, హతుడయ్యాడు!

నడుచుకుంటూ, కింద బురదనీటిని చిమ్ముకుంటూ, ఇంటి కుడిపక్కకు వెళ్ళాను. కిటికీలన్నీ మూసివున్నాయి. అలాగే ముందుకు వెళ్ళాను. అక్కడాగిపోయి యింటి ముందు ఆగివున్న కారుని చూశాను. అది వైట్ అంబాసిడర్. ఆ కారు బాస్‌ది కాదు.

ఎవరొచ్చారు ఇంటికి?

చిన్నగా ఇంటి ముందువైపు కదిలాను. చీకటిగా

వుంది. వరండాలో లైటు లేదు. తలుపు తెరచి వుంది. హాలులో లైటు వెలుగుతోంది. జాగ్రత్తగా వరండా ఎక్కి తలుపు పక్కన కిటికీని చేరుకున్నాను. లోపలికి చూశాను—

హాలులో వాళ్ళు ముగ్గురు కనిపించారు.

సోఫాల్లో ఎదురెదురుగా సరోజ, నా బాస్ లాయర్ విష్ణుకాంత్ కూర్చుని వున్నారు. ముసలి రాజయ్య కింద వున్నాడు. చిన్నారి జాడ లేదు.

సరోజ, ముసలి రాజయ్య ముఖాలు వడలిపోయి వున్నాయి.

వాళ్ళు నిశ్శబ్దంగా, నిర్లిప్తంగా వింటున్నారు లాయర్ చెప్తూంటే. "....అంతే, సరోజగారూ! నేనేమీ చేయలేను. ఇదంతా చెప్పడం నాకు చాలా బాధగా వుంది. పరిస్థితి ఇలా వుంది. దీన్నెవరు తప్పించగలరు, చెప్పండి? స్వయంగా ఆయనే ఏమీ చేయలేకపోయారు.. లేకపోతే మీకింత అన్యాయం చేసిపోయేవారే కాదు...."

"లాయర్ గారూ, నేనిది నమ్మలేకపోతున్నాను" అంది సరోజ పొడిగా.

"ఇదెవరూ నమ్మలేరు, సరోజగారూ. నాలోనే ఇంత వరకూ రహస్యంగా వుండిపోయింది. ఆయనలా వుంచమన్నాడు. ఆయన స్టాఫ్‌కి, స్నేహితులకి యెవరికీ తెలియనివ్వద్దన్నారు. ఇలాటివి ఎంత చెరుపు చేస్తాయో మీకు తెలుసు, బిజినెస్‌కి. కానీ ఇప్పుడు తప్పదుగా వెల్లడి చేయక?

"ఇప్పుడు చెప్పండి—ఆయన విల్లు ఏమని వ్రాస్తారు? తన తదనంతరం ఆస్తులన్నీ అమ్మేసి అప్పులు తీర్చమనా? ఇంకేం వ్రాస్తారు? ఆయన బ్రతికివుంటే ఇలాంటి పరిస్థితి

మీదకు రాకుండా కృషి చేసేవారు. కంపెనీ స్థితి చెప్పుకో దగ్గంతగా హెల్దీగా లేదు, సరోజగారూ. వచ్చే లాభాల్ని నష్టాలు మింగేస్తున్నాయి. నష్టాల్ని పూడ్చడానికి అప్పులు చేసి బిజినెస్‌ని పెంచుకుంటూ పోయారు. అదేం దుర దృష్టమోగానీ నష్టాలు పెరుగుతూ పోయాయి. కంపెనీ ఎస్సెట్స్‌తో సమానంగా లయబిలిటీస్ చేరుకునే పరిస్థితి వచ్చింది. బ్యాంకులో నాలుగు లక్షల ఓ.డీ, ఇంకా కొందరు ఫైనాన్సర్స్‌నుంచి పెద్ద మొత్తాల్లో అప్పులూ, ఇవేగాక మార్కెట్‌లో క్రెడిటర్స్ పెట్టిన అప్పులూ....

"ఇవన్నీ తీర్చాలంటే మొత్తం కంపెనీని వైండప్ చేసి, ఈ ఇల్లూ మిగిలిన ఆస్తులూ అమ్మివేయక తప్పదు, సరోజ గారూ. ఇవన్నీ మార్ట్‌గేజ్‌లో వున్నాయి. పార్టీలు ఇంకెంతకాలం ఆగరు. అప్పుడే కొందరినుంచి నాకు కాల్స్ వస్తున్నాయి..."

"ఇక మిగిలేదేమీ వుండదంటారు, అంతేనా?" అడిగింది సరోజ క్లుప్తంగా.

లాయర్ తలూపాడు మౌనంగా.

పేలవంగా నవ్వింది సరోజ. "అయితే పోనివ్వండి, లాయర్ గారూ. బాధపడకండి. నాకీ ఆస్తులూపాస్తులూ ఏవీ అక్కర్లేదు. అంతా అమ్మేసి పంచిపెట్టేయండి. ఆ గొడవంతా మీరే చూసుకోండి. నేనిప్పుడంటే ఇప్పుడు నడిచిపోగలను బయటికి. నాకే బెంగాలేదు. కష్టాల్లోంచి నడిచివచ్చిన దాన్ని. నా గురించి ఏ బాధాలేదు. చిన్నారి గురించే నా విచారమంతా...నాతో పాటు దాన్ని కష్టాలకు గురిచేయటం...అది ఆలోచించలేకపోతున్నాను. అన్యాయం నాకు జరగలేదు, దానికే జరిగింది...ఈ క్షణంవరకూ అదీ యింటికి రాణి...ఇవా ఇప్పట్నించీ

నాతోపాటు నడివీధికి...”

“అయాం సారీ, సరోజగారూ, చిన్నారి గురించి నాకూ బాధగావుంది. ఇప్పుడు మీరేం చేస్తారు? ఎక్కడికి వెళ్తారు?”

“అది మీ కవసరం కాదనుకుంటాను, లాయర్ గారూ! మా బాగోగుల గురించి ఆయన చెప్పి వుంచలేదను కుంటాను? ఆయన మీకు చెప్పినంతవరకే చేయండి. మాపై సానుభూతి కూడా వద్దు. సానుభూతి ఆయన మీద చూపండి. ఆయన చేసుకున్నదానికి అనుభవించి పోయారు. నాకిప్పుడే తృప్తిగా వుంది. ఈ సర్వనాశన మంతా ఇంటిని వల్లకాడు చేసుకున్న శాపం మూలంగానే...”

“మీరెలా వుంటారిగా...”

“ఏం, నేనింతకంటే బాగా బ్రతకలేనా? నేను ఇక్కడేం సుఖపడ్డానని? ఆయన నాకేం ఇవ్వనప్పుడు, మిగిల్చి వెళ్ళనప్పుడు, మరణ శాసనం విధించినప్పుడు, నడి వీధిలోకి విసిరినప్పుడు, నా ఇష్టం వచ్చిన నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ నాకుంది! కాదనగలరా యెవరైనా?”

రోషంగా అని లేచి పోయింది సరోజ.

ఆమె మళ్ళీ గదిలోంచి రాలేదు.

లాయర్ నిట్టూర్చి లేచాడు. ముసలి రాజయ్య లేచి అతని చేతులు పట్టుకుని, “అమ్మగోరికి పెద్ద అన్నాయం సేసిపోయారు బాబయ్యా, అయ్యగోరూ?” అన్నాడు.

“ఇప్పుడు నువ్వేం చేస్తావ్, రాజయ్యా?”

“ముసిలోడ్ని! యెక్కడికన్నాపోయి సత్తాను బాబయ్యా, నాకేం?”

లాయర్ తల వూపేస్తూ, ఆవేదనగా గొణుక్కుంటూ, గొడుగు పట్టుకుని బయటికొచ్చేశాడు, నేను పక్కకు వెళ్ళిపోయాను తేరుకుంటూ.

నా మెదడు పనిచేయటంలేదు. విన్నదీ కన్నదీ కలా నిజమా అనిపిస్తోంది.

కారు స్టార్టయి వెళ్ళిపోయింది...

అప్పుడే ముసలి రాజయ్య బయటికొచ్చాడు, అతడా వర్షంలో వడివడిగా అడుగులేయసాగాడు అవుట్ హావుస్ వైపు. అతని నడకలో కోపం ఉద్రేకం తెలుస్తూనే వుంది. అతను భళ్ళున తలుపుని తన్ని లోపలికెళ్ళి పోయాడు. చటుక్కున లైటు వెల్గింది. ఆ వెంటనే చప్పుళ్ళు ప్రారంభమయ్యాయి...

నేను గబగబా అటువైపు నడిచాను. తలుపుదగ్గరాగి లోపలికి చూశాను కలవరంగా.

అప్పుడు చూడాలి అతని స్థితి—గదంతా తిరుగుతూ శివతాండవం చేస్తున్నాడు, కోపంతో తిట్టుకుంటూ ఉద్రేకంగా అరుచుకుంటూ! ఏదో అతీతశక్తి ఆవహించినట్టు వూగిపోతున్నాడు. పెట్టెలోంచీ, బీరువాలోంచీ వస్తువులుతీసి విసిరేస్తున్నాడు...

"దేముడు మనమీద దయసూపలేదెహే... పోనీయ్! పెపంచంలో శానా డబ్బుంది, మరోకోట కూడ్దాంలెహే పోనీ...."

నా ఏర్‌బ్యాగుని కసిగా చింపుతున్నాడు. టేప్ రికార్డర్‌ని కాళ్ళకింద తొక్కుతున్నాడు. ఫోటోల్ని ముక్కలుగాచేసి పారేస్తున్నాడు. నెగటివ్‌లని నోటితో చింపి పారేస్తున్నాడు. కెమేరాని ముక్కలయ్యేలా గోడకేసి కొట్టాడు. పిచ్చిగా కింద కూలబడి నవ్వు

తున్నాడు. జుట్టు పీక్కున్నాడు. మరో నవ్వు పగలబడి నవ్వి అరిచాడు.

"పోయిందహ...పోయింది! అనుకున్నది కాకుండా పోయింది!"

చప్పట్లు కొట్టసాగాడు లయగా.

"డబ్బు కోసమేనా రాజయ్యా, అయ్యగార్ని చంపావు?" అడిగాను నేను, వెనుకనుంచి మెల్లిగా.

16

భూమి దద్దరిల్లి పోయేలా దడదడమని గర్జించుకుంటూ పోయింది ఒక మేఘం, గగనతలంలో.

ఫెడేలుమని ఎక్కడో పిడుగుపడింది, దిక్కులు పిక్కటిల్లేలా.

అతడా షాక్‌నుంచి కోలుకోకముందే నేనే అన్నాను మళ్ళీ. "నువ్వు చెడ్డపని చేశావు, రాజయ్యా...నువ్వు చాలా దుర్మార్గుడివి!"

అతను పలకలేదు. అసలు నోరు తెరవలేదు. గుటకలు మింగుతున్నాడు, తప్పిదాన్ని కప్పిపుచ్చుకోలేకపోతున్న కళ్ళతో చూస్తూ, నిస్సహాయమైన చూపులు. ఎప్పుడూ చురుగ్గా, అవిశ్రాంతిగా వుండే అతని చేతులప్పుడు, చచ్చిన పాములా వేలాడుతున్నాయి. ఆ చేతులే బుస కొట్టి నా బాస్ ప్రాణాల్ని బలిగొన్నాయి.

"నువ్వింత చెడ్డవాడివనుకోలేదు, నిన్ను సహ్యించుకుంటున్నాను!" అన్నాను కాస్త తీవ్రంగా, అతను తేరుకునేలా.

అప్పుడతను వూహించని వేగంతో లేచాడు కిందనుంచి. ఉరికివచ్చి అరిచాడు నామీద గొంతు చించుకుని.

"ఎవరు...ఎవర్ని సెడ్డవోడంటున్నావు? ఎవరు సెడ్డ

వోరు కారు? యెవరు సేయరు సెడ్డ పని? నేనేనా సెడ్డోణ్ని? నువ్వు సేయడంలేదా సెడ్డ పని? నీ దొర సేయ లేదా సెడ్డపని? ఆ సరోజ సేయట్లేదా సెడ్డపని? ఎవరు సెడ్డపని సేయరు సెప్పు కుర్రోడా, ఈ పెపంచంలో!"

అతన్ని దూరంగా తోశాను. "డబ్బుకోసం ఈ వయసులో నువ్వు చెడ్డవాడివి కావడం ఆశ్చర్యంగా వుంది..."

"డబ్బుకోసం!" నవ్వాడతను పకపకా, "అవునోయ్, డబ్బుకోసం! డబ్బు యెవరికి అవుసరముండదు సెప్పూ? నీకుండదా? నాకుండదా? డబ్బవుసరంలేని యెదవ సన్నాసి యెవడున్నాడు సెప్పు పెపంచంలో! డబ్బు మీదే పెపంచం నడుసుద్ది, డబ్బుతోటే పరువూ మర్యాదా నిలుసుద్ది. డబ్బులేని బతుకెందుకిహ...బతికి లాబంలేదిహ..."

"ఏంచేద్దామనుకున్నావు అంత డబ్బుతో?"

క్షణంపాటు అతను నిశ్చలంగా వుండిపోయాడు. తేరుకుని తొడచరచుకున్నాడు, హేళనగా నవ్వుతూ. "నీ పెస్న తగిలెయ్య! రాజసంగా బతకాలనుకున్నానోయ్, రాజసంగా! రాజబోగాలనుబగించడానికే గీవయసులో కూడా నేనింత గట్టిగా వున్నాను, సూడవోయ్! నీలాటి కుర్రోళ్ళు పదిమందితో పరిగెట్టి పందెం చూలాగా నేనే గెలిచీగలను, తెలుసోయ్?"

"కానీ జైలుకెళ్తావ్ కదా ఇప్పుడు—ఈ సంగతి తెలుసా నీకు?"

అతని ఆవేశమంతా దిగిపోయింది. తల వాలిపోయింది. నిస్సహాయంగా కింద కూలబడి, గోడకానుకుని కూర్చున్నాడు ముడుచుకుని. తల రెండు చేతుల్లో పట్టుకుని

ఆలోచిస్తూండిపోయాడు, నేలకేసి చూస్తూ.

వర్షం ఇంకా ఉధృతమైంది బయట...

"అవును, బాబయ్యా..." పలికాడతను అస్పష్టంగా, "నేను శానా తప్పుసేశా. పొరబడ్డా. లోగొట్టు నాకేం ఎరుక మరి? డబ్బు శానా వుంటాదనుకున్నా, దగా సేసి పోయేడు నీ వొర. ఆరి డబ్బు యవ్వారాలు నాకేం తెలుస్తాయి సెప్పు?..నాకిక సావే మిగిలింది..సావొక్కటే మిగిలింది..."

వెనుకనుంచి నాకేదో తగిలింది చల్లగా...

చటుక్కున తిరిగి చూశాను.

నా కళ్ళు కొయ్యబారిపోయింది. తడిబట్టల్లో సరోజ!

నా చెయ్యి పట్టుకొని, నన్నానుకుని, గదిలోకి చూస్తోంది రాజయ్యనీ, కింద పడివున్న వస్తువుల్నీ, భయం నిండిన కళ్ళతో.

అపనమ్మకంగా, ఆందోళనగా, అయోమయంగా చూస్తున్నానామె వంక.

రాజయ్య దగ్గాడు. అతడి కళ్ళు సరోజమీదపడ్డాయి. ముఖ కండరాలు బిగుసుకున్నాయి. పేలవమైన నవ్వు పెదాలమీద నిలిచింది...

"వచ్చేవా అమ్మా...అదిగో బాబయ్యా. నీకు సెప్పి వోడ్ని గురుతున్నదా, మావోడు నన్నొగ్గీసి పోకపోతే నాకు నీఅంత మనవడుండీ వోడని? అదిగో నూడు... మనవడంత లేకున్నా మనవరాలుంది. నా మనవరాలు సరోజమ్మ..."

"నీ మనవరాలు సరోజనా!"

"ఆ నాగిగాడు నా మనవడేను, బాబయ్యా.... ఫిచ్చెదవ! పిచ్చెదవ! బొచ్చెడు అక్కరకొస్తాడనుకున్నా.

రాత బాగోలేక సంపుకున్నా! ఆడ్నీ, ఆడి పిల్ల దాన్నీ రాణీని నేనే సంపించేసి పారేశా, పాపిష్టెదవని!"

"బాబూ, దాన్నేమనకు. దాని తప్పులేదు. వట్టి అమాయకురాలే... రెండేళ్ళక్రితాన, నీ దొరకాడ పనిలో కుదిరినప్పుడు దీన్ని సూసి శానా అబ్బురపడ్డా! ఎప్పుడో పన్నెండేళ్ళక్రితాన, దీనికి పన్నెండేళ్ళప్పుడనుకుంటా బాబయ్యా, నన్నొగ్గేసి పోయేడు మావోడు, నాతో పెంచాయితీ పెట్టుకుని. ఆయేలప్పట్నుంచీ ఆళ్ళ జాడ నాకేమీ తెలవదు. గప్పుడు దాన్నిక్కడే సూసి నేనెంత ఆనందపడ్డానో, బాబయ్యా, దేముడెంత ఇసిత్రంగా కలుపుతాడో కదా మడుసుల్ని!

"నా మనవరాలు నన్ను పోల్చుకుని ఏడ్సింది బాబయ్యా, తన కతంతా సెప్పుకుని. అది ఇని శానా బాదపడ్డా. మావోడంత ఎదవ సన్నాసీ అవుతాడనుకో లేదు, బాబయ్యా. ఆడబిడ్డని అలా నడీదిలో ఒగ్గేసి పోయేడు. ఆడి కొడుకూగంతే అయ్యేడు. ఏమైనా మడుసులం మల్లీ కలుసుకున్నాం. రక్తసంబంధమలాంటిది బాబయ్యా, మడుసుల్ని కలిపితీరుతది యెప్పటికైనా."

క్షణమాగి, తిరిగి చెప్పసాగాడతను. "గప్పుడు బాబయ్యా, మన సంబంధం ఎవురికీ సెప్పొద్దని అమ్మాయికి సెప్పా గట్టిగా. యెందుకనంటే బాబయ్యా, నేనొక సక్కటి ఆలోచన సేసా. ముఫై సంవచ్ఛరాలు ఈ ఇంటి కత సూశా. నీ దొర యవ్వారం సూశా. ఇద్దరమ్మల సావుల్ని సూశా. ఏణ్ణర్థం పిల్ల సిన్నారిని సాకడానికి ఇస్వ పేయత్నం సేశా. నావల్లగాలేదు. గిదంతా తెలుసుకుంటే దొరమీద సెడ్డ కని పుట్టేసేది నాకు. గౌరవం, ఇస్వాసం యెంతకాలం నిలుస్తాయి బాబయ్యా, అవతలి

మడిసిలో గ్యానం ఇసుమంతైనా లేకంటే.

"నిజం సెప్తున్నా, గప్పుడే డబ్బాశ పుట్టింది నాకు. ఇస్వాసం సూపడానికి నీ దొర ఇగ తగడని గప్పుడే తెలుసుకున్నా, ఇద్దరు ఇల్లాల్ని సంపుకున్నాడు! మడిసా! రాచ్చసా! మల్లీ మూడో పెళ్ళికి తయారయ్యేడు శరం లేకుండా! ఏమంటే సిన్నారికి దిక్కునే సాకు! గట్లయితే ఆ వొచ్చే అమ్మకి ఆశీ పీడ తొలగించీసి, సుఖంగా బతికే మార్గం సూపించీసి, నా దారినసీదా పోవాలనుకున్నా, డబ్బుతో."

సరోజ నా చెయ్యి గట్టిగా పట్టుకొని, రెప్పవాల్చకుండా చూస్తోందతన్ని.

"గప్పుడు బాబయ్యా, ఆ కొత్త యిల్లాలి స్తానంలో నా మనవారాలొచ్చింది. దానికి నేనే సెప్పి ఒప్పించా. యెంతకాలం యిలా బతుకుతావ్, నీ దొరని బాగా మంచిసేసుకో, లాబాలుంటాయి, మనవాదేకంటే మహా రాణివై పోతావే తల్లీ అని. మోసం సేసేను, బాబయ్యా. గది నా సోర్దమే అయినా దాని మంచికోసమే సేశా.

"ఇల్లాలయ్యేకగాని తన కష్టాలు తెలకలేదు దానికి. అయినా సయించింది. దాని బాదలు సూడలేక నేను వేగిరపడ్డా. కాని నా ఆలోశన దానికసలు తెలియనివ్వలే. నా ఆలోశన—ఆశ—అదీ యాతనలు పడులేక ఏ పరాయోడ్నో సూసుకుంటే, ఉపాయంగా అల్లిద్దర్నీ వాడుకుని దొరని ఖతంసేసి పారీసి, అది ఆల్లే సేసినట్టు నమ్మించి, డబ్బు గుంజుకుని ఎల్లిపోవాలనుకున్నా బెదిరించి—అర్థమైందా, బాబయ్యా?"

"ఏడాదిన్నరి ఓపిక పలితంగా నువ్వొచ్చేశావు. అయిదు మాసాలు మిమ్మల్ని సూసీ సూసీ ఆలోశించా.

మీ యవ్వారం ఎవురికీ తెలకదనుకున్నారు మీరు. నేను గనిపెడుతూనే వున్నా. కానీ సమయం, ఒక మంచి మడిసి అవుసరం కూడా ఏర్పడ్డది నాకు...గప్పుడే ఇంకో ఇసిత్రం జరిగింది.”

“ఏమిటిది?”

“నెలకిందటే—ఆ సాయంకాలం సరోజమ్మ నీకాడికి కారేసుకుని ఎల్లినప్పుడు, ఇంట్లో యెవరూ లేరు, నేనూ సిన్నారీ తప్ప. సిన్నారి హాలులో కూసుని సదూకుంటోంది. నేను తోటలో తిరుగుతున్నా. గప్పుడే గేటులోంచి ఎవరో కుర్రాడు వచ్చాడు. ఆడ్ని చూసి దొంగాడనుకున్నా. ఆడు నాకాడికొచ్చి, ఇక్కడ నా అక్క సరోజ వుండాలి, యెక్కడ? అనడిగేడు.

“బాబయ్యా! ఆడ్ని పరిచ్చగా చూద్దునుగదా, పోలికలు కనిపించాయి. నా మనువదే ఆడు! సంబరంగా ఆడ్ని పట్టీసుకుని, ఓరి నాగిగా తాతనిరా భడవా! అన్నా. ఆడప్పుడు కోపం తెచ్చుకుని బూతులు తిట్టేడు. పేర్లు కూడా సెప్పి, సిన్నప్పటి ఇసయాలు గురుతు సేసీక గాని ఆడు నన్ను పోల్చుకోలేదు, బాబయ్యా.”

నా చెయ్యి చుట్టూ పట్టు ఇంకా బిగుసుకుంది. సరోజ కన్నార్పకుండా చూస్తోందలాగే, పాలిపోయిన ముఖంతో. ఆ కళ్ళనిండా దిగ్భ్రాంతి మాత్రమే వుంది.

“అప్పుడు?” అడిగాను రాజయ్యని.

“గుంటడు బలేగా ఎదిగిపోయాడు, బాబయ్యా. ఆడు తెగ సంబరపడిపోయి నన్ను కావలించీసుకున్నాడు. ఆడ్ని నా గదికి—ఈడికి తీసుకొచ్చా. గప్పుడు మేం కూసుని కానా మాట్లాడుకున్నాం. ఆడి గోడంతా సెప్పుకున్నాడు. అక్క మాట ఇనకి పెడిపోయానన్నాడు.

తల్లి తరువాత అక్కే తల్లిలాంటిది రా ఎల్రికూసా అని మందలించా. ఆడిప్పుడు అక్కకాడ డబ్బులడుక్కుని ఏదైనా యాపారం పెడతానన్నాడు. ఇంకా కానా సెప్పేడు. ఈ ఊరుకొచ్చి ఏడాదైనట. అక్క గిక్కడే వుందని ఆయేలే తెలిసిందట...

"బాబయ్యా, ఆడి మాటలన్నీ ఇంటూ నేనాలోశన సేశా. నేను సేయాలనుకుంటున్న పనికి ఈడే నాకు తగ్గ మడిసనిపించింది. ఈడ్ని బాగా నమ్మొచ్చు. నా మనవడే నన్ను మోసం సేయడు. ఆడికి నా ఆలోశన అప్పుడే సెప్పేలేదుగాని, అక్కని గప్పుడే కలవొద్దన్నా. నామాట పెకారం నడసుకుంటే కానా డబ్బొస్తుందన్నా. మర్నాడు ఈ యేళకే వొస్తే అంతా ఇవరించి సెప్తానన్నా. ఆడలాగేనని ఎల్లిపోయి మర్నాడొచ్చేడు......"

చెప్పటం ఆపి అతను లోతుగా ఊపిరి పీల్చాడు.

వర్షం ఇప్పుడు తగ్గిపోతోంది. కానీ ఈదురుగాలి వీస్తూనే వుంది. తలుపు నానుకుని నిలబడ్డ మేమిద్దరం చలి వణుకును ఆణచుకోలేక పోతున్నాం.

"గప్పుడు బాబయ్యా, నేనాడికి అంతా సంగతి సెప్పేశా!" అన్నాడు రాజయ్య, చలికి వణుకుతూ. "నా మాటలిని ఆడు సంబరపడిపోయాడు. నాతో సేయి కలుపుతానన్నాడు. ఆ వొచ్చే లచ్చలతో నన్ను ఎక్కడికో తీసికెల్లిపోయి, పెద్ద యాపారం పెట్టేసి, పేణంలా సూసుకుంటానన్నాడు. నేనెంతకాలం బతుకుతాను బాబయ్యా, ఇలా ఒంటరిగా? నాకు దిక్కుగా ఆ బగమంతుడే పంపాడనుకున్నా ఈడ్ని, ఈ ఆఖరి దినాల్లో.

"ఇగప్పుడు ప్లానేసుకున్నాం. ఎప్పుడేది సేయాలి

సక్కగా ఆలోశించాం. నీ దొరకి మీ యవ్వారం ఏమీ తెలవదు అప్పటికింకా. అరింకా ఈలునామా రాయలేదని తెలుసు నాకు. అరు పోతే ఆస్తి మా సరోజమ్మదే. అరు పోవాలంటే మేం సంపేయాలి. సంపీసి డబ్బు పొందాలంటే మిమ్మల్ని బెదిరించీయాలి. మీ యవ్వారమంతా ఫోటోలు గుంజి బెదిరించీవొచ్చు...''

రాజయ్య ఊపిరి పీల్చుకున్నాడు. "అంతే బాబయ్యా, మొన్న రేతిరి సరిగ్గా మేమనుకున్నట్టుగా జరిగిపోయింది. మీరింట్లో కలుసుకున్నారు, దొర ఊరు కెల్లిపోయేరనుకుని. అది సూసి మావోడు దొరికి ఫోన్ సేసీడు, ఓటల్ దగ్గర్నుంచే. వెంటనే ఆయన బయటకొచ్చేడు. టాక్సీ కారు కోసం సూసూండగా, అది ముందే సిద్దం సేసుకుని ఆడనే వున్న మావోడు అరిని ఎక్కించుకు వచ్చేసీడు. సీకట్లో, ఆ తొందర్లో దొర అడ్ని సూడలేదు. ఆడు టోపీ పెట్టుకుని వున్నాడు."

సరోజ ఉలిక్కిపడ్డట్టు నన్ను తాకుతున్న ఆమె శరీరం చెప్పింది. కళ్ళు మూసుకుని ఆమె నా భుజం మీద తల వాల్చేసింది.

రాజయ్య అంటున్నాడు. "అలా దొర వేరే కారులో రావటం మంచిది కాదు, బాబయ్యా. ఆ డ్రైవరు సిక్కులు తెస్తాడు. సీకు సిక్కులు వొస్తే మా పని జరగదు. గందుకే మావాడు డ్రైవరు వేసం కట్టేడు...ఇగ దొర ఇంట్లోకి రాగానే, అరి ఎనకనే ఆడూ వొచ్చి, నన్ను తలుపుకాడ వుండమని సెప్పి, బ్యాట్రీలైటూ కామ్రా తీసుకుని, నిచ్చినీసుకుని బాల్కనీలో కెక్కేసేడు. గప్పుడేం జరిగిందో మీకు తెలుసు, బాబయ్యా.

"నువ్వు దొరని పడేసి కొట్టగానే ఆడు ఫోటో

గుంజేసి, కింద నాకు బ్యాటరీ ఏశాడు బెల్లు నొక్కమని. నేను నొక్కేశా. మీరిద్దరు కిందికి వొచ్చేసేరు. ఆలోపునే మావోడు దిగి వచ్చేసేడు. కామ్రా నాకిచ్చేసి, దొర కేమైందో సెప్పేడు. నేను నిచ్చినకాడి కరికి, బురద కాళ్ళ సుబ్బరంగా తుడుసుకుని, పైకెక్కి బాల్కనీలోకి దిగి కిటికీలోంచి దూకేశా.

“దొర యింకా అలాగే పడివున్నాడు. కొంచెం దూరాన పూలకుండీ పడివుంది. దాన్ని రుమాలుతో పట్టుకుని ఆరి తలమీద రెండు దెబ్బలు కొట్టా. రక్తం వచ్చింది ఎంటనే. ఆరి సచ్చిపోయేవరకూ సూసి, అప్పుడు కిందికి వచ్చేశా. మావోడింకా మీతో మాట్లాడుతూనే ఉన్నాడు, మీ పేను పోటోలతో బెదిరిస్తూ. మిమ్మల్ని కింద ఆపివుంచడానికే అదలా నాటకమాడేడు.

“తర్వాత ఆడెల్లిపోయి బయట కాసుకున్నాడు, నా దగ్గర కామ్రా తీసుకుని. లోపలుండి నే సూస్తున్నా మీరేం సేస్తున్నారో. దొర నువ్వు కొట్టిన దెబ్బకే సచ్చిపోయేడనుకున్నారు మీరు. శవాన్ని మీరెక్కడో పాతేత్తారనుకున్నా. కానీ నువ్వు యేరే యిదంగా బెమ్మాండంగా జరిపించీసీవు, సురేష్‌బాబూ. శబాస్ అనుకున్నా.

“శవంతో నువ్వెల్లినప్పుడు వెంట ఆడు ఎంటాడి, యింకో పోటో తీసేడు ఓటల్ కాడ. గప్పుడు యింటికెళ్ళిపోయి బండిని వొదిలించీసుకున్నాడు. అంతే బాబయ్యా, మర్నాడుదయం నిన్ను కలిసి ఆడా కూనీ పోటోలు సూపించి నే సెప్పిన పెకారంగా అయిదు లచ్చలకి బేరం పెట్టేడు...”

రాజయ్య ముఖం ఎలాగో అయిపోయింది, లచ్చల నేసరికి. “మీరా డబ్బిత్తారని నమ్మకంగా అనుకున్నా.

మరో దారిలేదు మాకు మరి. కానీ ఇనిస్త్రంమీద ఇనిస్త్రం జరిగి—గదేంఖర్మో—బాబయ్యా—అంతా బుగ్గి అయిపోయిందో పో..."

సరోజ తేరుకుంది. ఆమె చాలా బలహీనంగా కనిపించింది...అతనీ రెండో రూపాన్ని చూడలేక, రెండు చేతుల్తోనో కళ్ళు మూసుకుని వెనక్కి తిరిగిపోయింది...

"కాదు-"అన్నాన్నేను అతన్ని తీక్షణంగా చూస్తూ "నీకు డబ్బు ఇప్పించాలని నేననుకోలేదు. నీవాడ్ని ఉచ్చులో బిగించి నాదారికి తేవాలనుకున్నాను. ఆ ఫోటోలన్నీ బేషరతుగా స్వాధీనం చేసుకోవాలనుకున్నాను...అందుకే వాడ్నిప్పుడు వెంటాడి వాడిపిల్లదాని ఇల్లు తెలుసుకున్నాను. ఆ రాత్రే ఆమెద్వారా కొన్ని విషయాలు తెలుసుకున్నాను. అయితే నాగేష్ నీకు చెప్పాడన్నమాట నా గురించి—నా చేతిలో ఎలా తన్నులు తిన్నాడో, ఇక ముందు కూడా తినే ప్రమాదముందో! అందుకని వీడెవడో మొండిఘటంలా వున్నాడనుకుని, నువ్వు నామీద కిరాయి మనుషుల్ని నియమించావన్నమాట! వాళ్ళతో నే ఆ రాత్రి నామీద దాడి జరిపించి, రాణిని చంపించావన్నమాట!"

"మరేం సేయమంటావు, బాబయ్యా?"

"తర్వాత ఇవ్వాళ ఉదయం — నేనూ సరోజా మాట్లాడుకుంటున్నప్పుడు—టాక్సీ డ్రైవర్ గురించి విని వుంటావు. అది నీ మనమడే గనుక వాడ్ని నేను పట్టుకుంటే నీ కుట్ర బయటపడుతుందని భయపడిపోయావు. అందుకే తిరిగి నామీద మనుషుల్ని పెట్టించి, నేను నాగేష్‌ని అలా పట్టుకుంటే, వాడ్ని చంపి పారేయమని ఆజ్ఞాపించావన్నమాట!"

"అంతే...తప్పలేదు, బాబయ్యా."

"బాగా జరిగింది. నీ కిరాయి మనుషులూ చచ్చారు. ఇక నువ్వు మిగిలావు, నీకూ చావొక్కటే మిగిలింది?"

"నేననుకోలేదు బాబయ్యా. ఇలా అవుతుందని. లాయరుబాబు వొచ్చి ఇలాటి వార్త సెప్తాడని. ఇంత అడియాస అయ్యేక ఇంకెలా బతకగలను? ఆశలన్నీ ఆ డబ్బుమీదే పెట్టుకున్నా. బతికిందే దానికోసం. నా మనవడ్ని సంపుకుందీ దానికోసమే. ఇహ డబ్బ్యాపోయే. జైలుపాలయ్యే బతుకంటే ఎలా బరించగలను? సావే.... సావొక్కటే మిగిలిందిక నాకు..."

"అందుకే చచ్చిపో!" అంది సరోజ గిరుక్కున తిరిగి, "నువ్వెళ్ళిపో ఇక్కడ్నుంచే దయచేసి. నాకు నువ్వు లేవు—నాకెవరూ లేరు! ఇంకకొక్క క్షణం కూడా వుండొద్దు నా కళ్ళముందు. నీ కొడుక్కి నువ్వేం తీసిపోలేదు. నీ కొడుకూ నువ్వూ నీ మనవడు కలిసి దగా చేశారు నా జీవితాన్ని. ఇకనైనా నేను సుఖంగా వుండాలనుకుంటే నువ్వు చచ్చిపోవడమే మంచిది, యెక్కడికైనా వెళ్ళిపోయి. నువ్వు చేసిన పాపాలకు నన్ను బలిచేయకు!"

అతను లేచి తూలుతూ వచ్చాడు. "లేదమ్మా, నీకింకా అన్నాయం సేయను. ఈ పాడు యవ్వారమంతా నాతో పాటే కలిసిపోద్ది మట్టిలో... పోలీసోళ్ళకి దొరకను. నిన్నిదిలోకి లాగను. యిప్పుడే పోయి ఏ రోడ్డుమీదనో, పట్టాలమీదనో పడుకుంటా. లేకపోతే యెందులోనో దూకుతా. పేణం తీసుకుంటా. గప్పుడే నాకు శాంతి.... గప్పుడే నాకు శాంతి...ఈ బతుకెంతెహ!...సావులో నే సుకముందెహ!..."

తడబడుతూ, తూలుతూ, అడుగులేసుకుంటూ సాగిపోతున్నాడతను బయటికి. మేమలాగే చూస్తున్నాం కదలకుండా. అతడింకా వేగంగా, ఉద్రేకంగా చేతులూపుకుంటూ, ఏదో గొణుక్కుంటూ సాగిపోతున్నాడు చీకట్లోకి... గేటులోంచి కనుమరుగయ్యేవరకూ చూస్తూండిపోయాం నిశ్శబ్దంగా.

"సురేష్...ఓహ్, సురేష్!" హఠాత్తుగా ఆమె నా మెడచుట్టూ చేతులువేసి, ఛాతీపై తలవాల్చి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

నా గుండె వేగంగా కొట్టుకుంది. తేరుకున్నాను ఆమె తల నిమురుతూ. "పూర్ణా! ఇక అయిపోయింది. మనకేం కాదు. నేను హంతకుడ్ని కాను. నేను హత్య చేయలేదు తెలుసా!"

"ఓహ్, దేవుడెందుకీ పరీక్ష పెట్టాడు, సురేష్!"

"వాడికి సరదా."

నా మనసెలాగో అయిపోయింది. ఈమెనా అనుమానించాను నేను? థాంక్ గాడ్! నా అనుమానాలు బయటపెట్టి న్యూసెన్స్ సృష్టించలేదు నేనింకా! ఎంత అసహ్యించుకుని ఉండేది! డర్టీ ఫెలోని! డబుల్ డర్టీ ఫెలోని! ఎంత తిట్టుకున్నా నేను చేసిందానికి నిష్కృతి లేదు—

తలుపు మూసి, ఆమెని పట్టుకొని నడిపించుకుంటూ ఇంటివైపు సాగాను...

"సురేష్, ఇక యిక్కడేదీ మనది కాదు. ఈ క్షణం నుంచీ ఇక్కడ మనం అతిథిమాత్రులం. నాకేంకాలేదు. ఆ చిన్నారికే అన్యాయంచేసి పోయాడు తండ్రి..."

"నాన్సెన్స్—" ఆమె భుజం పట్టి వూపాను,

191

"చిన్నారికి దేనికవసరం డబ్బు? డబ్బూ, డబ్బూ! అవొక్కటేనా మనిషికి? దానికి ప్రేమ కావాలి, ఆదరణ కావాలి. అవి ఇవ్వలేనప్పుడు ఇంకేదీ ఆశించదు తండ్రి నుంచి."

"దాన్ని మన స్వంత బిడ్డలా చూసుకుందాం, సురేష్."

"అలాగే" అన్నాను. ఆమెని లేపి భుజాన వేసుకుని పరుగుతీశాను ఇంట్లోకి....

—:ఐ పో యి ం ది:—